
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY



శ్రీ పొట్టిశ్రీరాములు
నెల్లూరు
బుధవారం 9 ఆగస్టు 2017 | 16



కసుమూరు దర్గాలో ప్రార్థనలు చేస్తున్న వెంకయ్యనాయుడు



ఉపరాష్ట్రపతిగా ఎన్నికైన వెంకయ్యను సత్కరిస్తున్న శ్రీరామపురం గ్రామస్థులు

ఐక్యతతోనే అభివృద్ధి


- కులాల కుళ్లుకు దూరంగా ఉండండి
- చట్టసభల గౌరవాన్ని కాపాడుతా
- స్వగ్రామంలో వెంకయ్య నాయుడు
- స్వర్ణభారత్ ట్రస్టులో విద్యార్థులతో ముఖాముఖి

ఐక్యతతోనే అభివృద్ధి సాధ్యమని భారత ఉపరాష్ట్రపతిగా ఎన్నికైన ముప్పవరపు వెంకయ్యనాయుడు అన్నారు. మంగళవారం ఆయన తన స్వగ్రామమైన వెంకటాచలం మండలంలోని చౌటపాళెంతోపాటు శ్రీరామపురం, కసుమూరు గ్రామాలలో పర్యటించారు. గ్రామస్థులతో ఆప్యాయంగా మాట్లాడారు. అనంతరం స్వర్ణభారత ట్రస్టులో జరిగిన ముఖాముఖిలో విద్యార్థుల ప్రశ్నలకు వెంకయ్య సావధానంగా సమాధానం ఇచ్చారు.

- వివరాలు సెంటర్‌స్ప్రెడ్, మెయిన్‌లో..



తడ : పూడికుప్పంలో ఓ ఇంటిలో ఉన్న బియ్యం బస్తాలు



పేదోళ్ల బియ్యం.. పెద్దలకు పరమాన్నం

- సరిహద్దు దాటుతున్న రేషన్ బియ్యం
- రోజుకు 150 టన్నులు రవాణా
- కిలో రూ.1 బియ్యం 8కి కొంటున్న డీలర్లు
- బ్లాక్ మార్కెట్లో రూ.14 వరకు విక్రయం
- తమిళ రేషన్ బియ్యమూ రీసైక్లింగ్
- మూడు మండలాల్లో స్టాక్ పాయింట్లు
- శాఖల వారీగా అధికారులకు మామూళ్లు
- తడ పోలీసుల తీరుపై గతంలోనే ఎస్పీ వార్నింగ్
- తాజాగా 25 టన్నుల తమిళ రేషన్ బియ్యం స్వాధీనం

పేదల బియ్యంపై పెద్దల కన్నుపడింది. ఆంధ్రా, తమిళ రాష్ట్రాల్లో పేదోళ్లకు పంపిణీ చేస్తున్న రేషన్ బియ్యాన్ని కొంతమంది డీలర్లు, వ్యాపారులు కుమ్మక్కై రీసైక్లింగ్ చేస్తున్నారు. ఇందుకుగాను తడ, నాయుడుపేట, సూళ్లూరుపేట ప్రాంతాల్లో స్టాక్ పాయింట్లు కూడా వెలిశాయి. రోజుకు 150 టన్నుల దాకా సరిహద్దులు దాటుతున్నట్టు సమాచారం. రూ.లక్షల్లో వ్యాపారం జరుగుతోంది. ఇందుకు సహకరిస్తున్న పౌరసరఫరాలు, రెవెన్యూ, పోలీసులకు నెల మామూళ్లు అందుతున్నట్లు విశ్వసనీయ సమాచారం. తాజాగా తడలో 20 టన్నుల తమిళ ఉప్పుడు బియ్యం, మరో ఐదు టన్ను ఏపీ రేషన్ బియ్యం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

- వివరాలు 6లో

ఇరిగేషన్‌లో పది కోట్లకు 'టెండర్'

- ఇప్పటికే రూ.35 కోట్లతో పనులు మొదలు
- తాజాగా మరో 10 కోట్లకు అనుమతులు
- నీటి సంఘాల పేరిట రూ.6 కోట్ల పనులు
- నీరు- ప్రగతిలో గోప్యంగా సాగుతున్న వ్యవహారం
- నిధులన్నీ సదరన్, రేబాల సప్లయ్ ఛానళ్లకే

16వ పేజీలో



ఇసుకపాళెం పరిధిలోని రేబాల సప్లయ్ ఛానల్

అమ్మో జ్వరం!

- ఆసుపత్రుల నిండా బాధితులే!
- పది వేలకుపైగా కేసుల నమోదు
- డెంగ్యూ, మలేరియా వణుకు
- చికిత్స కోసం నెల్లూరు, చెన్నైకు పరుగు
- ప్రజల్లో కొరవడిన అవగాహన
- వైద్య శాఖకు నిర్లక్ష్యపు జబ్బు

- వివరాలు 8లో



ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

ఇంటికొచ్చేస్తానని.. అంతలోనే!


- కాటేసిన మృత్యువు
- ఎదురెదురుగా ఢీకొన్న బైక్‌లు
- ఇద్దరు దుర్మరణం
- నెల్లూరు శివార్లలో ఘటన


6 లో..

చితికిపోతున్న జీవితాలు

ప్రేమ వైఫల్యం.. పెళ్లి కుదరకపోవడం.. ఆర్థిక ఇబ్బందులు.. అనారోగ్య సమస్యలు.. వరకట్న వేధింపులు.. కుటుంబ కలహాలు.. ఆకతాయిల ఆగడాలు.. తదితర కారణాలతో తనువు చాలిస్తున్న వారి సంఖ్య జిల్లాలో రోజురోజుకూ పెరుగుతున్నది. ఇందుకు తీవ్ర ఒత్తిళ్లే కారణంగా తెలుస్తోంది. క్షణికావేశంలో జరుగుతున్న ఈ బలవన్మరణాలతో ఆయా కుటుంబాలలో తీరని దుఖఃమే మిగులుతుంది. ముఖ్యంగా యువతీ, యువకులే ఎక్కువగా ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు.

- నెల్లూరు (క్రైం)





- స్వల్ప కారణాలతో బలవన్మరణాలు
- క్షణికావేశంలో విచక్షణ మరిచి..
- కుటుంబాలలో తీరని శోకం
- జిల్లాలో పెరుగుతున్న ఆత్మహత్యలు
- ఒత్తిళ్లే దుశ్చర్యలకు కారణం
- యువతలోనే అత్యధికం

జిల్లాలో ఇటీవలి బలవన్మరణాలు అధికమయ్యాయి. కారణాలు ఏవైనా మనోస్థైర్యం కోల్పోయి క్షణికావేశంతో ఆత్మహత్యకు పాల్పడుతున్న వారి సంఖ్య పెరుగుతుంది. కొందరు చిన్న చిన్న సమస్యలకే కుంగిపోయి అర్థాంతరంగా జీవితం చాలిస్తుండడంతో వారి కుటుంబాలు చిన్నాభిన్నమవుతున్నాయి. ఈ నేపథ్యంలో ఒక్క క్షణం ఆలోచించి సమస్యలకు పరిష్కారం వెతికేందుకు ప్రయత్నించాలని, ముఖ్యంగా యువతకు కౌన్సెలింగ్ నిర్వహించాలని మానసిక నిపుణులు సూచిస్తున్నారు.

● మానసికంగా కుంగుబాటు

ఎంతో కష్టపడి పిల్లలను చదివించాలని మధ్య తరగతి తల్లిదండ్రులు భావిస్తున్నారు. పట్టణాలకు, నగరాలకు చేరుకునే యువత ప్రేమ, ఇతర వ్యాపాకాల్లో పడి సమయాన్ని వృథా చేసుకుంటున్నారు. కుటుంబీకుల ఆశలు నెరవేర్చలేదన్న కారణంతో బలవన్మరణాలకు పాల్పడుతున్నారు. మరోవైపు మహిళలు, బాలికలు చిన్న విషయాలను కూడా తట్టుకోలేక పోతున్నారు. కష్టాలను ఎదిరించలేక ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు.

● ఒత్తిడిని జయిస్తే విజయమే..

చాలామంది మానసిక ఒత్తిడితో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రేమ విఫలమైన వారు ఆ ప్రేమను తల్లిదండ్రుల్లోనూ వెతుక్కోవాలి. మార్కుల్లో వెనుకబడిన విద్యార్థులు సైతం దశ్చర్యలకు పాల్పడడం సరికాదని నిపుణులు సూచిస్తున్నారు. ఆరోగ్యం బాగాలేక పోయినా ప్రస్తుతం వైద్యశాస్త్రంలో ఎన్నో అధునాతన పద్ధతులు వచ్చాయి.

● అసంతృప్తి వ్యక్తం చేస్తూనే..

జీవితంలో చాలామంది తమ బాధను వ్యక్తం చేస్తూ జీవితాన్ని ముగిస్తానని చెప్పకనే చెబుతుంటారు. అలాంటి వారిలో ధైర్యం నింపి చనిపోతే ఏమీ రాదని, బతికి సాధించాలని చెప్పాలి. కుటుంబ సభ్యులందరూ కలసి రోజులో ఒకసారైనా భోజనం చేయాలి. ఫలితంగా మనసు తేలికగా ఉంటు ంది. అధికారులు కూడా ఆత్మహత్యల నివారణ కోసం ప్రత్యేక కార్యక్రమాలు ఏర్పాటు చేయాలి. చిన్నతనం నుంచే పిల్లల్లో ఆత్మవిశ్వాసం పెంపొందించడంతో పాటు భావోద్వేగాలు, సమన్వయం చేసుకునేలా మేథోశక్తికి పునాది వేయాలి. విలువలతో కూడిన జీవితం ఉండాలని నేర్పించాలి. మంచీచెడూ విలక్షణ నేర్పాలి.

క్షణికావేశంతోనే బలవన్మరణాలు

క్షణికావేశంతోనే ఎక్కువ మంది బలవన్మరణాలకు పాల్పడుతున్నారు. సమస్యను అధిగమించేందుకు ఆలోచన చేయకపోవడం, విచక్షణ కోల్పోవడంతోనే ఈ ఘటనలు చోటు చేసుకుంటున్నాయి. .వీరికి పూర్తిగా జీవితంపై అవగాహన కల్పించాలి.కుటుంబ సభ్యులు కూడా వారికి అండగా నిలబడాలి. అప్పుడే వీటిని కొంత వరకు నివారించే అవకాశం ఉంటుంది. మా వద్దకు వచ్చే వారికి ఈ విధమైన కౌన్సెలింగ్‌లు ఇస్తున్నాం.



- శ్రీనివాసాచారి, మహిళా స్టేషన్ డీఎస్పీ

మానసిక ఒత్తిడే కారణం



పెరుగుతున్న మానిసిక ఒత్తిడిలే బలవన్మరణాలకు కారణమవుతున్నాయి. పెద్దలతో కూర్చుని చర్చించినా, ప్రశాంతంగా ఆలోచించినా సమస్యకు పరిష్కారం లభిస్తుంది. నేటి పరిస్థితుల్లో దేని గురించి ఆలోచించే పరిస్థితులే లేవు. త్వరగా నిర్ణయాలు తీసుకోవడం, వెంటనే వాటిని అమలు చేయడం చేస్తున్నారు. దీనివల్ల వచ్చే సమస్యలను తట్టుకోలేక ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. అందుకే ఇలాంటి వారికి తొలి నుంచి కూడా కౌన్సెలింగ్ ఎంతో అవసరం. అవసరమైతే వైద్యులను సంప్రదించి చికిత్స అందిస్తే వీటిని నివారించవచ్చు.

- డాక్టర్ రాధాకృష్ణరాజు

యాంత్రికమైన జీవనం

మనుషులు నేడు యాంత్రిక జీవనం గడుపుతున్నారు. కనీసం కుటుంబసభ్యులు, స్నేహితులతో కూడా కూర్చుని మాట్లాడుకునే సమయం కూడా లేకుండా పోతుంది. ఇంట్లో వాళ్ల టీవీలు, కంప్యూటర్‌లకు అతుక్కుపోతూ మొబైల్ జీవనాన్ని గడుపుతున్నారు. అందరూ ప్రేమానురాగాలు పొందుతూ, ఆత్మీయతను పంచుకుంటేనే మానవ జీవనానికి మనుగడ ఉంటుంది.



- పీ పూర్ణిమాదేవి, న్యాయవాది

బలవన్మరణానికి ఉదాహరణలు

● నెల్లూరు కామాటివీధికి చెందిన కార్పెంటర్ లింగాల మల్లికార్జునకు (28) ఏడాది క్రితం పెళ్లైంది. కుటుంబంలో తలెత్తిన చిన్న వివాదంతో నక్కలోళ్ల సెంటర్ సమీపంలో రైలుకింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు.

● నెల్లూరు వెంగళరావునగర్‌లో ఉంటున్న కొమరగిరి శ్రీనివాసులు (36) కార్పొరేషన్‌లో కాంట్రాక్ట్ కూలీ. దంపతుల మధ్య విభేదాలు, ఆర్థిక ఇబ్బందులతో తన ఇంటిలోనే బలవన్మరణానికి పాల్పడ్డాడు.

● నవాబుపేట శ్రీనివాసనగర్‌లో బషీర్, షాబీరా దంపతులు ఉంటున్నారు. షాబీరా (38) టీవీ చూస్తుండటంతో బషీర్ మందలించాడు. ఇది తట్టుకోలేక తన ఒంటిపై కిరోసిన్ పోసుకుని నిప్పంటించుకుంది. చికిత్స పొందుతూ మృతి చెందింది.

● ఎంసీ బాలయ్య నగర్ ప్రాంతానికి చెందిన ఓ యువతి (18) ఓ ప్రైవేటు ఆసుపత్రిలో వారం రోజుల క్రితం రిసెప్షనిస్ట్‌గా చేరింది. ఈ నేపథ్యంలో ఓ యువకుడితో మాట్లాడటం గమనించిన వైద్యుడు ఆ యువతిని పిలిపించి 'నీ తండ్రిని తీసుకుని వస్తే ఉద్యోగం ఇస్తా'నని పంపించేశాడు. ప్రేమ విషయం ఇంట్లో తెలిస్తే ఇబ్బందులు ఎదురవుతాయన్న భయంతో బలవన్మరణానికి పాల్పడింది.

● విడవలూరు గాంధీనగర్‌కు చెందిన పామూరు నిరంజన్ భార్యతో విభేదాలు ఏర్పడ్డాయి. దీంతో జీవితంపై విరక్తి చెంది పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు.

● కనిగిరి మండలం కుడుముల దిన్నెపాడుకి చెందిన అంకమరావు(18) కుటుంబం బీవీనగర్‌లో నివాసం ఉంటుంది. ఇంజనీరింగ్ చదివే ఈ విద్యార్థికి కళాశాల ఫీజులు చెల్లించడం, ఇతర ఆర్థిక సమస్యలు అధికం కావడంతో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు.

● నవాబుపేటకు చెందిన పెసల ఈశ్వరమ్మ భర్త రమణయ్య కొద్దిరోజుల క్రితం గుండెపోటుతో మృతిచెందాడు. అప్పటి నుంచి ఈశ్వరమ్మ మానసికంగా ఇబ్బంది పడుతూ యాసిడ్ తాగి మృతిచెందింది.

కక్షసాధింపు చర్యలు మానుకోవాలి

● అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి సుజాతమ్మ

ఉద్యోగపర్వం



"అంగన్‌వాడీలపై కక్షసాధింపు చర్యలు మానుకోవాలి. జిల్లాలో ఎప్పుడు ఏం జరుగుతుందో అనే భయాందోళన మధ్య వర్కర్లు విధులు నిర్వహిస్తున్నారు. మూడు నెలలుగా జీతాలు లేవు. 13 నెలల అద్దె బకాయిలు ఉన్నాయి. ఏడాదిగా గ్యాస్ బిల్లులు చెల్లించలేదు. రెండేళ్లుగా పోపు బిల్లులు బకాయి ఉన్నాయి. ఏడాదిగా టీఏ బిల్లులు చెల్లించాల్సి ఉంది. అంగన్‌వాడీ వర్కర్లు ఎన్నో కష్టనష్టాలకు ఓర్చి సెంటర్లను నడుపు తున్నారు. అసలే ఆర్థిక ఇబ్బందులు పడుతున్న వారిని తనిఖీల పేరుతో మానసికంగా హింసించడం సబబుకాదు. గత నెల 17వ తేదీన ఉదయగిరి ప్రాజెక్టు పరిధిలో సీడీపీవోలతో తనిఖీలు నిర్వహించి, ఐదు పాయింట్ల కంటే తక్కువ వచ్చిన వారికి షోకాజ్ నోటీసులు జారీ చేశారు. గతంలో వెంకటగిరి ప్రాజెక్టు పరిధిలో కూడా నోటీసులు జారీచేశారు. ఇది దారుణం. పీడీ కక్షసాధింపు చర్యలకు పాల్పడుతుండడం శోచనీయం. పీడీ వస్తున్నారంటే నోటీసులు తప్పవనే ఉద్దేశంలో వర్కర్లు ఉన్నారు. దీనిపై యూనియన్ రాష్ట్ర కమిటీ నిర్ణయం మేరకు తదుపరి కార్యాచరణ చేపడతాం."

- నెల్లూరు (వేదాయపాళెం)

ముగింపు దశకు టీచర్ల బదిలీల కౌన్సెలింగ్

నెల్లూరు (క్యాంపస్) : ఉపాధ్యాయుల బదిలీల కౌన్సెలింగ్ ముగింపు దశకు చేరుకొంది. నెల్లూరు జడ్పీ కార్యాలయంలో ఈ నెల 1వ తేదీ నుంచి కౌన్సెలింగ్ ప్రారంభమైంది. మొదట జడ్పీ కార్యాలయంలోని రెండు హాళ్లలో కౌన్సెలింగ్ నిర్వహించారు. తర్వాత మూలాపేటలోని ప్రభుత్వం బాలికోన్నత పాఠశాలలో మరో కౌన్సెలింగ్ కేంద్రాన్ని ప్రారంభించారు. మొదట ఇచ్చిన షెడ్యూల్ ప్రకారం ఆగష్టు 14వ తేదీ వరకు కౌన్సెలింగ్ జరగాల్సి ఉంది. కమిషనర్ సంధ్యారాణి త్వరగతిన కౌన్సెలింగ్ పూర్తి చేయాలని ఆదేశాలు జారీ చేయడంతో మరో షెడ్యూల్‌ను డీఈవో విడుదల చేసి ఆర్ధరాత్రి వరకు కౌన్సెలింగ్ నిర్వహించారు. మళ్లీ ఉపాధ్యాయులు కమిషనర్‌ను ఆశ్రయించడంతో మరో షెడ్యూల్‌ను విడుదల చేసి ఎనిమిది గంటల వరకు మాత్రమే నెంబర్‌తో సంబంధం లేకుండా కౌన్సెలింగ్ సాగింది. మొత్తం మీద మంగళవారం 1501వ ర్యాంకు నుంచి 2100 వరకు జడ్పీ కార్యాలయంలో కౌన్సెలింగ్ జరగ్గా, బాలికోన్నత పాఠశాలలో ఎల్‌పీ తెలుగు ఉపాధ్యాయులకు కౌన్సెలింగ్ పూర్తి అయింది. బుధవారం జడ్పీ కార్యాలయంలో 2101 నుంచి 2800 వరకు బాలికోన్నత పాఠశాలలో పీఈటీలకు కౌన్సెలింగ్ నిర్వహిస్తామని అధికారులు తెలిపారు. ఇదే జరిగితే గురువారానికి కౌన్సెలింగ్ పూర్తి అయే అవకాశం ఉంది. బదిలీ అయిన ఉపాధ్యాయుల సర్టిఫికెట్‌ల పరిశీలన బాలికోన్నత పాఠశాలలో జరుగుతున్నది.



బాలికోన్నత పాఠశాలలో కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న అధికారులు

ఐటీఐలో ప్రవేశానికి నేటి నుంచి దరఖాస్తుల స్వీకరణ

వెంకటగిరి: పట్టణంలోని ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణా సంస్థ (ఐటీఐ)లో 2017-18 విద్యా సంవత్సరంలో ప్రవేశానికి ఈనెల 17న కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ కేపీ నరసింహరావు తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ మొదటి విడత నిర్వహించిన కౌన్సెలింగ్ పూర్తయినప్పటికీ సీట్లు ఉండటంతో రెండో విడత కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందుకోసం బుధవారం నుంచి దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు. దరఖాస్తు చేసుకొనేందుకు ఈ నెల 15వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు అవకాశం ఉందన్నారు. దరఖాస్తులు కావల్సిన వారు స్థానిక ఐటీఐ పనివేళల్లో రూ.10 చెల్లించి పొందవచ్చన్నారు. కౌన్సెలింగ్‌కు హాజరయ్యే అభ్యర్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరు కావాలని ఆయన పేర్కొన్నారు.

తప్పు చేస్తే చర్యలు తప్పవు

ఐసీడీఎస్ ఇన్‌చార్జి పీడీ ప్రశాంతి



మాట్లాడుతున్న ఐసీడీఎస్ ఇన్‌చార్జి పీడీ ప్రశాంతి

కోట: అడిగేవారు లేరని తప్పులపై తప్పులు చేస్తే, చర్యలు తప్పవని స్త్రీ శిశుసంక్షేమ శాఖ ఇన్‌చార్జి ప్రాజెక్టు డైరెక్టర్ ప్రశాంతి హెచ్చరించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం కోట, వాకాడు, చిట్టమూరు మండలాల అంగన్‌వాడీ వర్కర్లతో సీడీపీవో ఈశ్వరమ్మ అధ్యక్షతన జరిగిన సమావేశానికి ఆకస్మికంగా హాజరైన ఇన్‌చార్జి పీడీ పలు విషయాలపై ప్రశ్నించారు. పిల్లల వివరాలు ఆరాతాశారు. పౌష్టికాహారం విషయమై ప్రశ్నించారు. దీంతో కొంతమంది తడబడటంతో పీడీ వారిని మందలించారు. ఇలాగైతే కుదరదని, లెక్కలు పక్కాగా ఉండాని హెచ్చరించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో ఒక్కరోజైన నూరుశాతం పిల్లలు హాజరైన దాఖలాలు ఉన్నాయా, ఉంటే అందుకు సంబంధించిన రిజిష్టర్‌లను చూపించాలని కోరారు. దీంతో ఇప్పటి వరకు నూరుశాతం పిల్లలు హాజరు కాలేదని వర్కర్లు అన్నారు. అలాంటప్పుడు నెలవారీ సరుకులు నిల్వ ఉంటాయని, ఆ సరుకులను మినహాయించి మిగతా సరుకులు తీసుకోవాల్సిన సిబ్బంది అదనంగా సరుకులు తీసుకోవడంలో ఆంతర్యం ఏమిటని ప్రశ్నించారు. ఇలా ఉంటే పరిస్థితులు దారుణంగా ఉంటాయని, పక్కాగా పనిచేసి ఉన్నతాధికారుల మన్ననలు పొందాలన్నారు. సీడీపీవో ఈశ్వరమ్మతో పాటు సూపర్‌వైజర్‌లను ప్రతి అంగన్‌వాడీ కేంద్రాలపై పర్యవేక్షణ చేసి ఎప్పటికప్పుడు నివేదిక పంపాలన్నారు. పోషకాహారం పంపిణీపై నిఘా పెంచాలన్నారు.

రాష్ట్రంలో 12 బీసీ గురుకుల కళాశాలలు



రికార్డులు తనిఖీ చేస్తున్న ఏజీవో కిరణశ్రీ

కోట: రాష్ట్రంలో 2017-18 విద్యా సంవత్సరానికి సంబంధించి 12 బీసీ గురుకుల కళాశాలలు మంజూరయ్యాయని జోన్ 3, 4 అకడమిక్ గైడెన్స్ ఆఫీసర్ సీ కిరణశ్రీ తెలిపారు. మంగళవారం కోటలోని బీసీ గురుకుల పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల హాజరు పరిశీలించారు. ఉపాధ్యాయుల పనితీరు, హాజరు పరిశీలించి ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ నోవాబాబుకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ 12 కళాశాలల్లో నెల్లూరు జిల్లాలోని దొరవారిసత్రం, కోట బీసీ గురుకులాలు ఉన్నాయని, అందులో ఈ ఏడాది నుంచే కళాశాలలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అనంతపురం జిల్లాకు మూడు బీసీ గురుకులాలు మంజూరయ్యాయని తెలిపారు. కొత్త కళాశాలల్లో ఈ విద్యా సంవత్సరం నుంచే తరగతులు ప్రారంభమయ్యేందుకు ప్రభుత్వం అన్ని చర్యలు చేపడుతుందన్నారు. కొన్ని చోట్ల తరగతి గదుల కొరత ఉందన్నారు. ఈ కొరతను కూడా తీర్చేందుకు అన్ని చర్యలు చేపడుతున్నామన్నారు. రెండు మూడు రోజుల్లో ప్రభుత్వం నుంచి అధికారిక ఉత్తర్వులు వస్తాయని, ఆ వెంటనే తరగతులు ప్రారంభిస్తామన్నారు. ఆయన వెంట ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ నోవాబాబు, సయ్యద్‌బాషా తదితరులు ఉన్నారు.

క్యారమ్స్ జట్టు ఎంపిక

నెల్లూరు (క్యాంపస్) : అంతర్ జిల్లా పోటీలకు జిల్లా క్యారమ్స్ జట్ల ఎంపికలు మంగళవారం నగరంలోని ఈద్గామిట్ట ప్రాంతంలో ఉన్నా నెల్లూరు క్యారమ్స్ అసోసియేషన్ కార్యాలయంలో జరిగాయి. వెంకయ్య, వై రమేష్, బీ వెంకటేశ్వర్లు, గజేంద్ర, సుబ్రహ్మణ్యం, సాయిలు జట్టుకు ఎంపికయ్యారని అసోసియేషన్ అధ్యక్షుడు పులిమి దినకర్‌రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు.



శ్రీ. P. కృష్ణమూర్తి.

కొత్తపల్లి, ఆర్సీపాలెంలలో 'పొలం పిలుస్తోంది'

కావలిరూరల్: మండలంలోని కొత్తపల్లి, రాజువారి చింతలపాలెం గ్రామాల్లో మంగళవారం పొలంపిలుస్తోంది నిర్వహించారు. మండల వ్యవసాయ శాఖ అధికారి ఎం సురేష్‌బాబు మాట్లాడుతూ సూక్ష్మపోషకాలతో లాభాలు వివరించి వాటిని 100 శాతం రాయితీతో రైతులకు అందిస్తామన్నారు. రైతులు తప్పని సరిగా భూసార పరీక్షలు చేయించుకోవాలని, దానివల్ల ఉపయోగాలను వివరించారు. భవిష్యత్‌లో భూసార పరీక్ష కార్డు ద్వారానే ఎరువుల పంపిణీ జరుగుతుందన్నారు. అనంతరం పంటల బీమా పథకాల ఉపయోగాలను వివరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు చిమ్మిలి వసుమతి, గుంటూరు మల్లికార్జున, ఏఈవో అనిత, ఎంపీఈవో లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మస్టర్ వేయలేదని పారిశుధ్య కార్మికుల ఆందోళన

కమిషనర్ చొరవతో విరమణ

కావలి: కావలి పురపాలక సంఘ పారిశుధ్య కార్మికురాలు ఈశ్వరమ్మ మంగళవారం ఉదయం విధులకు హాజరు కాగా ఆమె సక్రమంగా పని చేయదని శానిటరీ ఇన్స్‌పెక్టర్ వెంకటయ్య మస్టర్ వేయలేదు. దీంతో కార్మికులు ఆందోళన చేపట్టారు. ప్రతిరోజూ ఉదయం 5.30 గంటలకే మున్సిపల్ కార్యాలయాలనికి చేరుకున్న కార్మికులు విధుల్లో పాల్గొంటున్నట్లు మస్టర్ వేయించుకొని అక్కడ నుంచి వారికి కేటాయించిన ప్రాంతాలకు వెళతారు. మంగళవారం ఉదయం ఈశ్వరమ్మ సక్రమంగా పని చేయలేక పోతోందని శానిటరీ ఇన్స్‌పెక్టర్ మస్టర్ వేయకపోవడంతో పారిశుధ్య కార్మిక యూనియన్ ఆధ్వర్యంలో కార్మికులు విధులకు వెళ్లకుండా కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఆ సమయంలో మున్సిపల్ కార్యాలయంలో ఉన్న కమిషనర్ ఏ వెంకటేశ్వర్లు శానిటరీ ఇన్స్‌పెక్టర్, కార్మిక నాయకులు, బాధిత కార్మికురాలినీ పిలిపించి చర్చించారు. అనధికారికంగా పనిచేస్తున్న కొంత మందిని విధుల్లో చేర్చుకునేందుకు పనిచేసే కార్మికులను కొంత మందిని విధుల నుంచి తొలగించాలనే ఆలోచనతో శానిటరీ ఇన్స్‌పెక్టర్ వెంకటయ్య మస్టర్ వేయకుండా ఇలాంటి వేధింపులకు గురిచేస్తున్నాడని కార్మికులు తెలిపారు. స్పందించిన కమిషనర్ కార్మికురాలు ఈశ్వరమ్మ సక్రమంగా పనులు చేయలేకపోతోందన్న విషయం తనకు తెలుసునని ఇక నుంచి సక్రమంగా పని చేయని వారిపై నిఘా ఉంచి తన దృష్టికి తేవాలని శానిటరీ ఇన్స్‌పెక్టర్‌ను ఆదేశించారు. ఆమెకు మస్టర్ వేసి పనిలోకి తీసుకోవాలని చెప్పడంతో కార్మికులు ఆందోళన విరమించి గంట ఆలస్యంగా విధులకు హాజరయ్యారు.


ఆందోళన చేస్తున్న పారిశుధ్య కార్మికులు

భక్తితో మంగళగౌరీ వ్రతం

కావలిరూరల్: కావలి రూరల్ మండలం గౌరవరంలోని పార్వతీ సమేత పంచభూతేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం మహిళలు మంగళగౌరీ వ్రతం ఆచరించారు. స్వామి, అమ్మవార్లను విశేషంగా అలంకరించి పూజించారు. ఆలయ ప్రాంగణంలో సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి పంచామృతాభిషేకం జరిపించారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. అర్చకులు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

పక్కా ఇళ్ల మంజూరుకు గ్రామ సభలు

కొండాపురం: అర్హులందరికీ పక్కా ఇళ్లు మంజూరు చేసేందుకు గ్రామ సభలు నిర్వహిస్తున్నామని ఇన్‌చార్జి ఎంపీడీవో గోపీనాథ్ అన్నారు. మంగళవారం మండలంలోని తూర్పుయర్రబల్లి, నేకునాంపేట గ్రామాల్లో ఆయన గ్రామసభలు నిర్వహించారు. తూర్పుయర్రబల్లిలో 214 మందికి పక్కా ఇళ్ళు అవసరమని గుర్తించగా 180 మందిని అర్హులుగా నమోదు చేశామన్నారు. వెలిగండ్లలో తహసీల్దార్ ప్రమీల, ఉప్పలూరులో వ్యవసాయ అధికారిణి సుధారాణి గ్రామసభలు నిర్వహించారు. పక్కా ఇళ్లకు అర్హత కలిగిన వారి నుంచి అర్జీలు తీసుకున్నారు. ఈ అర్జీలను పరిశీలించి ఒక నివేదిక తయారుచేసి ఉన్నతాధికారులకు పంపుతామని, వారి ఆదేశానుసారం అర్హుల జాబితా తయారు చేస్తామన్నారు.


సభలో అర్జీలు తీసుకుంటున్నగోపీనాథ్

ప్రభుత్వ ఆసుపత్రిలోనే ప్రసవాలు జరగాలి

ప్రోగ్రాం అధికారి డాక్టర్ వెంకటప్రసాద్

కావలి: ప్రభుత్వ ఆసుపత్రిలోనే ప్రసవాలు జరిగేలా ప్రజల్లో చైతన్యం తేవాలని తల్లిపాల వారోత్సవాల ప్రోగ్రాం అధికారి, జిల్లా క్షయనివారణ అధికారి డాక్టర్ జీ వెంకటప్రసాద్ పేర్కొన్నారు. తల్లిపాల వారోత్సవాల ముగింపు కార్యక్రమంలో భాగంగా మంగళవారం కావలి కట్‌పీసెస్ క్లాత్ మర్చంట్ కళ్యాణమండపంలో అంగన్‌వాడీ కార్యకర్తలతో సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా ఆయన మాట్లాడారు. ప్రసవం అయిన వెంటనే బిడ్డకు పట్టించే పాలల్లో వ్యాధి నిరోధక శక్తి ఉంటుందని ఆకలి, దాహం తీరుతాయన్నారు. గర్భిణి ప్రవించిన వెంటనే బిడ్డకు పాలివ్వాలన్నారు. ప్రభుత్వాసుపత్రిలో అన్ని రకాల పరీక్షలు, అవసరమైన మందులు ఉన్నాయని వాటిని సద్వినియోగం చేసుకుని తల్లిబిడ్డ ఆరోగ్యంగా ఉండేలా చూసుకోవాలన్నారు. పీఎంజేఎస్‌వై పథకం కింద ప్రతి నెల 9వ తేదీన ప్రభుత్వాసుపత్రుల్లో గర్భిణులకు అన్ని రకాల పరీక్షలను ఉచితంగా చేసి అవసరమైన మందులు అందజేస్తారన్నారు. అన్న అమృతహస్తం కింద అంగన్‌వాడీల ద్వారా గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం అందజేస్తున్నారు. తల్లిబిడ్డలకు అవసరమైన అన్ని రకాల వ్యాక్సిన్లు ప్రభుత్వాసుపత్రుల్లో అందుబాటులో ఉన్నాయన్నారు. చంద్రన్న సంచార చికిత్సను గ్రామీణ మహిళలు సద్వినియోగం చేసుకువాలని ఆయన కోరారు. కావలి సీడీపీవో సీహెచ్ పద్మజకుమారి మాట్లాడుతూ తల్లిపాల ఆవశ్యకతను వివరించారు. తల్లి ప్రసవించిన వెంటనే బిడ్డకు గంటలోపు పాలు పట్టించాలన్నారు. తల్లిపాలకు ముందు ఏమీ వాడరాదన్నారు. బిడ్డకు పాలు పట్టించేటపుడు రొమ్ము శుభ్రం చేసుకోవాలని, ఒక వైపు పాలిచ్చిన తరువాత రెండో వైపు కూడ పాలివ్వాలన్నారు. తొలుత ఇచ్చే పాలకన్నా రెండో వైపు ఇచ్చే పాలలో పోషక విలువలు ఎక్కువగా ఉంటాయన్నారు. తల్లిపాలు తాగిన పిల్లలు, పాలిచ్చిన తల్లులు ఆరోగ్యంగా ఉంటారన్నారు. తల్లిపాల ఆవశ్యకతను తెలియజేస్తు తగిన ప్రచారం చేపట్టాలని అంగన్‌వాడీకార్యకర్తలను కోరారు. ఈ కార్యక్రమంలో మెడికల్ అధికారి శ్రీనివాస్, ద్యామిని ఫౌండేషన్ కో-ఆర్డినేటర్ సతీష్, హెల్త్ ఎడ్యుకేటర్ సుధాకర్, ఐసీడీఎస్ ప్రాజెక్టు సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ప్రోగ్రాం అధికారి వెంకటప్రసాద్

● ఇంటర్వ్యూ



మట్కాపై ఉక్కుపాదం

కావలి ఒకటో పట్టణ ఎస్‌ఐ రోశయ్య

? : కావలి ఒకటో పట్టణ పరిధిలో మట్కా (సింగిల్ నెంబర్)బీటర్లపై తీసుకుంటున్న చర్యలేంటి.

! : మట్కా ఆట నిర్వాహకులను అరెస్టుచేసి చట్టపరమైన చర్యలు తీసుకున్నాం. ప్రస్తుతం పట్టణంలో మట్కా ఆట లేదు.

? : మట్కా బీటర్లు (స్లిప్పులు రాయించేవారు) రహస్యంగా కొనసాగిస్తున్నారంటున్నారు.

! : మట్కా బీటర్ల వివరాలు సేకరించి పిలిపించి హెచ్చరిక చేశాం. వారిలో ప్రమాదకరమైన వారిని ఇప్పటికే అరెస్టు చేశాం. ఈ ఆటను కొనసాగిస్తే కఠిన చర్యలు తప్పవు.

? : రాజకీయ నాయకులకు ఈ ఆటతో సంబంధాలున్నాయా.

! : ఇప్పటి వరకూ ఈ విషయం తమ దృష్టికి రాలేదు. సింగిల్ నెంబర్ ఆటతో సంబంధం ఉన్న ఎవరినీ ఉపేక్షించేది లేదు.

? : పట్టణంలో శాంతి భద్రతలు ఎలా ఉన్నాయి.

! : ప్రస్తుతం నేరాలు తగ్గుముఖం పట్టాయి. ఒకటో పట్టణ పరిధిలో ఏడు నెలలుగా దొంగతనం కేసు నమోదు కాలేదు.

? : ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు తీసుకుంటున్న చర్యలు.

! : పట్టణంలో ఆటోలతోనే ట్రాఫిక్ సమస్య ఉత్పన్నమవుతోంది. కొద్దిరోజులలో గ్రామాల నుంచివచ్చే ఆటోలను పట్టణంలో తిరగకుండా చూసి రద్దీని తగ్గించనున్నాం.

- కావలి క్రైం

సినిమా గైడ్

కావలి

మానస :	నక్షత్రం
లత ఏ/సీ : వార్‌ఫర్ ది ప్లానెట్ ఆఫ్ ది ఏప్స్	
ప్రశాంతి:	దర్శకుడు
ఎస్వీ వెంకటేశ్వర	పిదా

బాలసదన్ నుంచి బాలిక అదృశ్యం

నెల్లూరు (క్రైం) : నెల్లూరులోని బాలసదన్ నుంచి ఓ బాలిక అదృశ్యమైందని ఆ సంస్థ నిర్వాహకులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కొండాపురం గ్రామానికి చెందిన ఏడేళ్ల బాలిక సోమవారం బాలసదన్ నుంచి వెళ్లిపోయింది. సిబ్బంది అన్ని ప్రాంతాల్లో గాలించినా ఫలితం లేకపోవడంతో సూపరింటెండెంట్ విజయలక్ష్మి ఐదో నగర పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు వెంటనే అప్రమత్తమయ్యారు.

'విశ్వోదయ' భూమిపై విచారణ జరిపించాలి

కావలి: కావలిసర్వే నెంబర్ 2080లో 100 ఎకరాలల్లో విశ్వోదయ విద్యాసంస్థ భూమిపై విచారణ జరిపించాలని వామపక్ష పార్టీలు, ప్రజా సంఘాలు డిమాండ్ చేశాయి. మంగళవారం కావలి డీఎస్పీ రాఘవరావు, తహసీల్దార్ కృష్ణారావును వారు వినతి పత్రాలు అందజేశారు. విశ్వోదయ విద్యాసంస్థల నిర్వహణ కోసం భూమి తీజుకు తీసుకుని వాటిని అన్యులకు ధారాదత్తం చేసేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని వెంటనే ఆ భూమి అన్యాక్రాంతంపై విచారణ జరిపి ప్రభుత్వం ఏ ఉద్దేశ్యంతో విశ్వోదయకు ఆ భూమి ఇచ్చిందో తెలుసుకుని ఆ మేరకు వినియోగించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వామపక్ష నాయకులు భాస్కర్, పసుపులేటి పెంచలయ్య, డేగా సత్యం, ప్రజా సంఘాల నాయకులు ఎంజె వర్మ, సోమిశెట్టి బ్రహ్మయ్య, గోచిపాతల వెంకటేశ్వర్లు, ఏసన్న,చేవూరి వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.


డీఎస్పీకి వినతి పత్రం ఇస్తున్న నాయకులు

అగ్ని ప్రమాదాల నివారణపై విద్యార్థులకు అవగాహన

కావలి(క్రైం): అగ్నిప్రమాదాల నివారణపై విద్యార్థులు తప్పక అవగాహన కలిగి ఉండాలని కావలి ఇన్‌చార్జి అగ్నిమాపకదళ అధికారి జీ భాస్కర్ పేర్కొన్నారు. మంగళవారం కావలిరూరల్ మండలం తుమ్మలపెంట ముందరపొట్టెమ్మ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అగ్నిప్రమాదాల నివారణపై ప్రయోగాత్మకంగా అవగాహన కల్పించారు. ఇంట్లలో సంభవించే ప్రమాదాలపై వివరించారు. గ్యాస్ సిలిండర్ మండుతున్నపుడు తడిగుడ్డ సహాయంతో, ఫైర్ ఎక్స్టింగ్విషర్‌తో మంటలను నియంత్రించే విధానాన్ని చేసిచూపించారు. ఈ కార్యక్రమంలో కావలి అగ్నిమాపక ఇన్‌చార్జి అధికారి జి.భాస్కర్, సిబ్బంది, పాఠశాల కరస్పాండెంట్ బీకు రి ప్రభాకర్‌రావు, ప్రధానోపాధ్యాయిని సరస్వతి విజయభాస్కర్ తదితరులు పాల్గొన్నారు.


గ్యాస్ సిలిండర్ మంటలను ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది

రహదారి నిబంధనలు పాటించాలి

కావలి(క్రైం): వాహనచోదకులు రహదారి నిబంధనలు కచ్చితంగా పాటించాలని రెండో పట్టణ ఎస్‌ఐ చల్లా వాసు పేర్కొన్నారు. కావలి ఆర్టీసీ అధికారులతో స్థానిక ఉదయగిరి రోడ్డులో ఆటోలపై ఆయన ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. కావలి రూరల్, జలదంకి, కావలి పట్టణంలో 60 వాహనాలు తనిఖీచేశారు. నిబంధనలకు విరుద్ధంగా తిరుగుతున్న 15 వాహనాలపై కేసు నమోదు చేశారు. ఎస్పీ ఆదేశాల మేరకు నిత్యం రహదారులపై వాహనాల తనిఖీ ఉంటుందన్నారు. ఆటోల్లో సామర్థ్యానికి మించి ప్రయాణికులను ఎక్కించడం నేరమన్నారు. ఆటోడ్రైవర్లు యూనిఫాం ధరించాలని, బాడ్జీ నెంబరు, డ్రైవింగ్ లైసెన్సు కలిగి ఉండాలన్నారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ తప్పక ధరించాలన్నారు. వాహనానికి సంబంధించిన పత్రాలను వెంట ఉంచుకోవాలన్నారు.

విద్యుత్ స్తంభం నుంచి పడి ఒకరికి గాయాలు

కావలి(క్రైం) కావలి మద్దురుపాడు డీబీఎస్ కళాశాల సమీపంలో విద్యుత్ స్తంభం నుంచి వ్యక్తి జారిపడి గాయపడిన సంఘటన మంగళవారం రాత్రి జరిగింది. పెద్దినేని రామయ్య అనే వ్యక్తి ఇంట్లోకి విద్యుత్ సరఫరా జరిగే వైరు స్తంభం వద్ద తెగి పోవడంతో స్తంభం ఎక్కి దానిని సరి చేసేందుకు ప్రయత్నించాడు.ఈ సంద ర్భంలో ఆయన స్తంభం నుంచి జారి కింద పడ్డాడు. గాయాలయిన ఆయనను కావలి ఏరియా వైద్యశాలకు తరలించారు.


చికిత్స పొందుతున్న పెద్దినేని రామయ్య

పారిశుధ్య పరిరక్షణపై ప్రత్యేక దృష్టి : ఎంపీడీవో

కలిగిరి: కలెక్టర్ ఆదేశాల మేరకు ఈ నెల 7 నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకు మండల పరిధిలో పారిశుధ్య పరిరక్షణపై ప్రత్యేక దృష్టి సారించినట్లు ఎంపీడీవో నర్మద పేర్కొన్నారు. మంగళ వారం ఆమె మాట్లాడుతూ పారిశుధ్య పరిరక్షణ విషయమై మండల స్థాయి అధికారులు ఒక్కో గ్రామాన్ని దత్తత తీసుకొని వారం రోజుల పాటు పారిశుధ్య పరిరక్షణ చర్యలను పర్యవేక్షించాలన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా కలిగిరి పంచాయతీని తాను దత్తత తీసుకున్నారన్నారు. ఈ సందర్భంగా పంచాయతీలోని 4వ వార్డులో స్థానిక సర్పంచు పి. మాల్యాద్రి రెడ్డి, మధు సహకారంతో పారిశుధ్య పనులను ఆమె పర్యవేక్షించారు.

విద్యార్థినికి ట్రైసైకిల్ వితరణ


విద్యార్థినికి ట్రై సైకిల్ ఇస్తున్న మలిశెట్టి

కావలిటౌన్: డాక్టర్ బెజవాడ రవికుమార్, డాక్టర్ విజయ దంపతుల దాతృత్వంతో మంగళవారం స్థానిక శ్రీచైతన్య డిగ్రీ కళాశాల ఆవరణలో రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో దివ్యాంగ విద్యార్థినికి ట్రైసైకిల్ బహూకరించారు. రోటరీ క్లబ్ అధ్యక్షుడు ఏఎస్‌రావు ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా ఏఎంసీ చైర్మన్ మలిశెట్టి వెంకటేశ్వర్లు మున్సిపల్ పాఠశాల 5వ తరగతి విద్యార్థిని బత్తుల నీలమకు ట్రైసైకిల్, దుస్తులు బహూకరించారు. అనంతరం మలిశెట్టి మాట్లాడుతూ డాక్టర్ బెజవాడ రవికుమార్ దంపతులు సామాజిక సేవాలో ముఖ్యమైన పాత్ర పోషిస్తున్నారని, ప్రతి నెల ఒకరికి చొప్పున దివ్యాంగులకు ట్రైసైకిళ్లు ఇవ్వడం వారి సేవా నిరతికి నిదర్శనమన్నారు. రోటరీ అధ్యక్షుడు ఏఎస్ రావు మాట్లాడుతూ విద్యార్థుల సమక్షంలో ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడంలో వారిలో సేవాస్ఫూర్తి నింపుతాయన్నారు.

పూర్వజన్మసుకృతం

ఏఎంసీ చైర్మన్‌గా మలిశెట్టి వెంకటేశ్వర్లును చైతన్య కళాశాల గురువులు, రోటరీ ప్రముఖులు శాలువాలు, పూలమాలలతో సత్కరించారు. మలిశెట్టి మాట్లాడుతూ ఇంతమంది తనను అభినందించడం ఆనందాన్నిస్తోందన్నారు. చదువు చెప్పిన గురువులు అభినందించడం మరుపురాని అనుభూతని, పూర్వజన్మసుకృతంగా భావిస్తున్నానని భావోద్వేగానికి గురయ్యారు. ఈ కార్యక్రమంలో రోటరీ అసిస్టెంట్ గవర్నర్ మాధవరెడ్డి, కాపునాయకులు అళహరి కొండయ్య, నక్కా కుమార్, ప్రిన్సిపాల్ వీకే రాజు, రొటేరియన్లు వీరాస్వామి, టీజీకే మూర్తి, గోపీ కృష్ణ, వెంకటసుబ్బయ్య, కళాశాల డైరెక్టర్లు జానకిరాం, మధుసూదనరావు, ఎం కొండయ్య, జేవీవీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

విశ్వనాథరావుపేట అభివృద్ధికి నిధులు

బిట్రగుంట: విశ్వనాధరావుపేట పంచాయతీ అభివృద్ధికి రూ. 14.5 లక్షలు మంజూరయ్యాయని మండల కన్వీనర్ మాలెపాటి నాగేశ్వర రావు తెలిపారు. బోగోలు మండలం విశ్వనాధదరావుపేట పంచాయతీలో జూలై ఎమ్మెల్సీ బీద రవిచంద్ర పర్యటనలో ముఖ్య సమస్యలు ఆయన దృష్టికి తెచ్చామన్నారు. వెంటనే ఆయన సంబంధిత శాఖల వారితో మాట్లాడి నిధులు మంజూరు చేయించారని ఆయన అన్నారు. ఉపాధి హామీ కింద ప్రభుత్వ బాలుర, బాలికల పాఠశాల ప్రాంగణం చదును చేయించడానికి రూ. 3.18 లక్షలు, బాలుర వసతి గృహ ప్రాంగణంలో తుప్పల తొలగింపు, చదును చేసేందుకు రూ. 9.9 లక్షలు, రామస్వామిపాలెం గిరిజన కాలనీ అభివృద్ధి పనులకై రూ. 63 వేలు, కొత్తూరులో అసంపూర్ణంగా ఉన్న కమ్యూనిటీ హాలు పనులకు, ప్రాథమిక పాఠశాల ఆవరణ చదునుకు రూ. 1.63 లక్షలు మంజూరు చేయించారన్నారు. ప్రజా సమస్యలపై సకాలంలో స్పందించిన బీద రవిచంద్ర, మస్తాన్‌రావులకు జిల్లా కార్యదర్శి పాశం రవీంద్రబాబు, ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు, గ్రామ సర్పంచు సాతుపాటి శ్రీదేవి, టీఎన్ఎస్ఎఫ్ మండల అధ్యక్షుడు హరిబాబు, జీ శ్రీనివాసులు, సమీవుల్లా తదితరులు కృతజ్ఞతలు తెలిపారు.

ముగిసిన ఎమ్మార్పీఎస్ రిలే దీక్షలు

తహసీల్దారు కార్యాలయాలు ముట్టడించిన నాయకులు

కావలిటౌన్: ఎస్సీ వర్గీకరణ బిల్లును పార్లమెంటు సమావేశాల్లో ప్రవేశపెట్టాలని కోరుతూ ఎమ్మార్పీఎస్ చేస్తున్న రిలే దీక్షలు మంగళవారంతో ముగించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయం ముట్టడిలో భాగంగా సిబ్బందిని కార్యాలయంలోకి వెళ్లనివ్వలేదు. అనంతరం డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం ఇచ్చారు. నాయకులు చేవూరిమాల్యాద్రి, అళ్ళలగుంట ఏసుమాదిగ మాట్లాడుతూ పార్లమెంటు సమావేశాలలో ఎస్సీ వర్గీకరణ బిల్లును ప్రవేశపెట్టి మాదిగలకు న్యాయం చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నామన్నారు.

జలదంకి: జలదంకి తహసీల్దార్ కార్యాలయాన్ని ఎమ్మార్పీఎస్ నాయకులు, కార్యకర్తలు మంగళవారం ఉదయం ముట్టడించారు. ఉదయం 9 గంటలకే తహసీల్దార్ కార్యాలయం సిబ్బంది వచ్చే లోపే ప్రధాన ద్వారాన్ని మూసివేసి బ్యానర్ కట్టి అక్కడే బైఠాయించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు వ్యతిరేకంగా కార్యకర్తలు నినాదాలిస్తూ పార్లమెంటు శీతాకాల సమావేశాల్లోనే ఎస్సీ వర్గీకరణ బిల్లును పార్లమెంటులో ప్రవేశపెట్టి తీర్మానించాలని డిమాండ్ చేశారు. సమాచారం అందుకున్న ఏఎస్ఐ బాలకృష్ణ అక్కడకు వచ్చి నిరసన విరమించాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకుడు గోచిపాత వెంకటేశ్వర్లుతో చర్చించారు. 15 రోజులుగా రిలే దీక్షలు చేస్తున్నామని రాష్ట్రకమిటీ పిలుపుతో ఈ కార్యక్రమం చేపట్టామని ఏఎస్ఐకి తెలిపారు. ముట్టడికి అనుమతి లేదని వెంటనే విరమించకపోతే అరెస్టు తప్పదని ఏఎస్ఐ అనడంతో భయపడేది లేదని ఆయన బదులిచ్చారు. ఏఎస్ఐ కొంత సర్దుబాటు ధోరణిలో వ్యవహరిస్తూ తహసీల్దార్ లేదని సిబ్బందికి వినతిపత్రం ఇచ్చి వెళ్లాలనడంతో ఆర్ఐ అన్నపూర్ణమ్మకు ఎమ్మార్పీఎస్ నేతలు, కార్యకర్తలు వినతిపత్రం ఇచ్చి వెళ్లారు.

కొండాపురం: ఎస్సీ వర్గీకరణ చేయాలని కోరుతూ జూలై 20వ తేదీ నుంచి తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో జరుగుతున్న రిలే దీక్షలు మంగళవారంతో ముగిసాయి. అనంతరం ఎమ్మార్పీఎస్ మండల కన్వీనర్ కే. ఆంథోనీ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ముట్టడి చేపట్టారు. కార్యాలయం తలుపులువేసి ఉద్యోగులు కొంతసేపు విధులకు హాజరుకాకుండా అడ్డుకున్నారు. ఎస్సీ వర్గీకరణ కోసం శాంతియుతంగా నిరసన తెలిపినా ప్రభుత్వం స్పందించడం లేదన్నారు. వర్గీకరణ బిల్లును పార్లమెంటు సమావేశాల్లో ప్రవేశపెట్టకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మాదిగలను మోసం చేస్తున్నాయన్నారు. తహసీల్దార్ కార్యాలయానికి కట్టిన బ్యానరు తొలగించమని డీటీ సూర్యనారాయణసింగ్ ఆందోళనకారులను కోరగా వారు నిరాకరించారు. దీంతో కొంతసేపు అక్కడ ఉద్రిక్త వాతావరణం నెలకొంది. అనంతరం వర్గీకరణ బిల్లును ప్రభుత్వం వెంటనే చేపట్టాలన్న వినతి పత్రాన్ని డీటీ, ఆర్ఐలకు ఎమ్మార్పీఎస్ కార్యకర్తలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు కందికట్టు కిషోర్, పదర్ల చిన్న, జడ మాల్యాద్రి, బంకా మాల్యాద్రి, గంటగాని కోటేశ్వర రావు, బంకా ఆదాము తదితరులు పాల్గొన్నారు.


కావలిలో ఎమ్మార్పీఎస్ నేతల ఆందోళన


జలదంకిలో పోలీసులతో మాట్లాడుతున్న నేతలు

కలిగిరి: ఎస్సీ వర్గీకరణ సాధించే దాక ఉద్యమం ఆపేది లేదని ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు పేమల మాల్యాద్రి పేర్కొన్నారు. స్థానిక ఎమ్మార్పీఎస్ నేతలు ఈ విషయమై మంగళవారం తహసీల్దార్ కార్యాలయాన్ని ముట్టడించారు. వారు మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ చేస్తామన్న రాజకీయ పార్టీలు అధికారంలోకి వచ్చి మాట తప్పాయని ఎస్సీ వర్గీకరణ సాధించుకునే వరకు ఉద్యమాన్ని ఆపేదిలేదన్నారు. ఈ కార్యక్రమంలో బొర్రా వెంగళరావు, ఇర్మియా, కొండయ్య, తదితరులు పాల్గొన్నారు.

రక్తదాత సోము రాజేశ్వరరెడ్డికి అభినందనలు

కావలిటౌన్: రక్తదాత సోము రాజేశ్వరరెడ్డిని మంగళవారం స్థానిక రెడ్‌క్రాస్ రక్తనిధి భవనంలో అభినందించారు. కావలి రెడ్‌క్రాస్ చైర్మన్ డా. కారపు రవిప్రకాష్, రెడ్‌క్రాస్ బాధ్యులు, సిబ్బంది రాజేశ్వరరెడ్డిని ప్రశంసాపత్రం, పుష్పగుచ్ఛంతో సత్కరించారు. రవిప్రకాష్ మాట్లాడుతూ రాజేశ్వరరెడ్డి ఎవ్వరికి ఏ సమయంలో అవసరం వచ్చినా వెంటనే రక్తదానం చేసే సహృదయులన్నారు. మంగళవారం 49వ సారి రక్తదానం చేసి యువతకు స్ఫూర్తినిచ్చాడన్నారు. ఈ కార్యక్రమంలో రమాదేవి, శ్రీలత, రాజేష్, ప్రసాద్, ప్రణీత్ తదితరులు పాల్గొన్నారు.


ప్రశంసాపత్రం, పుష్పగుచ్ఛం అందుకుంటున్న రాజేశ్వరరెడ్డి

విట్స్ విద్యార్థుల రక్తదానం

విట్స్ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు మంగళవారం ప్రభుత్వ ఏరియా వైద్యశాల రక్తనిధిలో రక్తదానం చేశారు. విద్యార్థుల ప్రతినిధి బెజవాడ ప్రసన్నకుమార్ మాట్లాడుతూ విట్స్ ఇంజనీరింగ్ కళాశాల ఈసీఈ రెండో ఏడాది విద్యార్థులు ఒక బృందంగా ఏర్పడి రక్తదానం చేశామని ప్రతి శనివారం సహ విద్యార్థులు, స్నేహితుల సహకారంతో రక్తదానం చేస్తామన్నారు. ఆసుపత్రి అభివృద్ధి కమిటీ డైరెక్టర్ ద్రోణాదుల వెంకటరావు రక్తదానం చేసిన విద్యార్థులను అభినందించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి శనివారం రక్తదానం చేయాలన్న శుభపరిణామన్నారు. ఒక బొట్టు రక్తం విలువ ఒక ప్రాణంతో సమానమన్నారు. రక్తదానం చేసిన విద్యార్థుల్లో చైతన్య, మెహత్ బాలం, భానుప్రకాష్, నాగేంద్రప్రసాద్, గుడ్‌మెన్ సంస్థ అధ్యక్షుడు సోమిశెట్టి బ్రహ్మయ్య తదితరులు ఉన్నారు.

చిన్నారులకు ఎంఆర్ వ్యాక్సిన్ తప్పనిసరి

కొండాపురం: చిన్నారులకు ఎమ్ఆర్ వ్యాక్సిన్ తప్పనిసరిగా వేయించాలని గరిమెనపెంట పంచాయతీ గజ్జలవారిపల్లె ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వీ.చిరంజీవి తెలిపారు. మంగళవారం పాఠశాలలోని 27 మంది విద్యార్థులకు వైద్య సిబ్బంది ఎమ్ఆర్ వ్యాక్సిన్ వేశారు. 9 నెలలనుంచి 15 ఏళ్లలోపు పిల్లలకు తప్పనిసరిగా ఈ వ్యాక్సిన్ వేయించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయుడు చెన్నకృష్ణయ్య, అంగన్‌వాడీ కార్యకర్త కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.


వ్యాక్సిన్ వేస్తున్న వైద్య సిబ్బంది

పసుపు అక్రమాలకు అధికారులే బాధ్యులు : బొల్లినేని

కలిగిరి: ఉదయగిరి నియోజకవర్గంలో పసుపు కుంభకోణంలో జరిగిన అక్రమాలకు అధికారులే బాధ్యులని ఎమ్మెల్యే బొల్లినేని వెంకటరావు పేర్కొన్నారు. స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. ఈ ప్రాంతంలో ఏడు క్వింటాళ్ల మాత్రమే పసుపు పండిందని అయితే అధికారులు మాత్రమే 32 క్వింటాళ్ల పసుపు పండినట్లుగా అమ్మకాలకు ధ్రువీకరణ పత్రాలను అందించారన్నారు. రైతుల సంక్షేమం కోసం వ్యవసాయ శాఖామంత్రి సోమిరెడ్డి మెట్టప్రాంతమైన ఉదయగిరిలో పసుపు కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేస్తే అధికారుల బాధ్యతారాహిత్యంతో వ్యవహరించడంతో అమ్మకాల్లో దళారులు పెట్రేగిపోయారన్నారు. ఈ ప్రాంతం నుంచి 230 లారీల్లో అమ్మకమైన పసుపు రవాణా జరిగిందని ఒక్క లారీ నెంబర్‌ను కూడ ఏ అధికారి నమోదు చేయలేదన్నారు. పసుపు కుంభకోణంలో ప్రమేయం ఉన్న ఏ పార్టీ వారైన సరే శిక్షార్హులన్నారు.

ఉపరాష్ట్రపతి పదవి గర్వకారణం

ఉదయగిరి నియోజవర్గ ప్రాంతవాసి అయిన వెంకయ్యనాయుడుకు ఉపరాష్ట్రపతి పదవి దక్కడం జిల్లాకే గర్వకారణమన్నారు. అదేవిధంగా కలిగిరి మండలంలో రూ. 8 కోట్ల వ్యయంతో 14 కిలోమీటర్ల మేర భూగర్భ డ్రైనేజీని ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి మెట్టుకూరి చిరంజీవిరెడ్డి, ఎంపీపీ మద్దసాని వెంకటేశ్వర్‌రావు, నేతలు కృష్ణారెడ్డి, సుబ్బారావు, నరసింహం నాయుడు తదితరులు పాల్గొన్నారు.

జేసీ ఆకస్మిక తనిఖీలు

బిట్రగుంట: బోగోలు మండలం తహసీల్దార్ కార్యాలయాన్ని జాయింట్ కలెక్టర్ ఇంతియాజ్ అహ్మద్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. బోగోలు తహసీల్దార్ కార్యాలయంలో గ్రామ అధికారులు అడంగల్, రికార్డుల సవరణ పనితీరును ఆయన పరిశీలించి తప్పులు లేకుండా సక్రమంగా రికార్డులను తయారు చేయాలని సూచించారు. విధి నిర్వహణలో అలక్ష్యాన్ని సహించేది లేదన్నారు. ఈ కార్యక్రమంలో కావలి ఆర్డీవో ఐ.భక్తవత్సలరెడ్డి, ఇన్‌చార్జి తహసీల్దార్ జూలియాబాయ్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

పోలేరమ్మకు సహస్ర కలశాభిషేకం

అల్లూరు : మండల పరిధిలోని నార్తుమోపూరు పోలేరమ్మ ఆలయంలో సహస్ర కలశాభిషేకం మంగళవారం జరిగింది. పోలేరమ్మ విగ్రహం ప్రతిష్ఠించి ఎనిమిదేళ్లయిన నేపథ్యంలో అమ్మవారికి విశేష పూజలు చేశారు. అర్చకులు మాట్లాడుతూ నార్తుమోపూరు గ్రామం ఏర్పడి దాదాపు 400 ఏళ్ల పూర్తిచేసుకున్న నేపథ్యంలో పోలేరమ్మ తల్లి వేపచెట్టు రూపంలో ఊరు పొలిమేరలో కొలువై గ్రామాన్ని సుభిక్షంగా ఉంచుతోందన్నారు. ఎనిమిదేళ్ల కిందట అమ్మవారి విగ్రహాన్ని ప్రతిష్ఠించామన్నారు. ఈ సందర్భంగా గ్రామస్థులు ఉత్సవం చేస్తున్నారన్నారు.


అభిషేక జలం కలశాలు తీసుకొస్తున్న మహిళలు

ఆంధ్రజ్యోతి నిఘా

తడలో బియ్యం మాఫియా


రైల్లో రవాణా చేస్తున్న బియ్యం

పేదల బియ్యంపై పెద్దల కన్నుపడింది. పేదల బియ్యాన్ని గద్దల్లా తన్నుకుపోతున్నారు. జిల్లాలో రోజు ఎక్కడో ఓ చోట రేషన్ బియ్యం పట్టుబడుతూనే ఉంది. దీనికి మూలకేంద్రం తడ కావడం విశేషం. తద్వారా తడలో బియ్యం మాఫియా విజృంభిస్తోంది.

\- తడ

ప్రభుత్వం పేదలకు ఇచ్చే కిలో రూపాయి బియ్యాన్ని రేషన్ డీలర్లు 7 నుంచి 8 రూపాయలకు కొనుగోలు చేస్తున్నారు. వారు ఆ బియ్యాన్ని స్మగ్లర్లకు 12 నుంచి 14 రూపాయలకు విక్రయిస్తున్నారు. ఇక తమిళనాడులో ఆ రాష్ట్ర ప్రభుత్వం అట్టడుగు వర్గాలవారికి ఉప్పుడు బియ్యాన్ని ఉచితంగా అందజేస్తుంది. కొద్ది రోజుల వరకు ఈ బియ్యాన్ని తమిళనాడులోని ఆరంబాకం, పొన్నేరి, గుమ్మిడిపూడి, ఊతుకోట, తిరువళ్లూరు, చెన్నై పరిసర ప్రాంతాల నుంచి తడలోని దినసరి కూలీలు సేకరించి రైళ్లల్లో తడకు తీసుకువచ్చేవారు. ప్రస్తుతం ఈ తమిళనాడు రేషన్‌బియ్యం గుట్టుచప్పుడు కాకుండా గోదాముల నుంచి నేరుగా తడకు చేరుకుంటున్నాయి. ఇందుకోసం రేషన్ డీలర్ల నుంచి స్మగ్లర్లు 9 నుంచి 10 రూపాయలు వెచ్చించి కొనుగోలు చేస్తున్నారు. రైళ్లల్లో కొద్దిరోజులుగా రైల్వే పోలీసులు దాడులు చేస్తుండటంతో ఈ బియ్యాన్ని పులికాట్ సరస్సులో పడవల్లో తీసుకువచ్చి తడలోని స్టాక్ పాయింట్‌లకు చేరుస్తున్నారు. ఇలా స్టాక్‌పాయింట్‌లకు చేరే బియ్యం అన్ని ఖర్చులకు పోను 14 నుంచి 15 రూపాయలు ఖర్చు అవుతుంది. ఇలా సేకరించిన ఈ బియ్యం తడ మండలంలోని సెల్వకుప్పం, మదీనాకాలనీ, పూడికుప్పం, అక్కంపేటల్లోని 10 స్టాక్ పాయింట్‌లకు, సూళ్లూరుపేటలో రైల్వే స్టేషన్‌కు సమీపంలో ఉన్న మరో 5 స్టాక్ పాయింట్లకు, నాయుడుపేటలో మరో రెండు స్టాక్ పాయింట్లకు తరలిస్తున్నారు. ఆంధ్రారేషన్ బియ్యాన్ని నెల్లూరు, నాయుడుపేట, సూళ్లూరుపేటల్లోని అత్యాధునిక పరికరాలు కలిగిన మిల్లుల్లో రీసైక్లింగ్ చేసి వాటిని సన్నబియ్యంగా మార్చి బీపీటీ రకం బియ్యాలలో కల్తీచేసి కిలో సుమారు 40 నుంచి 55 రూపాయలకు అమ్మేస్తున్నారు. ఇక తమిళనాడు రేషన్‌బియ్యం గోతాలను మార్చి ఈ బియ్యాన్ని మరలా తమిళనాడు, కేరళ, కర్ణాటక, ప్రాంతాలకు తరలిస్తున్నారు. ఇలా మరలా తమిళనాడుకు చేరిన ఈ బియ్యాన్ని మిల్లర్లు లెవి కింద మరలా ప్రభుత్వానికి అంటకడుతున్నట్లు సమాచారం.

- **రోజు 5 నుంచి 8 లారీల రవాణా**
- **సరిహద్దు దాటుతున్న 135 నుంచి 170 టన్నులు**
- **గ్రామాల్లో స్టాక్‌పాయింట్‌లు, లక్షల్లో వ్యాపారం**
- **మాముళ్ల మత్తులో పోలీస్, రెవెన్యూ అధికారులు**

లక్షల్లో వ్యాపారం

ఇలా సేకరించిన బియ్యాన్ని ఒక్కొక్క లారీలో 20 నుంచి 27 టన్నుల వరకు ఇతర రాష్ట్రాలకు తరలిస్తున్నారు. ఒక రోజుకు 5 నుంచి 8 లారీల బియ్యం ఒక్క తడ నుంచే ఇతర ప్రాంతాలకు తరలివెళ్తుండటం విశేషం. బియ్యం అక్రమరవాణాకు తడ అడ్డాగా మారిందన్న విషయం బహిరంగ రహస్యమే. ఎవరికి వారు తమ చేతులకు మాముళ్లు అందుతుండటంతో వాటిని పట్టించుకోవడం లేదు. తాజాగా మంగళవారం పూడికుప్పం గ్రామంలో సుమారు 20 టన్నుల రేషన్‌బియ్యాన్ని పోలీసులు పట్టుకున్నారు. ఇదే ప్రాంతంలో ఇక్కడే గత ఏప్రిల్ 6వ తేదీ సుమారు 200 బస్తాల బియ్యం పట్టుబడటం విశేషం.

మాముళ్ల మత్తులో పోలీసులు, అధికారులు

బియ్యం అక్రమ రవాణాలో మాముళ్లు పెద్ద ఎత్తున అధికారులకు అందుతున్నాయనే ఆరోపణలున్నాయి. ఒక పాయింట్ నుంచి పోలీస్ స్టేషన్‌కే నెలకు లక్ష రూపాయల చొప్పున మాముళ్లు అందుతున్నట్లు సమాచారం. ఇక రెవెన్యూ అధికారులకు 40వేలు, పౌరసరఫరాలశాఖ అధికారులకు 20వేలు చొప్పున నెల మాముళ్లు చేతికి అందుతున్నట్లు గుసగుసలు ఉన్నాయి. నిన్న మొన్నటి వరకు రైల్వే పోలీసులు ఒక బస్తా బియ్యానికి 5 నుంచి 10 రూపాయల చొప్పున మాముళ్లు వసూళ్లు చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి.

తమిళనాడు అధికారులను అడ్డుకున్న పోలీసులు

తమిళనాడు రేషన్ బియ్యం అక్రమంగా తడకు చేరుతుందని అక్కడ నుంచి అక్రమ మార్గాల ద్వారా ఇతర రాష్ట్రాలకు ఈ రేషన్‌బియ్యం తరలివెళ్తుందని తమిళనాడు ప్రభుత్వం గత ఏప్రిల్‌లో గుర్తించింది. ఈ క్రమంలో వీటిపై చర్యలు తీసుకోవాలని ఆ రాష్ట్ర ఆహారశాఖ అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చింది. దీంతో అప్రమత్తమైన తమిళనాడు అధికారులు గత ఏప్రిల్ 4వ తేదీ తడలో నిఘావేశారు. సుమారు 27 టన్నుల లోడ్‌తో సెల్వకుప్పం నుంచి వస్తున్న బియ్యం లారీని స్థానిక పోలీస్ స్టేషన్‌కు అతి సమీపంలో పట్టుకున్నారు. తమిళనాడు అధికారులు లారీని పట్టుకున్నారని తెలిసినా సూళ్లూరుపేటకు చెందిన ఓ బడా స్మగ్లర్ తన ముగ్గురు అనుచరులతో కలసి హుటాహుటిన కారులో తడకు చేరుకుని తమిళనాడు అధికారులతో వాగ్వివాదానికి దిగాడు. ఈ విషయాన్ని సూళ్లూరుపేట సర్కిల్ పరిధిలోని అప్పటి ప్రధాన పోలీస్ అధికారికి, స్థానిక పోలీస్ స్టేషన్ ప్రధాన అధికారికి సమాచారాన్ని ఆ స్మగ్లర్ చేరవేశాడు. దీంతో ఆ ఇద్దరు పోలీస్ అధికారుల సైతం హుటాహుటిన తమిళనాడు అధికారులను కలుసుకున్నారు. తమప్రాంతంలో మీరు ఎలా దాడులు చేసి బియ్యాన్ని పట్టుకుంటారని అలాగే స్మగ్లర్లను అరెస్ట్ చేసేందుకు తాము ఒప్పుకోమంటూ ఆ సదరు పోలీస్ అధికారులు ఇద్దరు ఎదురు తిరగడంతో తమిళనాడు అధికారులు ఆ రాష్ట్ర పోలీస్ డైరెక్టర్ జనరల్‌కు ఈ విషయాన్ని చేరవేశారు. అదేవిధంగా తిరువల్లూరుజిల్లా ఎస్పీ, అప్పటి నెల్లూరుజిల్లా ఎస్పీకి ఫోన్ చేయించిన తరువాత స్థానిక పోలీస్ అధికారులు వెనక్కు తగ్గారు. దీంతో బియ్యం లారీతోపాటు ప్రధాన స్మగ్లర్లు అతని అనుచరులను తమిళనాడు పోలీసులు అరెస్ట్ చేసి జైల్లో ఉంచారు. ఇలా పోలీసులే స్మగ్లర్లకు సహకరిస్తుండటంతో తడలో ఈ బియ్యం మాఫియా రెచ్చిపోతుంది.

ఎస్పీ వార్నింగ్

ఈ క్రమంలో గత శుక్రవారం సాయంత్రం ఎస్పీ పీహెచ్‌డీ రామకృష్ణ తడ పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. సుమారు 5 గంటలపాటు తడలోనే మకాంవేసి ఇక్కడ అక్రమ వ్యాపారాలపై దృష్టి పెట్టారు. ఈ తడలో ఏమి జరుగుతుందో తనకు తెలుసునని ఇకనైనా మీరు మారకుంటే ఇబ్బందులు తప్పవని హెచ్చరించినట్లు సమాచారం. అయితే అప్పటికే నెలమాముళ్లతో పూర్తిగా మునిగిపోయిన పోలీసులకు ఈ వార్నింగ్‌తో దిక్కుతోచని పరిస్థితి ఏర్పడింది. ఇలా ఉన్న క్రమంలో ఆదివారం రోజు పులికాట్ సరస్సు మీదుగా సుమారు 25 టన్నుల తమిళరేషన్ బియ్యాన్ని పూడి కుప్పంకు స్మగ్లర్లు తరలించుకువచ్చినట్లు తెలుస్తోంది. ఈ విషయం సైతం సదరు పోలీసులకు తెలిసినా రెండు రోజులపాటు వేచి చూశారనే విమర్శలున్నాయి. కాగా ఈ విషయం బయటకు పొక్కుతుందని తెలిసి తద్వారా తమకు ఇబ్బంది ఏర్పడుతుందని గ్రహించి సోమవారం అర్ధరాత్రి ఈ బియ్యాన్ని పట్టుకున్నట్లు సమాచారం.

కొద్ది సేపట్లో ఇంటికొస్తా..

- కుటుంబ సభ్యులకు ఫోన్
- ఇంతలోనే కాటేసిన మృత్యువు
- నెల్లూరు శివార్లలో రోడ్డు ప్రమాదం
- ఇద్దరు దుర్మరణం
- మృతుల్లో ఒకరు హౌసింగ్ ఉద్యోగి
- మరొకరు ట్రాలీ డ్రైవర్

నెల్లూరు రూరల్ : 'హలో.. ఆమంచర్లలో గ్రామసభ అయిపోయింది. ఇంకో గ్రామానికి వెళ్లాలి. ఈ లోగా ఇంటికి వచ్చి భోజనం చేసి వెళ్తా.. ఇక్కడ నుంచి బయల్దేరా.. కొద్దిసేపటికి ఇంటికి వస్తా' ... అంటూ కుటుంబ సభ్యులకు ఫోన్లో చెప్పిన వ్యక్తి అంతలోనే మృత్యుఒడికి చేరాడు. ఈ దుర్ఘటన నెల్లూరు నగర శివార్లలో మంగళవారం జరిగింది. కొత్తూరుకు సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృత్యువాతపడ్డారు. ఇందులో ఒకరు నెల్లూరు హౌసింగ్ వర్కు ఇన్‌స్పెక్టర్ పసుపులేటి కృష్ణమూర్తి కాగా, మరొకరు బీఎస్ఎన్ఎల్‌కు ట్రాలీలో కేబుల్ సరఫరా చేసే డ్రైవర్ షాజీద్‌గా గుర్తించారు.

● ఇంటికి వస్తుండగా..

నెల్లూరు మూలపేటలోని నీలగిరి సంఘంలో నివాసముంటున్న పసులేటి కృష్ణమూర్తి (56) నెల్లూరు మండలంలో హౌసింగ్ వర్కు ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్నాడు. మండల పరిధిలోని ఆమంచర్లలో మంగళవారం జరిగిన గ్రామసభకు హాజరయ్యాడు. అక్కడ కార్యక్రమం పూర్తయింది.దీంతో అతను మరో గ్రామానికి వెళ్లాలనే హడావుడిలో ఇంటికి ఫోన్ చేసి భోజనానికి వస్తున్నానని చెప్పాడు. ఇంతలో మృత్యువాత పడ్డాడు. ఇదే ఘటనలో బీఎస్ఎన్ఎల్‌కు వైర్లను ట్రాలీలో రవాణా చేసే నెల్లూరు బడ్వాడీపాళెంకు చెందిన డ్రైవర్ షాజీద్ (40) మరణించాడు. షాజీద్ పొదలకూరు నుంచి నెల్లూరుకు వెళ్తూ కృష్ణమూర్తి స్కూటర్‌ను ఢీకొన్నాడు. ఈ దుర్ఘటనలో ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందారు. అదే మార్గంలో ప్రయాణిస్తున్న విజయ డెయిరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి మృతదేహాలను పరిశీలించారు. సమాచారం అందుకున్న రూరల్ ఎస్సై శేఖర్‌బాబు సంఘటనా స్థలం వద్దకు చేరుకుని పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాలను ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. కృష్ణమూర్తి మరణ వార్త కుటుంబ సభ్యులు, హౌసింగ్ అధికారులు, ఉద్యోగుల్లో విషాదం నింపింది.



కృష్ణమూర్తి, ట్రాలీ డ్రైవర్ మృతదేహాలు

25 టన్నుల బియ్యం పట్టివేత


రేకులషెడ్డులో బియ్యం బస్తాలు

తడ : తడలో సుమారు 25 టన్నుల రేషన్ బియ్యాన్ని పోలీసులు పట్టుకున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి. మండల పరిధిలోని పూడికుప్పం గ్రామంలోని ఓ ఇంట్లో రేషన్‌బియ్యం పెద్ద ఎత్తున నిల్వ చేశారంటూ సోమవారం రాత్రి 11 గంటల సమయంలో పోలీసులకు సమాచారం అందింది. దీంతో అప్రమత్తమైన ఏఎస్ఐ సుబ్రహ్మణ్యంరాజు సిబ్బందితో గ్రామానికి చేరుకుని గాలింపు చర్యలు చేపట్టారు. గంటసేపు గాలించిన అనంతరం ఓ పాడుబడిన ఇంటితో పాటు సమీపంలోని రేకుల గోదాములో బియ్యం బస్తాలు ఉండటాన్ని గుర్తించారు. వెంటనే సరుకు వివరాలు ఆరా తీసి గ్రామంలోని షణ్ముగశెట్టిని అదుపులోకి తీసుకొన్నారు. బియ్యం నిల్వలు అతడివేనని నిర్ధారించుకొని బియ్యం బస్తాలను స్వాధీనం చేసుకున్నారు. షణ్ముగశెట్టిని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. మంగళవారం మధ్యాహ్నం వరకు కూలీలు దొరక్కపోవడంతో ఆ బియ్యం బస్తాలను అలాగే ఉంచి ఆ తరువాత వాటిని గోదాముకు తరలించారు. సుమారు 25 టన్నులు (సుమారు 500 బస్తాలు, ఒక్కొక్కటి 50 కేజీలు) బియ్యం ఉన్నట్లుగా ప్రాథమికంగా అంచనాకు వచ్చారు. వీటిలో 20 టన్నులు ఉప్పుడు బియ్యం, 5 టన్నుల ఆంధ్రా రేషన్ బియ్యం ఉన్నట్లు గుర్తించారు.

బియ్యం తరలింపులో గందరగోళం

పట్టుబడ్డ బియ్యాన్ని ఎక్కడికి తరలించాలన్న విషయంపై పోలీసులు మధ్యాహ్నం వరకు మల్లగుల్లలు పడ్డారు. తమిళనాడు రేషన్‌బియ్యం పట్టుబడ్డ సమయంలో వాటికి సంబంధించిన స్మగ్లర్లు హైకోర్టుకు వెళ్లి స్టే తెచ్చుకొంటున్నట్లు సమాచారం. దీంతో ఈ బియ్యంపై కేసులు నమోదు చేసేందుకు వెనుకడుగు వేసినట్లు తెలుస్తోంది. దీంతో కొద్దిసేపు కేసుపై మల్లగుల్లాలు పడ్డారు. ఈ క్రమంలో ఈ బియ్యాన్ని మొదట అగ్రికల్చర్ మార్కెట్ కార్యాలయం గోదాముకు తరలించారు. అక్కడ సివిల్ సప్లయ్ అధికారులు తెచ్చే బియ్యం బస్తాలను మాత్రమే గోదాములో ఉంచుకుంటామని తెలపడంతో ఈ బియ్యం బస్తాలను అక్కడ నుంచి సూళ్లూరుపేట మన్నెముత్తేరి రోడ్డులోఉన్న ఓ ప్రైవేట్ మిల్లులో భద్రపరిచేందుకు తరలించారు. కాగా బియ్యం పట్టివేత సమాచారాన్ని అందుకున్న నాయుడుపేట ఆర్డీవో శీనానాయక్ పూడికుప్పం గ్రామానికి చేరుకుని బియ్యం నిల్వ చేసిన ప్రాంతాన్ని పరిశీలించారు. ఈ గృహాలను సీజ్ చేయాలంటూ అధికారులకు ఆదేశాలిచ్చారు.


బియ్యం బస్తాలను బయటకు తీస్తున్న పోలీసులు

ఎన్టీఆర్ జలసిరి లక్ష్యాలు పూర్తి చేయాలి : కలెక్టర్

నెల్లూరు(కలెక్టరేట్): ఎన్టీఆర్ జలసిరి-2 పథకం కింద కేటాయించిన లక్ష్యాలను వెంటనే పూర్తి చేయలని కలెక్టర్ ముత్యాలరాజు అన్నారు. మంగళవారం ఉదయం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో అధికారులతో ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్టీఆర్ జలసిరి కింద బోర్లు డ్రిల్లింగ్ చేసిన రైతులకు 10 రోజులలో సోలార్ ఇన్‌స్టలేషన్ ప్రారంభించాలన్నారు. బోర్‌వెల్ డ్రిల్లింగ్ చేసి లబ్ధిదారు వాటా కింద చెల్లించాల్సిన రూ.25వేలు వసూలు చేసి వారికి పుంపుసెట్లు బిగించాలన్నారు.

● **16వేల ఫారంపాండ్స్ లక్ష్యాలు పూర్తి చేయాలి**

ఎన్‌ఆర్‌ఈజీఎస్ కింద 16వేల ఫారంపాండ్స్ లక్ష్యాలను పూర్తిచేయాలన్నారు. ఎన్‌ఆర్‌ఇజిఎస్ కింద మంజూరైన వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణాలను వెంటనే పూర్తి చేయించాలన్నారు. ఈ సమావేశంలో డ్వామా పీడీ హరిత, ఏపీడీలు వెంకట్రావు, శ్రీహరి, మృదుల, గోపి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి కృషి

విద్యాశాఖ గుంటూరు ఆర్‌జేడీ శ్రీనివాసులురెడ్డి



మాట్లాడుతున్న విద్యాశాఖ గుంటూరు ఆర్జేడీ శ్రీనివాసులురెడ్డి

వెంకటాచలం: ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి అందరూ స హకరించాలని విద్యాశాఖ గుంటూరు రీజనల్ జాయింట్ డైరెక్టర్ శ్రీనివాసులురెడ్డి కోరారు. జిల్లాలోనే మొదటగా శ్రీరామపురం ప్రాథమిక పాఠశాలలో ప్రవేశపెట్టిన 'ఆనందలహరి' విద్యాబోధన కార్యక్రమాన్ని మంగళవారం ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాల బలోపేతానికి ప్రభుత్వం పలు చర్యలు చే పడుతోందన్నారు. ఇందులో భాగంగానే మండలానికి రెండు పాఠశాలల్లో 'ఆనందలహరి' అనే పేరుతో వినూత్న రీతిలో విద్యా బోధించే ప్రక్రియకు శ్రీకారం చుట్టిందన్నారు. విద్యార్థులు ప్రతీ రోజూ పాఠశాలకు రావడానికి ఉపాధ్యాయులు ఆయా పాఠశాలల్లో ఆహ్లాదకర వా తావరణం కల్పించాలన్నారు. ఉపాధ్యాయులు బోధనను మెరుగు ప రుచుకోవాలన్నారు. ప్రయివేటు రంగానికి దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో వసతులు, విద్యాబోధన ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఎస్‌ఏ పీవో రమణ, ప్రధానోపాధ్యాయిని శ్యామల, ఉపాధ్యాయుడు రవి ప్రసాద్, మండల బీజేపీ అధ్యక్షుడు అల్లూరు ప్రసాద్ పాలొన్నారు.

రోజాను అసహ్యించుకుంటున్న మహిళలు

● **నవరత్నాలు టీడీపీని ఏం చేయలేవు..**

● **నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి**


విలేఖరులతో మాట్లాడుతున్న కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి

నెల్లూరు (ఆంధ్రజ్యోతి) : తెలుగుదేశం పార్టీని వైసీపీ అధినేత చెబుతున్న నవరత్నాలు ఏమీ చేయలేవని నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి స్పష్టం చేశారు. మంగళవారం నెల్లూరులోని జిల్లా టీడీపీ కార్యాలయంలో ఆయన విలేఖరుల సమావేశంలో మాట్లాడారు. వైసీపీ ఎమ్మెల్యే రోజా మాట్లాడుతున్న భాషను తెలుగు రాష్ట్రాల మహిళలు అసహ్యించుకుంటున్నారన్నారు. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి పాలనలో మహిళలకు ఎటువంటి రక్షణ ఉందో ఆమె చెప్పాలని కోటంరెడ్డి డిమాండ్ చేశారు. ఒక్క ఆయేషా మీరా హత్య ఉదంతం చాలు నాడు మహిళలకు ఎటువంటి రక్షణ ఉన్నదో తెలియడానికి అని చెప్పారు. తండ్రి అధికారాన్ని అడ్డం పెట్టుకుని దోచుకుని, తద్వారా మహిళా ఐఏఎస్‌లను జైలుకు పంపిన ఘనత వైఎస్ జగన్మోహన్‌రెడ్డిదని మండిపడ్డారు. ఆఖరకు మంత్రి అఖిల ప్రియ డ్రస్ కోడ్‌పై కూడా విమర్శలు చేయడం రోజా దిగజారుడుతనానికి నిదర్శనమన్నారు. కాగా వైసీపీ జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి టీడీపీ ప్రభుత్వం అంతా అవినీతి అంటున్నారని, దమ్ముంటే ఎక్కడ అవినీతి ఉందో ఆయన నిరూపించాలని సవాల్ విసిరారు. ఈ సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షుడు ధర్మవరపు సుబ్బారావు, ఆర్కేటి శేషయ్య, ఉచ్చి భువనేశ్వరప్రసాద్, జలదంకి సుధాకర్, మొయినుద్దీన్, కువ్వారపు బాలాజీ, సిద్ధిక్, సుధీర్‌నాయుడు, రవి, గురుప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ బుకీలపై ఎన్‌డీపీఎస్

● **బెయిల్ కోసం ముమ్మర ప్రయత్నాలు**

● **పంటర్లు, బెట్టింగ్ రాయుళ్లు 85 మందికి విముక్తి**

● **బిరదవోలుకు బెయిల్ మంజూరు**

నెల్లూరు, (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : జిల్లాలోని జాతీయ క్రికెట్ బుకీలు తొమ్మిది మంది (నవరత్నాలు)పై మాదక ద్రవ్య నిషేధ చట్టం (ఎన్‌డీపీఎస్) సెక్షన్లపై పోలీసులు కేసులు నమోదు చేశారు. అప్పుడే వారి బెయిల్ ప్రయత్నాలు ముమ్మరమయ్యాయి. ఇకపోతే పంటర్లు, బెట్టింగ్ రాయుళ్లు 85 మందికి బెయిల్ వచ్చింది. మరో 21 మందికి బెయిల్ వచ్చే అవకాశాలు ఉన్నాయి. రెండు రోజుల క్రితం పోలీసులు అదుపులోకి తీసుకున్న బిరదవోలు శ్రీకాంత్‌రెడ్డిని అరెస్టు చేసి కోర్టుకు హాజరు పరచడంతో బెయిల్ లభించింది.

● **కృష్ణసింగ్ విచారణతో..**

క్రికెట్ బుకీ కృష్ణసింగ్ ఇచ్చిన సమాచారం మేరకు 115 మందిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. 15 రోజులపాటు పోలీసుల అదుపులో ఉన్న వీరందరి నుంచి వివరాలు సేకరించారు. కీలక సూత్రధారులుగా తొమ్మిది మందిని గుర్తించారు. వీరంతా జాతీయ స్థాయిలో క్రికెట్ బెట్టింగ్‌లు నిర్వహిస్తూ ప్రధాన బుకీలుగా వ్యవహరించారని తేల్చారు. మరో 21 మందిని సహాయ బుకీలుగా, 85 మంది బెట్టింగ్ రాయుళ్లు, పంటర్లుగా విభజించి ఈనెల 3న వీరందరిని అరెస్టు చేశారు. వీరిని మూడు కేటగిరిలు విభజించారు. జాతీయ బుకీలుగా కృష్ణసింగ్, ఎస్‌కే షంషేర్, తిన్నేరు రమేష్, ఉట్టుకూరు వెంకటరమేష్ అనే డీటీఎస్, కావలికి చెందిన గుర్రం వెంకటేశ్వర్లు, దాసరి సుశాంత్, బుచ్చికి చెందిన నంద్యాల అరుణ్‌కుమార్, పొదలకూరులోని మన్నెం శ్యాం ప్రసాద్, సూళ్లూరుపేటకు చెందిన అల్లూరు అనిల్‌కుమార్‌రెడ్డిలు ఉన్నారు. వీరిపై మాదక ద్రవ్యాల నిషేధ చట్టం, అధికారులపై దౌర్జన్యం వంటి అభియోగాలతో సెక్షన్లు నమోదు చేసి నాన్‌బెయిలబుల్ కేసులు పెట్టారు. 1వ అదనపు జిల్లా జడ్జి కోర్టులో బెయిల్ పిటిషన్ వేసి బెయిల్ పొందే ప్రయత్నాలు జరుగుతున్నాయి. మరో 21 మంది సబ్ బుకీలపై కూడా పోలీసులు కొన్ని సెక్షన్ల కేసులు పెట్టారు. వీరికి బెయిల్ వచ్చే అవకాశాలు ఉన్నట్లు తెలిసింది. ఇక పంటర్లు, బెట్టింగ్ రాయుళ్ల 85 మందికి అరెస్టు అయిన మరుసటి రోజే బెయిల్ రావడంతో వారంతా విముక్తి పొందారు. రెండు రోజుల క్రితం పోలీసులు అదుపులోకి తీసుకున్న బిరదవోలు శ్రీకాంత్‌రెడ్డిని విచారించిన పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు పంపగా, బెయిల్‌పై విడుదలయ్యారు.

గూడూరు డివిజన్ ఇరిగేషన్‌లో ప్రక్షాళన

పేట సబ్ డివిజన్‌లో ముగ్గురు ఏఈల బదిలీ ● కార్యాలయంలో మార్పులకు శ్రీకారం

నెల్లూరు, (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : జలవనరుల శాఖ గూడూరు డివిజన్ ను పూర్తి స్థాయిలో ప్రక్షాళనకు చేసేందుకు రంగం సిద్ధమవుతోంది. ఈ డివిజన్ పరిధిలోని సూళ్లూరుపేట సబ్ డివిజన్‌లో పని చేసే ముగ్గురు అసిస్టెంట్ ఇంజనీర్లపై బదిలీ వేటు వేస్తున్నారు. డివిజన్ కార్యాలయంలో పలు మార్పులకు శ్రీకారం చుట్టారు. గతంలో ఈఈగా పని చేసిన నారాయణ్ నాయక్‌ను ప్రభుత్వం సరెండర్ చేసి కొత్తగా తెలుగుగంగ ఈఈగా పని చేస్తున్న నగేష్‌కు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించిన సంగతి తెలిసిందే.

గూడూరు డివిజన్‌లో చేపట్టే నీరు-ప్రగతితోపాటు వివిధ అభివృద్ధి పనుల్లో పెద్ద అవినీతి జరిగిందని ఆరోపణలు వెల్లువెత్తాయి. దీనిపై ఆంధ్రజ్యోతిలో వరుస కథనాలు ప్రచురితం అయ్యాయి. దీంతో గత నెల 11న జలవనరుల శాఖ ముఖ్య కార్యదర్శి శశిభూషణ్ వీడియో కాన్ఫరెన్స్‌లో గూడూరు ఈఈ నారాయణ్ నాయక్ పనితీరుపై మండిపడుతూ ఆయన్ని ప్రభుత్వానికి సరెండర్ చేస్తున్నట్లు తెలిపారు. ఆ వెంటనే ఆదేశాలు రావడంతో తెలుగుగంగ ఈఈగా పని చేస్తున్న నగేష్‌కు ఆ బాధ్యతలు అప్పగించి నారాయణ్ నాయక్ ఈఎన్‌సీకి రిపోర్టు చేసుకున్నారు. అంతకుముందు సూళ్లూరుపేట డీఈగా పని చేస్తున్న మధును ఆ బాధ్యతల నుంచి తప్పించి, గూడూరు డీఈ ఆనందబాబును ఇన్‌చార్జిగా నియమించారు. కొత్తగా బాధ్యతలు చేపట్టిన నగేష్ పూర్తి స్థాయిలో డివిజన్‌లో జరుగుతున్న విషయాలపై దృష్టి పెట్టారు. మొదట డివిజన్ కార్యాలయంలో మార్పులు తీసుకువచ్చారు. కొందరు అధికారులు వ్యవహరిస్తున్న తీరుపై శ్రీముఖాలు జారీ చేసి జాగ్రత్తగా పని చేయాలంటూ హెచ్చరించారు. కాని సూళ్లూరుపేట సబ్ డివిజన్ పరిధిలో పని చేస్తున్న అసిస్టెంట్ ఇంజనీర్లు పని తీరుపై పూర్తి స్థాయిలో అసంతృప్తి వ్యక్తమైంది. సోమవారం కలెక్టర్‌తో జరిగిన సమావేశంలో గూడూరు డివిజన్ పనితీరుపై ప్రస్థావన వచ్చింది. సూళ్లూరుపేట సబ్ డివిజన్‌లో పని చేస్తున్న అసిస్టెంట్ ఇంజనీర్లలో పూర్తి స్థాయిలో మార్పులు రాలేదని వారి పనితీరు సరిగా లేదని అభిప్రాయం వ్యక్తమైంది. డీవీ సత్రం తడ, సూళ్లూరుపేట, నాయుడుపేట, పెళ్లకూరు మండలాల్లో పని చేస్తున్న ఏఈలు ఆవుల వెంకటేశ్వర్లు, ఫిరోజ్ బాషా, జయరామయ్యలను బదిలీ చేసి సమర్ధవంతంగా పని చేసే ఇంజనీర్లను నియమించాలని నిర్ణయించారు. ఒకటి, రెండు రోజుల్లో ఈ బదిలీలు చేపట్టి వారి స్థానాల్లో కొత్త ఇంజనీర్లను నియమిం చనున్నారు. అంతేకాక మరి కొన్ని సబ్ డివిజన్లలో వస్తున్న ఆరోపణలపై కూడా కలెక్టర్ సీరియస్‌గా పరిగణించి చర్యలు చేపట్టేందుకు సిద్ధమవుతున్నారు. తప్పు చేసిన వారిని ఎవరిని వదిలే ప్రసక్తే లేదని కలెక్టర్ పదే పదే హెచ్చరిస్తున్నారు.

ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలి

● **కలెక్టరేట్‌ను ముట్టడించిన ఎమ్మార్పీఎస్ నాయకులు**

నెల్లూరు (కలెక్టరేట్) : ప్రస్తుత పార్లమెంటు సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ చర్యలు చేపట్టాలని కోరుతూ మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు మందా పెంచలయ్య మాదిగ ఆధ్వర్యంలో ఎమ్మార్పీఎస్ నాయకులు, కార్యకర్తలు మంగళవారం కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమాన్ని చేపట్టారు. పెంచలయ్య మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణతో మాదిగలకు న్యాయం చేస్తామని ప్రకటించిన ప్రధాన రాజకీయ పార్టీలు మాట తప్పాయని ఆరోపించారు. ఎస్సీలను ఏ, బీ, సీ, డీలుగా వర్గీకరించాలని 24 ఏళ్లుగా ఎమ్మార్పీఎస్ పోరాడుతోందని చెప్పారు. రాష్ట్రంలో మాదిగలు ఎక్కువ సంఖ్యలో ఉన్నారని నిరూపించడానికి మందకృష్ణ మాదిగ కురుక్షేత్ర మహాసభను ఏర్పాటు చేస్తే, టీడీపీ ప్రభుత్వం అడ్డుకోవడం విచారకరమన్నారు. కాపు నాయకులు ఉద్యమాలు చేస్తే కేసులు నమోదు చేయడం లేదని, మాదిగలు శాంతియుతంగా ఉద్యమిస్తే కేసులు పెడతారా అని ప్రశ్నించారు. మాదిగలకు అన్యాయం చేస్తే రానున్న ఎన్నికల్లో తగిన బుద్ధి చెపుతామని హెచ్చరించారు. అనంతరం జేసీ ఇంతియాజ్ అహ్మద్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా కార్యదర్శి బోరా ప్రసాద్, నాయకులు గండవరం రామకృష్ణ, మన్నేపల్లి సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.


కలెక్టరేట్‌ను ముట్టడించిన ఎమ్మార్పీఎస్ నాయకులు

12న శ్రీకృష్ణ శోభాయాత్ర

గూడూరు: పట్టణంలో ఈ నెల 12న వీహెచ్‌పీ ఆధ్వర్యంలో శ్రీకృష్ణ దర్శనంలో భాగంగా శోభాయాత్ర నిర్వహిస్తున్నట్లు వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు మల్లెమాల మురళీరెడ్డి తెలిపారు. మంగళవారం స్థానిక కేశవ నిలయంలో శ్రీకృష్ణ దర్శనం గోడపత్రిక ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదేళ్లుగా శ్రీకృష్ణ జయంతిని పురస్కరించుకుని శ్రీకృష్ణ దర్శన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ఈ క్రమంలో ఈ నెల 12న స్థానిక డీఎన్‌ఆర్ కమ్యూనిటీ హాలులో ఉదయం గోపూజ, గణపతిపూజ, శ్రీకృష్ణ పూజలు నిర్వహిస్తామన్నారు. విద్యార్థులకు శ్రీకృష్ణ వేషధారణ పోటీలు, సాయంత్రం గోపిక, కృష్ణుల వేషధారణలో విద్యార్థులతో ప్రదర్శన నిర్వహిస్తామన్నారు. అనంతరం నృత్యపోటీలు, బహుమతి ప్రదానోత్సవ కార్యక్రమాలు ఉన్నాయన్నారు. పట్టణంలోని పాఠశాలల విద్యార్థులతోపాటు చుట్టుపక్కల గ్రామాల్లోని 26 పాఠశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొంటున్నారన్నారు. ఈ కార్యక్రమంలో నీలకంఠం పయ్యావుల మురళీనాయుడు, ఆర్‌వీ రావు, శ్రీనివాసరావు, సత్యానంద్ పాల్గొన్నారు.

● ఆసుపత్రుల నిండా బాధితులే
● 10వేలకు పైగా కేసుల నమోదు
● ఆందోళన కలిగిస్తున్న డెంగ్యూ, మలేరియా
● చోద్యం చూస్తున్న వైద్యశాఖ

ఒకవైపు విష జ్వరాలు, మరోవైపు డెంగ్యూ, మలేరియాలతో జిల్లా ప్రజలు వణుకుతున్నారు. వీటి వల్ల ఎలాంటి ఉపద్రవం వస్తుందోనన్న భయాందోళనలు వారిలో నెలకొన్నాయి. జిల్లాలో గత నెలలో డెంగ్యూ వల్ల నలుగురు మృతి చెందారు. దీంతో నిరుపేదలు తీవ్ర కలత చెందుతున్నారు. జిల్లాలోని ఆసుపత్రులన్నీ జ్వర పీడితులతో నిండాయి. ఇప్పటికే పదివేల కేసులు నమోదయ్యాయి. అయినా వైద్య ఆరోగ్య శాఖ చోద్యం చూస్తున్నది.
- నెల్లూరు (వైద్యం)



జ్వరాల భయం

జిల్లాలో సాధారణ జ్వరాలు లేని ఇల్లు లేదంటే అతిశయోక్తి కాదు. జిల్లాలో ఎటు చూసినా జ్వర పీడితులు దర్శనమిస్తున్నారు. ఏ ఆసుపత్రిలో చూసినా జ్వర బాధితులతో కిటకిటలాడుతున్నాయి. వర్షాలు కురుస్తుండడంతో వ్యాధిగ్రస్థులు సంఖ్య కూడా రోజురోజుకు పెరుగుతుంది. జిల్లాలోని ఉదయగిరి, సీతారామపురం, దుత్తలూరు, రాపూరు, ఆత్మకూరు, అల్లూరు తదితర మండలాల్లో జ్వర పీడితులు వేల సంఖ్యలో నమోదవడం ఆందోళన కలిగిస్తున్నది. అల్లూరు మండలంలోని పడమటి గోగులపల్లి, రామతీర్థంలోని పాతూరు గ్రామాలకు గ్రామాలు జ్వరాలతో అల్లాడుతున్నాయి. ముంగమూరు, విడవలూరు, తదితర గ్రామాలతోపాటు నెల్లూరు నగరంలోనూ డెంగ్యూ బాధితులు పెద్ద సంఖ్యలో నమోదవుతున్నారు. ఇక మలేరియాతో రాపూరు, సీతారామపురం, ఉదయగిరి, తదితర మండలాల ప్రజలు అల్లాడిపోతున్నారు. వ్యాధి నివారణ కోసం అప్పులు చేయాల్సిన పరిస్థితి వస్తుంది. జిల్లాలో 10 వేలకు పైగా కేసులు నాలుగు రోజుల్లో నమోదయ్యాయి.

● **ఆసుపత్రులన్నీ కిటకిట**


జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రులు జ్వర పీడితులతో నిండుతున్నాయి. కొన్ని గ్రామాల్లో దాదాపు 15 శాతం మంది జ్వరంతో బాధపడుతుండడం ఆందోళన కలిగిస్తుంది. ప్రత్యేకించి ప్రభుత్వ వైద్యశాలల కంటే ప్రైవేటు ఆసుపత్రుల వైపే బాధితులు మొగ్గు చూపుతున్నారు. జిల్లాలో 74 పీహెచ్‌సీలు, 477 ఉప కేంద్రాలు ఉన్నా అక్కడ వైద్యులు అందుబాటులో లేకపోవడంతో ప్రైవేటు ఆసుపత్రులనే ఆశ్రయించాల్సిన పరిస్థితి. ప్రధానంగా నెల్లూరు పట్టణంలోని ప్రధాన ఆసుపత్రులకే వీరి సంఖ్య ఎక్కువగా ఉంది. జిల్లాలోని నలుమూలల నుంచి ఇక్కడికి వస్తూ వైద్య చికిత్సలు పొందుతున్నారు. నెల్లూరులోని పెద్దాసుపత్రి(జనరల్ ఆసుపత్రి)కి కూడా జ్వర పీడితుల తాకిడి ఎక్కువగానే ఉంది.

● **అవగాహన ఏదీ ?**

వైద్య ఆరోగ్యశాఖ ప్రజా వైద్యం కోసం రూ.కోట్లలో ఖర్చు చేస్తున్నా వ్యాధులపై మాత్రం అవగాహన కల్పించడంలో అధికారులు వైఫల్యం చెందారు. చిన్నపాటి జ్వరాలపై కూడా ప్రజలను అప్రమత్తం చేయడంలో విఫలమవుతున్నారు. వర్షాలు ఎక్కువగా కురుస్తుండడంతో ముందస్తు హెచ్చరికలు చేయాల్సిన వైద్యశాఖ ఆ దిశగా కృషి చేయడంలేదన్న విమర్శలున్నాయి. ప్రత్యేకించి ఈ సీజన్‌లో దోమల సంఖ్య కూడా విపరీతంగా పెరిగే అవకాశం ఉంది. దీనిపై ప్రజలను అప్రమత్తం చేయాల్సిన శాఖాధికారులు అటు వైపు కూడా చూడటంలేదు.


తీసుకోవాల్సిన జాగ్రత్తలు

- ఇంటిలోనూ, పరిసరాల్లోనూ నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలి.
- వర్షంలో తడవకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలి.
- లార్వా దశలోనే దోమల నివారణకు మందులు వాడాలి.
- కనీసం లార్వా ఉన్న నీటిలో వంద గ్రాముల కిరోసిన్‌ను పోస్తే వెంటనే అవి మరణిస్తాయి.
- నివాసాల్లో దోమతెరలు, దోమల నివారణ మందులు వాడుకోవడం మంచిది.
- ప్రత్యేకించి గ్రామాల్లో పారిశుధ్యం లేకుండా చర్యలు తీసుకోవాలి.
- దోమల నివారణకు పొగ మందును వినియోగించాలి.
- చిన్నపాటి జ్వరం వచ్చినా వెంటనే వైద్యుడ్ని సంప్రదించాలి.



పెద్ద సంఖ్యలో బాధితులు

ప్రస్తుతం వర్షాలు కురుస్తున్నాయి. దీంతో జ్వరాల బాధితులు పెద్ద సంఖ్యలో నమోదవుతున్నారు. రోజుకు మా ఆసుపత్రిలోనే 300 మంది జ్వర పీడితులు చికిత్స పొందుతున్నారు. ఈ లెక్కన జిల్లావ్యాప్తంగా వేల సంఖ్యలో బాధితులు ఉన్నట్లు తెలుస్తోంది. వైద్య ఆరోగ్యశాఖ విషజ్వరాలు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. లేదంటే ప్రజారోగ్యం దెబ్బతింటుంది.
- డాక్టర్ ఎంవీ రమణయ్య, రామచంద్రారెడ్డి ఆసుపత్రి



ఈ సీజన్‌లోనే బాధితులు ఎక్కువ

ఈ సీజన్‌లోనే డెంగ్యూ, మలేరియా వంటి ప్రాణాంతక వ్యాధులు ప్రబలుతున్నాయి. ఈ బాధితుల సంఖ్య కూడా ఎక్కువగానే ఉంది. వచ్చే రెండు నెలలు చాలా జాగ్రత్తగా ఉండాలి. ఈ వ్యాధులపై అవగాహన పెంచుకోవాలి.
- డాక్టర్ విజయకుమార్, విజయాకేర్ ఆసుపత్రి

జాగ్రత్తలు తీసుకుంటున్నాం

జిల్లాలో విషజ్వరాల నివారణకు గట్టి చర్యలు తీసుకుంటున్నాం. నీటి నిల్వలు లేకుండా ప్రజల్లో చైతన్యం తీసుకువచ్చేలా వైద్యసిబ్బంది అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. దోమల నివారణకు పంచాయతీలకు రూ.20వేల వంతున పారిశుధ్య నిధులు కూడా ఖర్చు చేస్తున్నాం.
- డీఎంహెచ్‌వో డాక్టర్ వరసుందరం



సంవత్సరం	డెంగ్యూ	మలేరియా	టైఫాయిడ్	సాధారణ జ్వరాలు
2014 - 15	76	142	2,020	5లక్షలు
2015 - 16	536	395	1,950	7లక్షలు
2016 - 17	80	249	2,800	5.50లక్షలు
2017 (ఇప్పటివరకు)	46	57	500	10,000

ఐక్యతతోనే అభివృద్ధి

● కులాల కుళ్లుకు దూరంగా ఉండండి
● జన్మభూమిని మరవద్దు
● స్వగ్రామంలో వెంకయ్య నాయుడు

వెంకటాచలం: ఐక్యతతోనే అభివృద్ధి సాధ్యమవుతుందని ఉపరాష్ట్రపతిగా ఎన్నికైన ముప్పవరపు వెంకయ్యనాయుడు పేర్కొన్నారు. ఉపరాష్ట్రపతిగా ఎన్నికైన అనంతరం ఆయన మంగళవారం స్వగ్రామమైన చౌటపాళెంలో ఏర్పాటుచేసిన సన్మాన కార్యక్రమంలో మాట్లాడారు. గ్రామాల్లో అని వర్గాల వారు కులమతాలకు అతీతంగా ఐక్యంగా ఉండాలని తద్వారా అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. మనం ఏర్పరచుకున్న అభివృద్ధిని అడ్డుకునే కులాల కుళ్లుకు గ్రామస్థులు దూరంగా ఉండాలని హితవు పలికారు. వృత్తుల ఆధారంగా ఏర్పడిన కులాలను పట్టించుకోవద్దని, అన్ని సామాజిక వర్గాలను కలుపుకుంటేనే దేశ ప్రగతి సాధ్యమన్నారు. ఉపాధి కోసం ఇతర ప్రాంతాల్లో స్థిరపడ్డ వారు జన్మభూమిని, మాతృభాషను మరవకుండా తర చూ స్వగ్రామాలను సందర్శించి వాటి అభివృద్ధికి ఇతోధిక సాయం అందించాలన్నారు. గ్రామస్థులు కూడా ఇతర ప్రాంతాల్లో ఉండే వారు స్వగ్రామం రావడానికి చక్కని వాతావరణం కల్పించాలన్నారు. తనకు ఉన్నత పదవి లభించడం పూర్వ జన్మసుకృతమని, ఆ పదవి గౌరవాన్ని ఇనుమడింప చేస్తానని, చట్ట సభల గౌరవాన్ని కాపాడుతానని వెంకయ్య అన్నారు. తన హయాంలో మంజూరు చేయించిన కృష్ణపట్నం-ఓబులాపురం రైల్వే లైను నిర్మాణం కొద్దికాలంలో పూర్తవుతుందని, అది పూర్తయితే మెట్ట ప్రాంతాల ప్రజలకు ఎంతో ఉపయోగకరమన్నారు. జిల్లా అభివృద్ధితోపాటు వెంకటాచలం మండలాభివృద్ధి కోసం కృషి చేశాననే సంతృప్తి తనకుందన్నారు. జాతీయ రహదారి నుంచి చౌటపాళెం మీదుగా గొట్లపాళెం వరకు డబుల్ రోడ్డు నిర్మాణానికి రూ. 32 కోట్లు మంజూరు చేయించానన్నారు. చౌటపాళెంలో రూ.68 లక్షలతో కమ్యూనిటీ హాలు నిర్మాణానికి పలువురు ఎంపీలు నిధులను కేటాయించారన్నారు. తదనంతరం కూడా తన కుటుంబ సభ్యులు గ్రామంతో అనుబంధం కొనసాగించాల కోరుకుంటున్నా నన్నారు. అందులో భాగంగానే కోదండరామాలయంలో స్వామిసేవకోసం గురడవాహనాన్ని బహూకరించాల్సిందిగా కుమారుడు హర్షవర్ధన్‌కు చెప్పానన్నారు. ఏటా ఆలయంలో వాహన సేవ జరిగే రోజున తన కుటుంబం విధిగా గ్రామానికి రావాలన్నది తన అభిమత మన్నారు. తండ్రి పొలం అమ్మడం వల్లనే తాను గ్రామాన్ని విడిచిపెట్టానని, లేదంటే ఇక్కడే వ్యవసాయం చేసుకునే వాడినని, ఢిల్లీ వరకు వెళ్లే వాడిని కాదన్నారు. మరో రెండు రోజుల్లో ఉపరాష్ట్రపతి పదవి స్వీకరిస్తున్నానని అనంతరం గ్రామాలకు రావడం వీలు కాదనే ఉద్దేశ్యంతో అందరినీ ఒక్కసారి కళ్లారా చూసి, మనసారామాట్లాడి వెళ్లాలనిపించి వచ్చానని నాయుడు భావోద్వేగానికి గురయ్యారు. అనంతరం వెంకయ్యనాయుడు అమ్మమ్మ గ్రామమైన శ్రీరామపురం, కసుమూరులలో పర్యటించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి కామినేని శ్రీనివాస్, స్వర్ణభారత్ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ దీపావెంకట్ పాల్గొన్నారు.








వెంకయ్యనాయుడుతో ఫొటో దిగుతున్న విద్యార్థులు


వెంకయ్యను సన్మానిస్తున్న చౌటపాళెం గ్రామస్థులు


శ్రీరామపురంలో ప్రసంగిస్తున్న వెంకయ్య


జ్యోతిప్రజ్వలన చేస్తున్న వెంకయ్య


వెంకయ్యనాయుడుతో విద్యార్థుల కరచాలనం


కసుమూరు దర్గాలో ప్రార్థన చేస్తున్న వెంకయ్య

శ్రీరామపురంలో మొక్కనాటి నీరుపోస్తున్న వెంకయ్య

ఇఫ్కోపై స్టేటస్‌కో పొడిగింపు

● రెండు వారాల తరువాత విచారణ

కొడవలూరు : ఇఫ్కో కిసాన్ సెజ్‌పై స్టేటస్‌కోను మరో రెండు వారాలు పొడిగిస్తూ హైకోర్టు మంగళవారం ఆదేశాలు జారీ చేసింది. ఇఫ్కో కిసాన్ సెజ్‌లో భూముల అమ్మకాలలో అక్రమాలు జరిగాయని, పరిహారం పంపిణీలో సక్రమంగా జరగలేదని రైతులు హైకోర్టును ఆశ్రయించారు. ఈ రెండు పిటిషన్లను విచారణకు స్వీకరించిన హైకోర్టు ఇఫ్కో కిసాన్ సెజ్‌లో ఎలాంటి నిర్మాణాలు చేపట్టకూడదని స్టేటస్‌కో ఇచ్చిన సంగతి తెలిసిందే. రాష్ట్ర ప్రభుత్వం, జిల్లా అధికారులను ప్రతివాదులుగా పిటిషనర్లు చేర్చడంతో వారంతా కౌంటర్ పిటిషన్ దాఖలు చేశారు. మంగళవారం మరో సారి ఈ రెండు పిటిషన్లు విచారించిన హైకోర్టు తదుపరి విచారణకు రెండు వారాలు పొడిగిస్తూ అప్పటి వరకు స్టేటస్‌కో యధావిధిగా కొనసాగుతుందని ఆ ఉత్తర్వులో పేర్కొంది.



తప్పులతడకగా మున్సిపల్ బోర్డు

ఆత్మకూరు: మున్సిపాలిటీ వైస్‌చైర్మన్ షేక్ సంధాని... ఏంటీ షాక్ అయ్యారా..? కావాలంటే మున్సిపల్ అధికారులను అడగండి. వారు మున్సిపల్ కార్యాలయ బోర్డులో ప్రజాప్రతినిధుల జాబితాను ఇలానే ఉంచారు. మున్సిపల్ ఎన్నికల్లో 3వ వార్డు నుంచి స్వతంత్ర అభ్యర్థిగా ఎన్నికై అనూహ్య రాజకీయ పరిణామాల మధ్య మున్సిపల్ వైస్ చైర్మన్‌గా షేక్ సంధాని ఎంపికయ్యారు. రెండున్నరేళ్ల తర్వాత షేక్ సంధానీ తన పదవికి రాజీనామా చేశారు. ఐదు నెలల క్రితం తుమ్మల చంద్రారెడ్డి మున్సిపల్ వైస్‌చైర్మన్ పదవిని చేపట్టారు. అప్పటినుంచి ఇప్పటిదాకా అధికారులు కార్యాలయ బోర్డులో వైస్ చైర్మన్ పేరును మార్చలేదు. వైసీపీకి చెందిన కొందరు కౌన్సిలర్లు రెండున్నరేళ్ల క్రితమే పార్టీ ఫిరాయించినా, ఇటీవల కాంగ్రెస్ చెందిన కౌన్సిలర్లు టీడీపీ తీర్థం పుచ్చుకున్నా మున్సిపల్ బోర్డులో మాత్రం పార్టీల పేర్లు మార్చలేదు. ఇప్పటికైనా బోర్డులో వైస్‌చైర్మన్ పేరుతో పాటు, కౌన్సిలర్ల పార్టీలను సైతం అప్‌డేట్ చేయాలని పలువురు కోరుతున్నారు.

మున్సిపల్ కార్యాలయ బోర్డులో వైస్‌చైర్మన్ పేరును మార్చని దృశ్యం

భలే మంచి టమోటా బేరం!

పాతికకే కిలో పేదవాడి ఆపిల్

ఎగబడుతున్న వినియోగదారులు

టమోటాలు.. కిలో 25 రూపాయలే.. ఈ మాట వినపడగానే గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు పరుగులు తీస్తున్నారు. 80 రూపాయల నుంచి ప్రస్తుతం 50 రూపాయలకు పైబడి అమ్ముతున్న టమోటాలను అచితూచి కొనుగోలు చేస్తున్న తరుణంలో మండలంలోని జొన్నవాడ ప్రాంతంలో వీటిని కిలో 25 రూపాయలకే విక్రయిస్తున్నారు. కడప జిల్లాకు చెందిన పఠాన్ ఇర్ఫాన్‌ఖాన్ అనే రైతు మొబైల్ వాహనాల ద్వారా జిల్లాలోని పలు మండలాల్లోని గ్రామీణ ప్రాంతాల్లో వీటిని విక్రయిస్తున్నాడు. దీంతో గ్రామాల్లోని ప్రజలు టమోటాలను అవసరానికి మించి కొనుగోలు చేస్తుండడం విశేషం.
- బుచ్చిరెడ్డిపాళెం రూరల్


జొన్నవాడలో వ్యాను వద్ద టమోటాలు కొనుగోలు చేస్తున్న మహిళలు

తెలుగుగంగ కాలువల నిర్మాణానికి
ఐదు వేల ఎకరాల భూ సేకరణకు చర్యలు


● టీజీపీ స్పెషల్ కలెక్టర్ ప్రశాంతి

కోట: జిల్లాలో అసంపూర్తిగా ఉన్న తెలుగుగంగ కాలువల నిర్మాణానికి ఐదు వేల ఎకరాల భూ సేకరణకు ప్రణాళికలు సిద్ధం చేశామని తెలుగుగంగ స్పెషల్ కలెక్టర్ పీ ప్రశాంతి అన్నారు. కోట తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం భూముల స్థిరీకరణపై తహసీల్దార్ రోజ్‌మాండ్‌తో కలసి వీఆర్‌వోలతో స్పెషల్ కలెక్టర్ ప్రశాంతి సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సుమారు 2వేల ఎకరాలు మెట్ట భూములు, 3 వేల ఎకరాలు మాగాణి, ప్రభుత్వ భూములు ఉన్నాయన్నారు. త్వరలో ఆనం సంజీవ్‌రెడ్డి హైలెవల్ కెనాల్ పనులు చేపడుతా మన్నారు. ఈ కెనాల్ ద్వారా సోమశిల జలశయంలోని మిగులు జలాలను మర్రిపాడు మండలంలోని ఐదు గ్రామాలతో పాటు మరో ఆరు రిజర్వాయర్లకు సరఫరా చేస్తామన్నారు. ఈ హైలెవల్ కెనాల్ ద్వారా జిల్లాలో 60వేల ఎకరాలకు సాగు నీరు అందుతుందన్నారు. గంగ కాలువలకు సంబంధించి భూములు కోల్పోయే రైతుల వివరాలు సేకరించడంలో వీఆర్‌వోలు కీలకపాత్ర పోషించాలన్నారు. ఎక్కడా ఎలాంటి లోపాలు జరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. పట్టాదారుడు, అనుభవదారుడు పేర్ల నమోదులో జాగ్రత్తలు పాటించాలన్నారు. ఎక్కడా ఎలాంటి లోపాలు జరిగేందుకు అవకాశం ఇవ్వకూడదన్నారు. భూములు కోల్పోయే రైతు ల వివరాలు వెబ్‌ల్యాండ్‌లో స్థిరీకరించాలన్నారు. ఇందుకోసం తహసీల్దార్ల సూచనలు, సలహాలు తీసుకోవాలన్నారు.


మాట్లాడుతున్న తెలుగుగంగ స్పెషల్ కలెక్టర్ ప్రశాంతి

వెంకయ్య మన విద్యార్థే..!

బుచ్చిరెడ్డిపాళెం: ఎక్కడో పుట్టి, ఎక్కడో పెరిగి డీఎల్‌ఎన్‌ఆర్ ప్రభుత్వ హైస్కూల్‌లో చదివిన ముప్పవరపు వెంకయ్య నాయుడు ఉపరాష్ట్రపతిగా ఎన్నిక కావడం బుచ్చిలో సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. ఎంతో మంది సరస్వతీ పుత్రులకు నిలయమైన డీఎల్‌ఎన్‌ఆర్ ప్రభుత్వ హైస్కూల్లో చదివిన ముప్పవరపు వెంకయ్యనాయుడు అంచెలంచెలుగా రాజకీయ పదవుల్లో రాణించి బీజేపీ దేశ అధ్యక్షుడుగా, వివిధ శాఖల్లో కేబినెట్ మంత్రిగా, బీజేపీలో కీలకమైన వ్యక్తిగా ఎదిగి డీఎల్‌ఎన్‌ఆర్ హైస్కూల్‌కే వన్నె తెచ్చారు. 1961వ సంవత్సరంలో వెంకయ్య నాయుడు బుచ్చిరెడ్డిపాళెం పెద్దూరులో నివాసముంటూ డీఎల్‌ఎన్‌ఆర్ ప్రభుత్వ హైస్కూల్‌లో ఆయన సెకండ్ ఫారం పూర్తి చేశారు. ఆ తరువాత ఆయన హైస్కూల్ వదిలి జిల్లా కేంద్రంలో ఆయన విద్యాభ్యాసాన్ని కొనసాగించారు. వెంకయ్య నాయుడు బుచ్చిరెడ్డిపాళెం ప్రభుత్వ హైస్కూల్‌లో చదివిన విషయం మండలంలోని ఎక్కువ మందికి అంతగా తెలియదు. వెంకయ్య నాయుడు ఉపరాష్ట్రపతిగా ఎన్నికైనట్లు తెలియగానే హైస్కూల్ ఆవరణంలో విద్యార్థినీ,విద్యార్థులకు మిఠాయిలు పంచిపెట్టి వేడుకలు జరుపుకొన్నారు. వెంకయ్యనాయుడుని స్ఫూర్తిదాయకంగా తీసుకొని విద్యార్థులు తమ భవిష్యత్‌కు బంగారు బాట వేసుకోవాలని స్థానిక ఉపాధ్యాయులు సూచిస్తు న్నారు. పార్టీలకు అతీతంగా సోమవారం నెల్లూరులో జరిగిన ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు ఆత్మీయసదస్సుకు తరలివెళ్లి తమ ఆత్మీయతను చాటుకున్నారు.


వెంకయ్యనాయుడు సెకండ్ ఫారం చదివిన డీఎల్‌ఎన్‌ఆర్ ప్రభుత్వ హైస్కూల్

వర్ణమాల అక్షరాల దిశలు తెలిస్తే జవాబు సులువే..!

అనాలజీ (పోలిక పరీక్ష)

మోడల్ - 1

1. **ఖురాన్: మహ్మదీయులు:: జెండ్ అవస్థా: -----**
ఎ) జొరాస్ట్రియన్ బి) షింటో సి) అజీవక డి) పారశీక
సమాధానం: **ఎ**
వివరణ: మహ్మదీయుల పవిత్ర గ్రంథం ఖురాన్. అలాగే జొరాష్ట్రియన్ల పవిత్ర గ్రంథం జెండ్ అవస్థా

2. **నవంబరు 14 : బాలల దినోత్సవం :: జూన్ 5 : ------**
ఎ) యువజన దినోత్సవం
బి) పర్యావరణ దినోత్సవం
సి) ఆహార దినోత్సవం డి) ఏదీకాదు
సమాధానం: **బి**
వివరణ: నవంబరు 14 బాలల దినోత్సవం. అలాగే జూన్ 5 పర్యావరణ దినోత్సవం

3. **శాకాహారి: ఆవు :: మాంసాహారి: ---------**
ఎ) జింక బి) మేక సి) గొర్రె డి) సింహం
సమాధానం: **డి**
వివరణ: ఆవు శాకాహారి. అలాగే ఇచ్చిన ఐచ్ఛికాల్లో సింహం మాంసాహారి

4. **రక్తం: ఎరుపు :: బొగ్గు : -----------**
ఎ) పసుపు బి) ఆకుపచ్చ సి) నలుపు డి) గులాబి
సమాధానం: **సి**
వివరణ: రక్తం ఎరుపు రంగులో ఉంటుంది. బొగ్గు నలుపు రంగులో ఉంటుంది

5. **ఉదయం: సాయంత్రం :: రాత్రి : -----**
ఎ) పగలు బి) సాయంత్రం
సి) మధ్యాహ్నం డి) ఏదీకాదు
సమాధానం: **ఎ**
వివరణ: ఉదయానికి వ్యతిరేకం సాయంత్రం, అలాగే రాత్రికి వ్యతిరేకం పగలు

6. **గడియారం: సమయం :: ధర్మామీటర్ : -------**
ఎ) ఉష్ణం బి) ఉష్ణోగ్రత సి) శక్తి డి) ఏదీకాదు
సమాధానం: **బి**
వివరణ: సమయాన్ని తెలిపేది గడియారం, ఉష్ణోగ్రతను తెలిపేది ధర్మామీటర్

7. **సిక్కిం: గాంగ్‌టక్ :: మణిపూర్ : ------**
ఎ) డిస్పూర్ బి) షిల్లాంగ్ సి) ఇంఫాల్ డి) ఏదీకాదు
సమాధానం: **సి**
వివరణ: సిక్కిం రాష్ట్ర రాజధాని గాంగ్‌టక్. అలాగే మణిపూర్ రాజధాని ఇంఫాల్

8. **క్యాలెండర్ : తేదీలు :: నిఘంటువులు : ------**
ఎ) భాష బి) వాక్యాలు సి) పదాలు డి) ఏదీకాదు
సమాధానం: **సి**
వివరణ: క్యాలెండర్‌లో తేదీలు ఉంటాయి. అలాగే నిఘంటువులో పదాలు ఉంటాయి

9. **కిలోగ్రాం : క్వింటాల్ :: పైసా : ------**
ఎ) రూపాయి బి) నాణెం సి) సంపద డి) ఏదీకాదు
సమాధానం: **ఎ**
వివరణ: వంద కిలోగ్రామ్‌లు ఒక క్వింటాల్. అలాగే వంద పైసలు అంటే ఒక రూపాయి.

10. **సముద్రగుప్తుడు: ఇండియన్ నెపోలియన్ :: కాళిదాసు : ------**
ఎ) ఇండియన్ ఐన్‌స్టీన్
బి) ఇండియన్ మాఖియ వెల్లి
సి) ఇండియన్ షేక్స్పియర్ డి) ఏదీకాదు
సమాధానం: **సి**
వివరణ: సముద్ర గుప్తుని బిరుదు ఇండియన్ నెపోలియన్ అలాగే కాళిదాసు బిరుదు ఇండియన్ షేక్స్పియర్

11. **నిరక్షరాస్యత : విద్య :: వరద : -------**
ఎ) వంతెన బి) సముద్రం సి) ఆనకట్ట డి) ఏదీకాదు
సమాధానం: **సి**
వివరణ: నిరక్షరాస్యత తొలగాలంటే విద్యావంతులు కావాలి. అదేవిధంగా వరదల నుంచి రక్షణకై ఆనకట్టలు నిర్మించాలి.

12. **ప్రోటీన్స్: పెరుగుదల:: కార్బోహైడ్రేట్స్: ------**
ఎ) శక్తి బి) బలం సి) వ్యాధి డి) ఏదీకాదు
సమాధానం: **ఎ**
వివరణ: పెరుగుదలకు ప్రోటీన్స్, తక్షణ శక్తికి కార్బోహైడ్రేట్స్ ఉపయోగపడతాయి.



Panditi Meenakshi Pavan
Senior Faculty

Competitive Exams Special

మోడల్ - 2

వర్ణమాల అక్షరాలతో పోలిక పరీక్ష

- ఈ విభాగానికి సంబంధించిన ప్రశ్నల్లో వర్ణమాల అక్షరాల సమూహాన్ని ఇచ్చి దానిని ఒక క్రమ పద్ధతిలో కొత్త అక్షరాలుగా మారుస్తారు. అంతేకాక మరో వర్ణమాల అక్షరాల సమూహాన్ని ఇస్తారు. అభ్యర్థి మొదటి వర్ణమాల అక్షరాల సమూహం ఏ పద్ధతిలో మార్చారో పరిశీలించి ఇచ్చిన మరో వర్ణమాల అక్షరాల సమూహాన్ని అదే పద్ధతిలో మార్చి రాయాలి.
- ఈ మోడల్‌కు సంబంధించిన ప్రశ్నలకు త్వరగా సమాధానం గుర్తించాలంటే వర్ణమాల అక్షరాల సవ్యదిశ, అపసవ్యదిశ సంఖ్యలు తెలిసి ఉండటం చాలా అవసరం.

సవ్యదిశ వర్ణమాల - సంఖ్యలు

1	2	3	4	5	6	7	8	9	10	11	12	13	14
A	B	C	D	E	F	G	H	I	J	K	L	M	N
15	16	17	18	19	20	21	22	23	24	25	26		
O	P	Q	R	S	T	U	V	W	X	Y	Z		

అపసవ్యదిశ వర్ణమాల - సంఖ్యలు

1	2	3	4	5	6	7	8	9	10	11	12	13	14
Z	Y	X	W	V	U	T	S	R	Q	P	O	N	M
15	16	17	18	19	20	21	22	23	24	25	26		
L	K	J	I	H	G	F	E	D	C	B	A		

1. **ADG: CFI :: MPS: ----------**
ఎ) PRU బి) OSU సి) ORU డి) ఏదీకాదు
సమాధానం: **సి**
వివరణ: ఈ ప్రశ్నలో అక్షరాలు +2 సిద్ధాంతాన్ని అనుసరించినవి. ADG ని CFI గా రాశారు.
అంటే A మొదటి అక్షరం C(A + 2 = C) మూడో అక్షరం
D నాలుగో అక్షరం, F ఆరో అక్షరం (D + 2 = F)
G ఏడో అక్షరం, I తొమ్మిదో అక్షరం (G + 2 = I) అలాగే
M పదమూడో అక్షరం, O పదిహేనో అక్షరం (M + 2 = O)
P పదహారో అక్షరం, R పద్దెనిమిదో అక్షరం (P + 2 = R)
S పందొమ్మిదో అక్షరం, U ఇరవై ఒకటో అక్షరం(S + 2 = U)
కాబట్టి సమాధానం ORU అవుతుంది

2. **FDB: HFD :: NLJ : ------------**
ఎ) KLN బి) PNL సి) QNK డి) ఏదీకాదు
సమాధానం: **బి**

6	4	2		4	12	10
F	D	B		N	L	J
+2	+2	+2	అలాగే	+2	+2	+2
H	F	D		P	N	L
8	6	4		16	14	12

3. **FAME: JEQI :: LOVE: -------**
ఎ) PSZI బి) PRYK సి) PSXJ డి) ఏదీకాదు
సమాధానం: **ఎ**
వివరణ:

6	1	13	5	12	15	22	5
F	A	M	E	L	O	V	E
+4	+4	+4	+4	+4	+4	+4	+4
J	E	Q	I	P	S	Z	I
10	5	17	9	16	19	26	9

4. **JOY: MQZ :: KNR : -----------**
ఎ) MMR బి)NPS సి) LMS డి) ఏదీకాదు
సమాధానం: **బి**
వివరణ:

10	15	25	11	14	18
J	O	Y	K	N	R
+3	+2	+1	+3	+2	+1
M	Q	Z	N	P	S
13	17	26	14	16	19

5. **KIG : MMM :: MLK : ----------**
ఎ) QRP బి) PQR సి) OPQ డి) ఏదీకాదు
సమాధానం: **సి**

11	9	7	13	12	11
K	I	G	M	L	K
+2	+4	+6	+2	+4	+6
M	M	M	O	P	Q
13	13	13	15	16	17

6. **HEN : FCL :: IHG: ----------**
ఎ) GFE బి) EFG సి) FGE డి) ఏదీకాదు
సమాధానం: **ఎ**
వివరణ:

8	5	14	9	8	7
H	E	N	I	H	G
-2	-2	-2	-2	-2	-2
F	C	L	G	F	E
6	3	12	7	6	5

7. **FENR: DILV :: SALT : ------------**
ఎ)PEJY బి) QFJY సి) QEJY డి) QEJX
సమాధానం: **డి**

6	5	14	18	19	1	12	20
-2	+4	-2	+4	-2	+4	-2	+4
D	I	L	V	Q	E	J	X
4	9	12	22	17	5	10	24

8. **TRK: QPJ :: NKF : ---------**
ఎ) KIE బి) KJF సి) JJE డి) ఏదీకాదు
సమాధానం: **ఎ**
వివరణ:

20	18	11	14	11	6
T	R	K	N	K	F
-3	-2	-1	-3	-2	-1
Q	P	J	K	I	E
17	16	10	11	9	5

9. **BOLD: CQOH :: KITE : ----------**
ఎ) LWKJ బి) LKWI సి)KLXJ డి) ఏదీకాదు
సమాధానం: **బి**
వివరణ:

2	15	12	4	11	9	20	5
B	O	L	D	K	I	T	E
+1	+2	+3	+4	+1	+2	+3	+4
C	Q	O	H	L	K	W	I
3	17	15	8	12	11	23	9

10. **MNR: GJP :: KPT : ---------**
ఎ) ELR బి) EJP సి) DJP డి) ఏదీకాదు
సమాధానం: **ఎ**
వివరణ:

13	14	18	11	16	20
M	N	R	K	P	T
-6	-4	-2	-6	-4	-2
G	J	P	E	L	R
7	10	16	5	12	18

11. **NF: SK :: GJ : ----------**
ఎ) NP బి) PQ సి) LO డి) ఏదీకాదు
సమాధానం: **సి**
వివరణ: N పద్నాలుగో అక్షరం, S పందొమ్మిదో అక్షరం (N + 5 = S)
F ఆరో అక్షరం, K పదకొండో అక్షరం (F + 5 = K)
G ఏడో అక్షరం, L పన్నెండో అక్షరం (G + 5 = L)
J పదో అక్షరం, O పదిహేనో అక్షరం (J + 5 = O)
కాబట్టి LO సమాధానం అవుతుంది

12. **RKNI : NHLH :: KIND : ---------**
ఎ) GFED బి) GFLC సి) JFEC డి) ఏదీకాదు
సమాధానం: **బి**

18	11	14	9	11	9	14	4
R	K	N	I	K	I	N	D
-4	-3	-2	-1	-4	-3	-2	-1
N	H	L	H	G	F	L	C
14	8	12	8	7	6	12	3

13. **NRKI : JUIJ :: TFNK : ---------**
ఎ) IUJJ బి) LIPL సి) PILL డి) ఏదీకాదు
సమాధానం: **సి**
వివరణ:

14	18	11	9	20	6	14	11
N	R	K	I	T	F	N	K
-4	+3	-2	+1	-4	+3	-2	+1
J	U	I	J	P	I	L	L
10	21	9	10	16	9	12	12

JOBS ఉద్యోగాలు

యుఐఐసిఎల్

యునైటెడ్ ఇండియా ఇన్స్యూరెన్స్ కంపెనీ లిమిటెడ్ (యుఐఐసిఎల్)- **అసిస్టెంట్** పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
మొత్తం ఖాళీలు: **696**
అర్హత: జూన్ 30 నాటికి డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. ప్రాంతీయ భాషల్లో ప్రావీణ్యం ఉండాలి.
వయసు: 18 నుంచి 28 ఏళ్ల మధ్య ఉండాలి
వేతనం: నెలకు రూ.23,000
ఎంపిక: ప్రిలిమ్స్ టెస్ట్, మెయిన్ ఎగ్జామ్ ద్వారా
ప్రిలిమ్స్ టెస్ట్: సెప్టెంబరు 22న
మెయిన్ ఎగ్జామ్: అక్టోబరు 23న
దరఖాస్తు ప్రక్రియ ప్రారంభం: ఆగస్టు 14 నుంచి
ఆన్‌లైన్ దరఖాస్తుకు ఆఖరు తేదీ: ఆగస్టు 28
వెబ్‌సైట్: www.uiic.co.in

ఒఐసిఎల్

ఓరియంటల్ ఇన్స్యూరెన్స్ కంపెనీ లిమిటెడ్(ఒఐసిఎల్)- **అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్** పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. **మొత్తం ఖాళీలు:** **300**
పోస్టులు - ఖాళీలు: అకౌంటెంట్స్ 20, యాక్చురీస్ 2, జనరలిస్ట్స్ 223, లీగల్ 30, ఆటోమొబైల్ ఇంజనీర్స్ 15, మెడికల్ ఆఫీసర్స్ 10.
వయసు: 18 నుంచి 42 ఏళ్ల మధ్య ఉండాలి
ఎంపిక: రాత పరీక్ష, పర్సనల్ ఇంటర్వ్యూ ద్వారా
రాత పరీక్ష: అక్టోబరు 22న
దరఖాస్తు ఫీజు: రూ.600
దరఖాస్తు ప్రక్రియ ప్రారంభం: ఆగస్టు 18 నుంచి
దరఖాస్తుకు ఆఖరు తేదీ: సెప్టెంబరు 15
వెబ్‌సైట్: www.orientalinsurance.org.in/Career.jsp


బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర

బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర - సెక్యూరిటీ ఆఫీసర్ (మేనేజర్) పోస్టుల భర్తీకి ప్రకటన విడుదల చేసింది
ఖాళీలు: **13**
అర్హత: డిగ్రీ లేదా తత్సమాన పరీక్ష ఉత్తీర్ణులై ఉండాలి. ఆర్మీ/ నేవీ/ ఎయిర్‌ఫోర్స్/ పారా మిలిటరీ/ పోలీస్ విభాగాల్లో కనీసం అయిదేళ్ల అనుభవం + కంప్యూటర్ పరిజ్ఞానం ఉండాలి. **వయసు:** 25 - 40 ఏళ్ల మధ్య
వేతనం: రూ.31,705 నుంచి రూ.45,950 వరకు
ఎంపిక: షార్ట్ లిస్టింగ్, గ్రూప్ డిస్కషన్, పర్సనల్ ఇంటర్వ్యూ ద్వారా
ప్రొబెషన్: రెండేళ్లు **దరఖాస్తు ఫీజు:** రూ.600
ఆన్‌లైన్ దరఖాస్తు ప్రక్రియ ప్రారంభం: ఆగస్టు 12 నుంచి
ఆన్‌లైన్ దరఖాస్తుకు ఆఖరు తేదీ: సెప్టెంబరు 2
దరఖాస్తు హార్డ్‌కాపీ చేరేందుకు ఆఖరు తేదీ: సెప్టెంబరు 12
వెబ్‌సైట్: www.bankofmaharashtra.in

భారతదేశ మొట్టమొదటి గవర్నర్ జనరల్?

భారత రాజ్యాంగం- చట్టాలు

1. ఈస్టిండియా కంపెనీ స్థాపన?
   1) 1600 డిసెంబరు 28 2) 1600 డిసెంబరు 29
   3) 1600 డిసెంబరు 30 4) 1600 డిసెంబరు 31
2. కలెక్టర్ పదవిని ఎప్పుడు సృష్టించారు?
   1) 1770 2) 1771 3) 1772 4) 1773
3. మొట్టమొదటి గవర్నర్ జనరల్ ఆఫ్ బెంగాల్?
   1) వారన్ హేస్టింగ్స్ 2) రాబర్ట్ క్లైవ్
   3) మన్రో 4) ఎవరూ కాదు
4. బెంగాల్ గవర్నర్ పదవిని బెంగాల్ గవర్నర్ జనరల్‌గా మార్చిన చట్టం?
   1) మొదటి చార్టర్ చట్టం - 1793
   2) రెండో చార్టర్ చట్టం - 1813
   3) మూడో చార్టర్ చట్టం - 1883
   4) రెగ్యులేటింగ్ చట్టం - 1773
5. భారతదేశంలో మొట్టమొదటి మున్సిపల్ కార్పొరేషన్ 1687లో ఎక్కడ ఏర్పాటు చేశారు?
   1) మద్రాసు 2) కలకత్తా 3) బొంబాయి 4) ఏదీకాదు
6. భారతదేశ మొట్టమొదటి గవర్నర్ జనరల్?
   1) వారన్ హేస్టింగ్స్ 2) రాబర్ట్ క్లైవ్
   3) విలియం బెంటింక్ 4) లార్డ్ మెకాలే
7. భారతదేశంలో ఆధునిక సివిల్ సర్వీస్ పితామహుడు?
   1) నెహ్రూ
   2) సర్దార్ వల్లభాయ్ పటేల్
   3) సుభాష్ చంద్రబోస్
   4) ఎవరూకాదు



8. ఇండియన్ పీనల్ కోడ్‌ను ఎప్పుడు చట్టం చేశారు?
   1) 1858 2) 1859 3) 1860 4) 1861
9. ప్రస్తుత(21వ) లా కమిషన్ ఛైర్మన్?
   1) ఎం.సి.సెతల్వాడ్ 2) ఎ.పి.షా
   3) బల్బీర్‌సింగ్ చౌహాన్ 4) ఎవరూ కాదు
10. 'సతి'ని ఎప్పుడు రద్దు చేశారు?
    1) 1853 2) 1828 3) 1829 4) 1830
11. ప్రపంచంలో తొలిసారిగా పోటీ పరీక్షలు నిర్వహించిన దేశం?
    1) రష్యా 2) చైనా 3) భారత్ 4) బ్రిటన్
12. భారతదేశంలో సివిల్ సర్వీస్ పితామహుడు?
    1) విలియం బెంటింగ్ 2) లార్డ్ మెకాలే
    3) కారన్ వాలిస్ 4) లార్డ్ రిప్పన్
13. కలకత్తా, బొంబాయి, మద్రాసు విశ్వవిద్యాలయాలను ఎప్పుడు ఏర్పాటు చేశారు?
    1) 1856 2) 1857
    3) 1859 4) 1860
14. భారతదేశంలో న్యాయ వ్యవస్థ పితామహుడు?
    1) లార్డ్ మేకాలే 2) కారన్ వాలిస్
    3) విలియం బెంటింగ్
    4) లార్డ్ రిప్పన్
15. మొట్టమొదటి ఇండియన్ సివిల్ సర్వీస్ అధికారి?
    1) రవీంద్రనాథ్ ఠాగూర్
    2) సత్యేంద్రనాథ్ ఠాగూర్
    3) సుభాష్ చంద్రబోస్
    4) సురేంద్రనాథ్ బెనర్జీ
16. భారతదేశ మొట్టమొదటి వైశ్రాయి?
    1) లార్డ్ కానింగ్ 2) లార్డ్ మేయో
    3) లార్డ్ రిప్పన్ 4) ఎవరూ కాదు
17. భారతదేశ మొట్టమొదటి రాజ్య కార్యదర్శి?
    1) హంటర్ 2) చార్లెస్ ఉడ్స్
    3) లార్డ్ మెకాలే 4) ఎవరూ కాదు



తాళ్లపెల్లి సదయ్య
రామప్ప అకాడమీ
హన్మకొండ

పోటీ పరీక్షల ప్రత్యేకం

ఇండియన్ పాలిటీ

18. 1833లో లా కమిషన్ ఛైర్మన్?
    1) లార్డ్ మేయో 2) లార్డ్ మెకాలే
    3) లార్డ్ విలియం బెంటింక్ 4) ఏదీకాదు
19. 1857 సిపాయిల తిరుగుబాటుకు ఆద్యుడు?
    1) మంగళ్‌పాండే 2) తాంతియా తోపే
    3) నానా సాహెబ్ 4) కున్వర్‌సింగ్
20. సిపాయిల తిరుగుబాటును జాతీయ తిరుగుబాటుగా అభివర్ణించింది?
    1) సయ్యద్ అహ్మద్‌ఖాన్ 2) వి.డి.సావర్కర్
    3) నెహ్రూ 4) ఎవరు కాదు
21. పోర్టుపోలియో విధానాన్ని ఎప్పుడు ఏర్పాటు చేశారు?
    1) 1857 2) 1858 3) 1859 4) 1862
22. కలకత్తా, బొంబాయి, మద్రాసు హైకోర్టులను ఎప్పుడు ఏర్పాటు చేశారు?
    1) 1859 2) 1860 3) 1861 4) 1862
23. ప్రస్తుతం భారతదేశంలో హైకోర్టుల సంఖ్య?
    1) 21 2) 22 3) 23 4) 24
24. రౌలత్ చట్టాన్ని ఎప్పుడు ఏర్పాటు చేశారు?
    1) 1909 2) 1917 3) 1918 4) 1919
25. బ్రిటిష్ పార్లమెంట్‌కు ఎన్నికైన తొలి భారతీయుడు?
    1) దాదాబాయి నౌరోజీ
    2) సత్యేంద్ర ప్రసాద్ సిన్హా
    3) సత్యేంద్రనాథ్ ఠాగూర్ 4) ఎవరూ కాదు
26. భారతదేశంలో 'విభజించు - పాలించు' అనే విధానానికి బీజం వేసిన చట్టం?
    1) 1909 చట్టం 2) 1813 చట్టం
    3) 1853 చట్టం 4) 1833 చట్టం
27. మత నియోజకవర్గాల పితామహుడు?
    1) లార్డ్ మెకాలే 2) మార్లే
    3) లార్డ్ మింటో 4) ఎవరూ కాదు
28. ముస్లింలీగ్ స్థాపన?
    1) 1905 2) 1906 3) 1907 4) 1908
29. సూరత్‌లో కాంగ్రెస్ చీలిక?
    1) 1906 2) 1907 3) 1908 4) 1909
30. మాంటెంగ్ ప్రకటన ఎప్పుడు వెలువడింది?
    1) 1917 ఆగస్టు 20 2) 1917 ఆగస్టు 21
    3) 1917 ఆగస్టు 23 4) 1917 ఆగస్టు 25
31. ద్వంద్వ పాలన పితామహుడు ఎవరు?
    1) కారన్ వాలిస్ 2) విలియం డ్యూక్
    3) లార్డ్ మింటో 4) ఎవరూ కాదు
32. అలహాబాద్ హైకోర్టును ఎప్పుడు ఏర్పాటు చేశారు?



    1) 1861 2) 1863 3) 1855 4) 1866
33. జలియన్‌వాలాబాగ్ దుర్ఘటన ఎప్పుడు జరిగింది?
    1) 1919 ఏప్రిల్ 13 2) 1919 ఏప్రిల్ 14
    3) 1919 ఏప్రిల్ 15 4) 1919 ఏప్రిల్ 16
34. ప్రభుత్వ ఖాతాల సంఘాన్ని ఎప్పుడు ఏర్పాటు చేశారు?
    1) 1919 2) 1920 3) 1921 4) 1922
35. పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఏర్పాటును సూచించిన కమిటీ?
    1) లీ కమిటీ 2) హోలీ కమిటీ
    3) మాడ్డిమాన్ కమిటీ 4) ఏదీకాదు
36. నెహ్రూ నివేదికను ఎప్పుడు ప్రకటించారు?
    1) 1927 2) 1928 3) 1929 4) 1930
37. జిన్నా నివేదికను ఎప్పుడు ప్రకటించారు?
    1) 1927 2) 1928 3) 1929 4) 1930
38. కమ్యూనల్ అవార్డును ఎప్పుడు ప్రకటించారు?
    1) 1930 2) 1931 3) 1932 4) 1933
39. గాంధీ - అంబేద్కర్‌ల మధ్య పూనా ఒడంబడిక ఎప్పుడు జరిగింది?
    1) 1930 2) 1931 3) 1932 4) 1933
40. భారత్ నుంచి బర్మాను ఎప్పుడు వేరు చేశారు?
    1) 1935 2) 1936 3) 1937 4) 1938
41. మౌంట్ బాటన్ ప్రణాళిక ఎప్పుడు వెలువడింది?
    1) 1947 జూన్ 3 2) 1947 జూన్ 4
    3) 1947 జూన్ 5 4) 1947 జూన్ 6
42. ఆర్‌బిఐని ఎప్పుడు ఏర్పాటు చేశారు?
    1) 1934 2) 1935 3) 1936 4) 1937
43. ఆర్‌బిఐకి తొలి భారతీయ గవర్నర్?
    1) ఎం.సి.సెతల్వాడ్ 2) సత్యేంద్రనాథ్ ఠాగూర్
    3) చింతామణి ద్వారాకానాథ్ దేశ్‌ముఖ్
    4) ఎవరూ కాదు
44. ప్రస్తుత(24వ) ఆర్‌బిఐ గవర్నర్ ఎవరు?
    1) ఉర్జిత్ పటేల్ 2) రంగరాజన్
    3) వై.వి.రెడ్డి 4) ఎవరూ కాదు
45. ఫెడరల్ కోర్టును ఎప్పుడు ఏర్పాటు చేశారు?
    1) 1935 2) 1936 3) 1937 4) 1938
46. భారతదేశంలో సుప్రీంకోర్టును ఎప్పుడు ఏర్పాటు చేశారు?
    1) 1950 జనవరి 26 2) 1950 జనవరి 27
    3) 1950 జనవరి 28 4) 1950 జనవరి 29
47. స్థానిక సంస్థల పితామహుడు ఎవరు?
    1) లార్డ్ మెకాలే 2) లార్డ్ రిప్పన్
    3) లార్డ్ మేయో 4) ఎవరూ కాదు
48. సాధారణ బడ్జెట్ నుంచి రైల్వే బడ్జెట్‌ను ఎప్పుడు వేరు చేశారు?
    1) 1920 2) 1921 3) 1922 4) 1923
49. కేంద్రంలో ద్విసభా విధానాన్ని ఎప్పుడు ప్రవేశపెట్టారు?
    1) 1919 2) 1909 3) 1935 4) 1947
50. రాష్ట్రాల్లో ద్విసభ విధానాన్ని ఎప్పుడు ప్రవేశపెట్టారు?
    1) 1909 2) 1919 3) 1935 4) 1947

సమాధానాలు

1) 4	9) 3	17) 2	25) 1	34) 3	43) 3
2) 3	10) 3	18) 2	26) 1	35) 1	44) 1
3) 1	11) 2	19) 1	27) 3	36) 2	45) 3
4) 4	12) 3	20) 3	28) 2	37) 3	46) 3
5) 1	13) 2	21) 3	29) 2	38) 3	47) 2
6) 3	14) 2	22) 4	30) 1	39) 3	48) 2
7) 2	15) 2	23) 4	31) 2	40) 3	49) 1
8) 3	16) 1	24) 4	32) 4	41) 1	50) 3
			33) 1	42) 2	

JOBS ఉద్యోగాలు

కెన్ ఫిన్ హోమ్స్

కెనరా బ్యాంక్ ఆధ్వర్యంలోని కెన్ ఫిన్ హోమ్స్ లి. - క్లరికల్ కేడర్‌లో **ప్రొబెషనరీ అసిస్టెంట్** పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
మొత్తం ఖాళీలు: 30
బ్రాంచ్‌ల వారీ ఖాళీలు: బెంగళూరు 8, చెన్నై 4, హైదరాబాద్ 5, ముంబై 4, జైపూర్ 2, భోపాల్ 1, ఇండోర్ 1, ఢిల్లీ/ నొయిడా/ గ్రేటర్ నొయిడా 5
అర్హత: మే 1 నాటికి డిగ్రీ పూర్తిచేసి ఉండాలి. డేటా ఎంట్రీలో ప్రావీణ్యం + కంప్యూటర్ అప్లికేషన్స్ పరిజ్ఞానం + ప్రాంతీయ భాషల్లో నైపుణ్యం ఉండాలి.
వయసు: 21 నుంచి 28 ఏళ్ల మధ్య ఉండాలి.
ప్రొబెషన్: ఏడాది
ఎంపిక: షార్ట్ లిస్టింగ్, పర్సనల్ ఇంటర్వ్యూ ద్వారా
దరఖాస్తు ఫీజు: రూ.100
ఆన్‌లైన్ దరఖాస్తుకు ఆఖరు తేదీ: ఆగస్టు 14
వెబ్‌సైట్: www.canfinhomes.com/jobapplication.php, www.canfinhomes.com

ఇస్రో



ఇండియన్ స్పేస్ రీసెర్చ్ ఆర్గనైజేషన్ (ఇస్రో)- కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
మొత్తం ఖాళీలు: 128
పోస్టులు - ఖాళీలు: లైట్ వెహికిల్ డ్రైవర్ ఎ 50, హెవీ వెహికిల్ డ్రైవర్ ఎ 76, స్టాఫ్ కార్ డ్రైవర్ 2
ఆన్‌లైన్ దరఖాస్తుకు ఆఖరు తేదీ: ఆగస్టు 28
వెబ్‌సైట్: www.isro.gov.in

ఇండియన్ ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ

ఇండియన్ ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ - **అప్రెంటిస్‌ల** నియామకానికి దరఖాస్తులు కోరుతోంది.
మొత్తం ఖాళీలు: 24
డిగ్రీ అప్రెంటిస్‌లు: మెకానికల్ 3, మెటలర్జికల్ 2, ఎలక్ట్రికల్ & ఎలక్ట్రానిక్ 2
డిప్లొమా అప్రెంటిస్‌లు: మెకానికల్ 3, మెటలర్జికల్ 3, ఎలక్ట్రికల్ & ఎలక్ట్రానిక్ 2
టెక్నికల్ ఒకేషనల్ అప్రెంటిస్‌లు: మెడికల్ ల్యాబ్ టెక్నీషియన్ 3, ఆఫీస్ సెక్రటరీ/ స్టెనోగ్రఫీ 3, పర్చేజింగ్ & స్టోర్ కీపింగ్ 3
అర్హత: అభ్యర్థులు సంబంధిత విభాగంలో డిగ్రీ / డిప్లొమా పూర్తిచేసి ఉండాలి.
ట్రైనింగ్: ఏడాది
స్టయిపెండ్: గ్రాడ్యుయేట్స్‌కు రూ.4984, డిప్లొమా అభ్యర్థులకు రూ.3542, టెక్నీషియన్స్‌కు రూ.2758 చెల్లిస్తారు.
ఎంపిక: అకడమిక్ మెరిట్, వైవా, మెడికల్ టెస్ట్
ఆఫ్‌లైన్ దరఖాస్తుకు ఆఖరు తేదీ: ఆగస్టు 14
చిరునామా: General Manager/Grey Iron Foundry, Jabalpur - 482009

జెఎన్‌టిబిజిఆర్‌ఐ

జవహర్‌లాల్ నెహ్రూ బొటానికల్ గార్డెన్ అండ్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ (జెఎన్‌టిబిజిఆర్‌ఐ)- తాత్కాలిక ప్రాతిపదికన కింది పోస్టుల భర్తీకి ఇంటర్వ్యూ నిర్వహిస్తోంది.
మొత్తం ఖాళీలు: 46
పోస్టులు - ఖాళీలు: జూనియర్ ప్రాజెక్ట్ ఫెలో(బోటనీ 21, బయోటెక్నాలజీ/ బయో ఇన్ఫర్మాటిక్స్ 2, కెమిస్ట్రీ/ బయో కెమిస్ట్రీ/ అనలిటికల్ కెమిస్ట్రీ 4, మైక్రో బయాలజీ/ ఇంటిగ్రేటెడ్ బయాలజీ 2, జువాలజీ/ వైల్డ్ లైఫ్ బయాలజీ 1), ప్రాజెక్ట్ అసిస్టెంట్(బోటనీ/ అగ్రికల్చర్/ హార్టికల్చర్ 13), కంప్యూటర్ అసిస్టెంట్ (బోటనీ) 2, సిస్టం అడ్మినిస్ట్రేటర్ 1
అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో ఫస్టుక్లాస్ మార్కులతో ఎమ్మెస్సీ/ బిఎస్సీ/ బిటెక్ ఉత్తీర్ణులై ఉండాలి. నేషనల్ ఎలిజిబిలిటీ టెస్ట్ అర్హత పొందినవారికి ప్రాధాన్యం ఉంటుంది.
స్టయిపెండ్: విభాగాన్ని అనుసరించి రూ.19000 నుంచి రూ.25000 వరకు ఇస్తారు.
వయసు: ఈ ఏడాది జనవరి 1 నాటికి 36 ఏళ్లు ఉండాలి.
ఇంటర్వ్యూ: ఆగస్టు 22, 23, 24న
వేదిక: JNTBGRI, Karmiancode, PO, Pacha Palode, Thiruvanthapuram 695562
వెబ్‌సైట్: www.jntbgri.res.in

నంద్యాలలో వైసీపీదే గెలుపు

కోవూరు: నంద్యాల ఉప ఎన్నికలో వైసీపీ అభ్యర్థి విజయం సాధిస్తారని ఆ పార్టీ రాష్ట్ర కమిటీ ప్రధాన కార్యదర్శి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. పడుగునాడులోని రుక్మిణీ కల్యాణ మండపంలో మంగళవారం జరిగిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలుగుదేశం పార్టీ ఎన్ని కుయుక్తులు పన్నినప్పటికీ వైసీపీ అభ్యర్థి శిల్పామోహన్‌రెడ్డి విజయం సాధిస్తారని ఆయన అన్నారు. ఈ నెల 11వ తేదీ నుంచి నిర్వహించ తలపెట్టిన పార్టీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాల్సిందిగా కోరారు. వైఎస్సార్ కుటుంబ సభ్యుల పేరిట సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని జయప్రదం చేయాల్సిందిగా విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు రామిరెడ్డి మల్లికార్జునరెడ్డి, పీ రాధాకృష్ణారెడ్డి, నరసింహులురెడ్డి, తదితరులు మాట్లాడారు.

ఎస్సీ వర్గీకరణ కోరుతూ ఎమ్మార్పీఎస్ ధర్నా



ధర్నా నిర్వహిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

బుచ్చిరెడ్డిపాళెం: ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలని 16 రోజులుగా రిలే నిరాహార దీక్షలు నిర్వహిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు మంగళవారం రిలే నిరాహార దీక్షలను విరమించి తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించడంలో నాయకులు దాటవేత దోరణి ప్రదర్శించడం బాధాకరమని నాయకులు అన్నారు. ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించే వరకు దశలవారీగా ఆందోళనలు చేపడుతామన్నారు.అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు దర్శిగుంట శ్రీనివాసులు, టీ అశోక్, మాలకొండయ్య, రమణయ్య, వంశీనాథ్, రవి, కిషోర్ పాల్గొన్నారు.

ఉద్యోగికి ఆర్థిక సహాయం



చెక్కు అందజేస్తున్న డాక్టర్ సుబ్బారావు

కోవూరు: గీతాంజలి ఇంజనీరింగ్ కళాశాలలో పరీక్షల పర్యవేక్షకునిగా పనిచేస్తున్న అనిల్‌కుమార్‌కు కళాశాల అధ్యాపకులు సిబ్బంది మంగళవారం ఆర్థిక సహాయం అందించారు. ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆయనకు చేతికి గాయమైంది. వైద్య ఖర్చుల నిమిత్తం కళాశాల అధ్యాపకులు రూ.50వేలు ఆర్థిక సహాయం అందించి తమ వితరణను చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ సుబ్బారావు, అధ్యాపకులు పాల్గొన్నారు.

గుమ్మళ్లదిబ్బలో మొక్కలు నాటిన మహిళలు

కోవూరు: గుమ్మళ్లదిబ్బ కాలనీలో ఇందిరాక్రాంతి పథం సభ్యులు మంగళవారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఐకేపీ ఏపీఎం అక్కిశెట్టి సుజాత మాట్లాడుతూ ఒక్కొక్క మహిళ 100మొక్కల్ని నాటాలన్నారు. తమ సంస్థ ద్వారా మొక్కకు రూ.6 చెల్లించనున్నట్లు చెప్పారు. ఓ కిలోమీటరు పొడవునా మొక్కలు నాటడమే లక్ష్యంగా తాము పనిచేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సీసీలు సైదా, సుకన్య, వెంకటస్వామి, మమత, పొదుపు సంఘాల అధ్యక్షులు, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

పడుగుపాడులో 'పొలం పిలుస్తోంది'

కోవూరు: పడుగుపాడు, చెర్లోపాళెం గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని వ్యవసాయాధికారులు నిర్వహించారు. వ్యవసాయాధికారిణి కల్యాణి మాట్లాడుతూ దోమపోటు నివారణ చర్యలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఏఈవో జయలక్ష్మి, ఎంపీఈవో మోహరున్నీషా, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

దేవుడా.. ఇప్పుడెలా..?

- 2వేల ఎకరాల్లో ఎండుతున్న వరి

పోలినాయుడు చెరువు గ్రామంలో ఎండిపోయిన పంట (అంతర్‌చిత్రంలో) వరిపైరును మేస్తున్న పశువులు





బుచ్చిరెడ్డిపాళెంరూరల్ : సాగునీరందక ఎండిపోతున్న వరిపైర్లతో రైతుల కంట కన్నీరు కారుతోంది. సాగునీరందుతుంది.. రెండో పంట పండుతుందని ఆశతో రెండో పంట కింద వరినాట్లు వేసుకున్న రైతులకు మరో నెల రోజుల్లో చేతికందాల్సిన పంట ఎండిపోతుండడంతో దిక్కుతోచని పరిస్థితుల్లో పడ్డారు. దీంతో రైతులు పంటల్లో పశువులను తోలి మేపుకుంటున్నారు. వేలాదిరూపాయలు పెట్టుబడులు పెట్టి పంటలు ఎండిపోయి పశువులకు మేతగా మారడంతో రైతులు కన్నీటి పర్యంతమవుతున్నారు. మండలంలోని కనిగిరి రిజర్వాయర్ పరిధిలోని అల్లూరు కాలువ 6తూముల కింద రైతులు వేసిన సుమారు 2వేల ఎకరాల్లోని వరిపంటలకు ఇటు కనిగిరి రిజర్వాయర్‌లో నీరు అడుగంటింది. దీంతో మరో నెలరోజుల్లో చేతికందాల్సిన పంట ఎండుముఖం పట్టిందని రైతులు బావురముంటున్నారు.

సరుడు కుదువపెట్టి పెట్టుబడి పెట్టాం




మెడలో సరుడుతో సహా కుదువపెట్టి మూడున్నర ఎకరాల్లో రెండోపంట వరిసాగు చేశాం. మాకు అల్లూరు కాలువ కింద పారుదల ఉంది. రిజర్వాయర్‌లో అడుగు జలాలు సరిపోతాయనుకుని ఆశతో రెండో పంట సాగుచేశాం. కానీ చెరువులో జలాలు పూర్తిగా అవిరైపోవడం, ఇటు వర్షాలు కురవకపోవడంతో ఆశలన్నీ ఆవిరయ్యాయి. వెన్నుదశలోని పైరు పొట్టలతో సహా ఎండిపపోవడంతో ఇక పశువులు తోలాల్సి వచ్చింది. కనీసం ప్రభుత్వం రెండోపంటకోసం తీసుకున్న పంటరుణాలుపై వెసులుబాటు కల్పించి మాలాంటి చిన్నసన్న కారు రైతులను ఆదుకోవాలి.

\- నాగభూషణమ్మ

గ్రామాల్లో జనరిక్ మందుల దుకాణాలు

కోవూరు: నిరుద్యోగులకు ఉపాధి కల్పించే విధంగా గ్రామాల్లో అన్నసంజీవిని జనరిక్ మందుల దుకాణాల్ని ఏర్పాటు చేయనున్నట్లు ఆ సంస్థ జిల్లా కో ఆర్డినేటర్ సింహాద్రి తెలిపారు. సంఘమిత్ర కార్యాలయంలో మంగళవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జనరిక్ మందుల దుకాణాల్లో పనిచేసేందుకు బీఫాం, డీ ఫాం, ఎం ఫార్మసీ చదివిన నిరుద్యోగులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. డీఆర్‌డీఏ ద్వారా మందుల దుకాణాల నిర్వహణకు ఆర్థిక సహాయం అందించనున్నట్లు వివరించారు. తక్కువ ధరకు నాణ్యమైన మందుల్ని రోగులకు అందించనున్నట్లు చెప్పారు. ఈ సమావేశంలో ఐకేపీ ఏసీ కామాక్షి మాట్లాడారు.

11న ఉపాధి అవగాహన సదస్సు : సంఘమిత్ర కార్యాలయంలో ఈ నెల 11న నిరుద్యోగ యువతకు పరిశ్రమల ఉపాధిపై సమాచారం అందించేందుకు వీలుగా అవగాహన సదస్సు ఏర్పాటుచేస్తున్నట్లు పరిశ్రమల శాఖాధికారి ఎం.ఎస్.ప్రసాద్ తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ మహిళలకు ప్రత్యేక ఉపాధి అవకాశాలపై సమాచారమందిస్తామన్నారు. బ్యాంకుల ఆర్థిక సహాయం గురించి వివరించనున్నట్లు చెప్పారు. సదస్సుకు నిరుద్యోగ యువతీయువకులు హాజరుకావాల్సిందిగా కోరారు.



మాట్లాడుతున్న సింహాద్రి

ఆటో కార్మికులను ఇబ్బంది పెట్టడం తగదు

కొడవలూరు: రెక్కాడితేగాని డొక్కాడని ఆటో కార్మికులపై రవాణా,పోలీసుశాఖ అధికారులు దాడులు చేసి ఇబ్బందులకు గురి చేయడం తగదని సీఐటీయూ మండల కార్యదర్శి తలారి నరసింహులు అన్నారు. నార్తురాజుపాళెం సీఐటీయూ కార్యాలయంలో మగళవారం జరిగిన విలేఖర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నిరుద్యోగులైన పలువురు ఆటో నడపుకొంటూ జీవనం సాగిస్తున్నారని చెప్పారు. పత్రాలు సక్రమంగా ఉన్నా ఆటోడ్రైవర్లపై పోలీసు, రవాణాశాఖ అధికారుల దాడులు చేస్తుండడంతో వారు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. ఆటో కార్మికులకు పూట గడిచేదే కష్టంగా ఉందని అన్నారు. ఈ సమావేశంలో ఆటో యూనియన్ నాయకులు ఎన్ సురేష్, కే వెంకటేశ్వర్లు, పి ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

అర్హులకు భూములు కేటాయించాలి



తహసీల్దార్‌కు వినతి పత్రాన్ని అందజేస్తున్న కంచరపాళెం వాసులు

విడవలూరు: అర్హులైన పేదలకు ఎల్‌పీఎస్ పథకం కింద భూములు కేటాయించాలని కోరుతూ ఊటుకూరు కంచరపాలెం వాసులు మంగళవారం తహసీల్దారు బాలమురళీకి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఊటుకూరులో అధికార పార్టీకి చెందిన నాయకులు పేదల భూములను ఆక్రమించుకోవాలని కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు. ఎల్‌పీఎస్ పథకంలో అనర్హుల జాబితాలో పొందుపరిచారని విమర్శించారు. అధికారులు సమగ్రమంగా విచారణ జరిపి పేదలమైన తమ పేర్లను జాబితాలో పొందుపరిచి భూములు ఇవ్వాలని కోరారు.

పనుల్లో అవకతవకలు జరిగితే చర్యలు

విడవలూరు: రహదారుల విస్తరణ పనుల్లో అవకతవకలు జరిగితే చర్యలు తప్పవని ఆర్‌అండ్‌బీ జేఈ చంద్రశేఖర్ హెచ్చరించారు. మండలంలోని చౌకిచర్ల, వావిళ్ల గ్రామాల్లో జరుగుతున్న రోడ్డు విస్తరణ పనులను మంగళవారం ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో సుమారు 10కోట్ల రూపాయలతో విస్తరణ పనులు జరుగుతున్నాయన్నారు. ఈ పనులను త్వరిత గతిన పూర్తి చేసే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. నాణ్యతలో రాజీలేకుండా పనులు జరగాలన్నారు.



రోడ్డు పనులు పరిశీలిస్తున్న ఆర్‌అండ్‌బీ జేఈ

టీడీపీ గ్రామ సమావేశాలు తప్పక నిర్వహించాలి

కొడవలూరు: మండలంలోని ప్రతి గ్రామంలో తెలుగుదేశం పార్టీ సమావేశాలను తప్పక నిర్వహించాలని పార్టీ శ్రేణులను ఆ పార్టీ మండల అధ్యక్షుడు కోటంరెడ్డి అమరేందర్‌రెడ్డి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. తెలుగుదేశం గ్రామ కమిటీ సమావేశాలలో ప్రజా సమస్యలపై వచ్చిన విన్నపాలపై తీర్మానాలను మండల కమిటీకి అందజేయాలని ఆయన కోరారు.

అర్హులందరికీ గృహనిర్మాణం

కోవూరు: నివేశ స్థలం కలిగిన అర్హులందరికీ గృహాల్ని నిర్మించుకొనేందుకు అనుమతినివ్వనున్నట్లు తహసీల్దార్ రామలింగేశ్వరరావు తెలిపారు. కోవూరు, వేగూరు, మోడేగుంట, పడుగుపాడు గ్రామాల్లో మంగళవారం జరిగిన గ్రామసభల్లో ఆయన మాట్లాడారు. నివేశస్థలం కలిగిన వ్యక్తుల అర్హతల్ని గ్రామసభల ద్వారా తీర్మానం చేయనున్నట్లు చెప్పారు. గ్రామసభ తీర్మాణాన్ని గృహనిర్మాణశాఖకు పంపనున్నట్లు వివరించారు. గ్రామసభలో ఆయా గ్రామాల సర్పంచులు, వీఆర్వోలు పాల్గొన్నారు.

విస్తృతంగా ఎంఆర్ వ్యాక్సినేషన్

ఉదయగిరి రూరల్: మండలంలోని 9 నెలల నుంచి 15 ఏళ్లలోపు వయసున్న ప్రతిఒక్కరికి తప్పు, రూబెల్లా టీకా వేస్తున్నట్లు ఆరోగ్య పర్యవేక్షకుడు షేక్ రియాజ్ పేర్కొన్నారు. మంగళవారం వెంగళరావునగర్ ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో విద్యార్థులు, చిన్నారులకు ఎంఆర్ టీకా వేశారు.

సీతారామపురం: చింతోడు, దేవమ్మచెరువు, మారంరెడ్డిపల్లి, గుండుపల్లి, సోంపల్లి గ్రామాల్లో మంగళవారం 186 మంది చిన్నారులు లక్ష్యం కాగా, 119 మందికి ఈ వ్యాక్సిన్ వేశామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేకాధికారి డాక్టర్ వీరేష్, హెచ్ఈవో ఖాజామస్తాన్, సూపర్‌వైజర్ అలీం, వైద్యసిబ్బంది తదితరులున్నారు.

బంద్ జయప్రదం చేయండి

ఉదయగిరి రూరల్: విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం ఈనెల 10న చేపట్టే విద్యాసంస్థల బంద్‌ను జయప్రదం చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకుడు బి.నాగరాజు పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక పుచ్చపల్లి సుందరయ్య భవనంలో విద్యార్థి సంఘాల నాయకులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేజీ నుంచి పీజీ వరకు ఉచిత విద్యనందిస్తామని హామీ ఇచ్చిన ప్రభుత్వం దాని ఊసే ఎత్తడం లేదన్నారు. ప్రభుత్వ హాస్టళ్ల విద్యార్థులకు 2012 పెంచిన మెస్ చార్జీలను నేటికీ అమలు చేయలేదన్నారు. నిత్యావసర సరుకుల ధరలకు అనుగుణంగా మెస్ చార్జీలు పెరగకపోవడం దారుణమన్నారు.

తహసీల్దారు కార్యాలయం ముట్టడి

వింజమూరు: రెండు దశాబ్దాలుగా ఎడతెగని ఉద్యమాలు చేస్తున్నా ఎస్సీ రిజర్వేషన్‌పై కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేస్తున్నాయంటూ మంగళవారం స్థానిక తహసీల్దారు కార్యాలయాన్ని ఎమ్మార్పీఎస్ నాయకులు ముట్టడించారు. బంగ్లాసెంటర్ నుంచి తహసీల్దారు కార్యాలయం వరకు ర్యాలీ వెళ్లి, కార్యాలయంలోని సిబ్బందిని బయటకు పంపి తలుపులు మూసివేశారు. దాంతో పోలీసులు కార్యాలయానికి చేరుకుని సర్ది చెప్పారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ నాయకుడు పందిటి అంబేద్కర్ మాట్లాడుతూ రెండు దశాబ్దాలుగా వర్గీకరణ కోసం ఉద్యమాలు చేస్తున్నా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నాయని విమర్శించారు. మాదిగల సహనాన్ని పరీక్షించడం ప్రభుత్వానికి మంచిదికాదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి అఖిలపక్షాన్ని ఏర్పాటు చేసి వర్గీకరణకు సహకరించాలన్నారు. అనంతరం కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాసులకు వినతిపత్రం అందచేశారు. ఈ కార్యక్రమంలో మురళి, కొండయ్య, నాగేష్, జీ.జార్జి, కొండస్వామి, నరసింహులు, చినపెంచలయ్య, రమణయ్య, బాలయ్య, వీరరాఘవులు, మస్తాన్ తదితరులున్నారు.



తహసీల్దారు కార్యాలయాన్ని ముట్టడించిన ఎమ్మార్పీఎస్ నాయకులు

అజ్ఞాతంలోనే పసుపు దందారాయుళ్లు ?

ఉదయగిరి రూరల్: పసుపు కుంభకోణంలో క్రిమినల్ కేసులు నమోదైన వారిలో దుత్తలూరు మండలం కొత్తపేటకు చెందిన ఒకరిని మంగళవారం పోలీసులు అదుపులోకి తీసుకొని విచారించినట్లు తెలిసింది. కాగా క్రిమినల్ కేసులు నమోదైన వారి కోసం ముమ్మరంగా గాలిస్తున్నామని పోలీసులు చెబుతుండగా, పలువురు నిందితులు పట్టపగలే మండల కేంద్రాలు, గ్రామాల్లో సంచరిస్తుండడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ కేసు నుంచి బయటపడేందుకు ఏం చేయాలన్న విషయంపై నిందితులు పోలీసులతోనే ఫోన్ ద్వారా సంప్రదిస్తున్నట్లు సమాచారం. నిందితుల్లో ముగ్గురు జిల్లా కోర్టులో బెయిల్ కోసం దరఖాస్తు చేసుకోగా, తిరస్కరించినట్లు తెలిసింది.

తాగునీటి కోసం ఆందోళన



ఆందోళన చేస్తున్న పబ్బులేటిపల్లి గ్రామస్థులు

సీతారామపురం: స్థానిక ఎంపీడీవో కార్యాలయం వద్ద మంగళవారం పబ్బులేటిపల్లి గ్రామస్థులు తాగునీటి కోసం ఖాళీ బిందెలతో నిరసన వ్యక్తం చేశారు. కార్యాలయం మెట్లపై కూర్చొని తమ గ్రామంలో నీటి కోసం ప్రజలు అల్లాడుతున్నారని, అధికారులు స్పందించి తమ దాహం తీర్చాలన్నారు. భూగర్భజలాలు పూర్తిగా అడుగంటిపోవడంతో చేతిపంపులు, మినీ వాటర్ పథకాలన్నీ నిరుపయోగంగా మారాయన్నారు. అధికారులు యుద్ధప్రాతిపదికన స్పందించి సమస్య పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అనంతరం ఎంపీడీవో కిరణ్‌కుమార్‌కు వినతిపత్రం అందచేశారు.

అట్రాసిటీ కేసు విచారణ

ఉదయగిరి రూరల్: సర్వరాబాదు గ్రామంలో మంగళవారం ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుపై డీఎస్పీ సుధాకర్ విచారణ చేశారు. గత నెల 30 వ తేదీన తనను గ్రామానికి చెందిన ఆరుగురు కులం పేరుతో దూషించి దాడి చేశారని సర్వరాబాదు గ్రామ ఎస్సీ కాలనీకి చెందిన మాతంగి సాల్మన్ స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో డీఎస్పీ గ్రామానికి చేరుకుని ఇరువర్గాలను విచారించి స్టేట్‌మెంట్ రికార్డు చేశారు.

యువకుడి అదృశ్యం



నరహరి

వింజమూరు: సిద్ధార్థనగర్‌కు చెందిన జ్యోతి నరహరి అదృశ్యమైనట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఈయన గత నెల 10వ తేదీన ప్రకాశం జిల్లాలోని శ్రీమాలకొండస్వామి ఆలయానికి వెళ్ళి వస్తానని ఇంటి దగ్గర నుంచి వెళ్ళాడన్నారు. అప్పట్నుంచి ఇంతవరకు ఇంటికి చేరలేదన్నారు. దీంతో బంధువులకు సమాచారం అందించి అన్నిచోట్ల గాలింపు చర్యలు చేపట్టినా ప్రయోజనం లేదన్నారు. అచూకీ తెలిసిన వారు 9492332853 అనే నెంబర్‌కు తెలియచేయాలని తెలిపారు.

టేకు దుంగలకు అపరాధ రుసుం

ఉదయగిరి రూరల్: ఉదయగిరి రేంజ్ పరిధిలోని వరికుంటపాడు మండలం గువ్వాడిలో అక్రమంగా తరలిస్తున్న 23 టేకు దుంగలకు రూ1,26,823ల అపరాధ రుసుం విధించినట్లు రేంజ్ అధికారి షేక్ అల్లాబక్ష మంగళవారం తెలిపారు.

దుర్భాషలాడిన కేసులో వ్యక్తికి జైలు శిక్ష

ఉదయగిరి రూరల్: మహిళలను దూషించిన కేసులో నిందితునికి రెండేళ్ల ఒక్క నెల జైలు శిక్ష, రూ.1000లు జరిమానా విధిస్తూ స్థానిక జూనియర్ సివిల్ కోర్టు న్యాయమూర్తి శ్రీధర్ మంగళవారం తీర్పు ఇచ్చారు. 2016 మే నెలలో పూసల కాలనీలోని ఎస్సీలు, ఎస్టీలు ఓ స్థలం విషయమై ఘర్షణపడ్డారు. ఈ విషయంపై కాలనీకి చెందిన అల్లూరు పెంచలమ్మతోపాటు, మరో ముగ్గురు మహిళలు తహసీల్దారుకు విన్నవించి, తిరిగి వెళుతుండగా నాగిళ్ల జయరాజ్ వారిని దూషించాడు. దీంతో వారు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ కేసులో నిందితునికి శిక్ష విధిస్తూ న్యాయమూర్తి పైవిధంగా తీర్పు ఇచ్చారు.

బైక్‌లు ఢీకొని నలుగురికి తీవ్ర గాయాలు

ఉదయగిరి రూరల్: రెండు మోటార్‌బైక్‌లు ఢీకొనడంతో నలుగురు గాయపడ్డారు. కృష్ణంపల్లికి చెందిన అంగలకుర్తిప్రసాద్, పెద్దబ్బయ్య బైక్‌పై ఉదయగిరికి వస్తుండగా, సీతారామపురం మండలం సంజీవరెడ్డినగర్‌కు చెందిన ముత్తంశెట్టి చెన్నకృష్ణయ్య, తురకా వెంకటేశ్వర్లు ఉదయగిరి నుంచి స్వగ్రామానికి వెళుతూ సర్వరాబాదు వద్ద ఢీకొన్నారు. ఈ ప్రమాదంలో నలుగురికీ గాయాలు కాగా 108 వాహనంలో ఉదయగిరి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. తీవ్రంగా గాయపడిన ప్రసాద్, పెద్దబ్బయ్యలను నెల్లూరుకు తరలించారు.

బుక్కాపురంలో పొలం పిలుస్తోంది

వింజమూరు: మండల పరిధిలోని బుక్కాపురం గ్రామంలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. శనగ పంటను పరిశీలించిసూచనలు అందచేశారు. కంది విత్తనాలు సిద్ధంగా ఉన్నాయన్నారు.

బ్యాంకు రుణాలతో ఆర్థిక ప్రగతి సాధించాలి

వింజమూరు: బ్యాంకుల నుంచి స్వయం సహాయ సంఘాలు రుణాలు తీసుకుని ఆర్థిక ప్రగతి సాధించాలని నాబార్డు ఏజీఎం రమేష్ తెలిపారు. మంగళవారం స్థానిక వీఆర్ ఫంక్షన్ ప్లాజాలో ఏర్పాటు చేసిన స్వయం సహాయక సంఘ సభ్యుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సహాయ సంఘాలు జాయింట్ లయబిలిటీ ద్వారా రుణాలు పొంది, సక్రమంగా ఉపయోగించుకుని ప్రగతి సాధించాలన్నారు. ఇంతకుముందు జిల్లాలోని రైతు గ్రూపులు రుణాలు తీసుకోవడం, తిరిగి చెల్లించడంలోనూ ముందుండేవన్నారు. ప్రస్తుతం పలు కారణాల వల్ల కొన్ని గ్రూపుల్లోని సభ్యులు సకాలంలో రుణాలు చెల్లించలేకపోతున్నారన్నారు. సమావేశానికి వచ్చిన వ్యవసాయాధికారులు వ్యవసాయ, ఉద్యానశాఖ అమలు చేస్తున్న వివిధ పథకాలు వివరించారు. ఈ కార్యక్రమంలో సిండికేట్ బ్యాంకు ఆర్ఎం బాలకృష్ణ, సార్ప్ ప్రాజెక్టు కోఆర్డినేటర్ జే.మోహన్, స్థానిక ఉద్యానశాఖాధికారిణి జ్యోతి, ఏడీఏలు సత్యనారాయణచౌదరి, సత్యవాణి, ఆత్మ బీటీఎం రవీంద్రుడు, కలిగిరి ఎస్‌బీఐ మేనేజర్ పయాజ్‌బాష, ఇతర బ్యాంకు సిబ్బంది, రైతులు తదితరులున్నారు.



చెక్కు అందచేస్తున్న ఎమ్మెల్యే బొల్లినేని

చంద్రన్న బీమా చెక్కు పంపిణీ

దుత్తలూరు: రాచవారిపల్లిలో అగ్నిప్రమాదానికి గురై మృతిచెందిన మోతుకూరి చౌడమ్మ కుటుంబానికి చంద్రన్న బీమా మంజూరైంది. మంగళవారం ఉదయగిరి శాసనసభ్యులు బొల్లినేని వెంకటరామారావు తన క్యాంపు కార్యాలయంలో చౌడమ్మ కుటుంబ సభ్యులకు రూ.4,22,500ల చెక్కును అందచేశారు. మిగిలిన రూ.70 వేల నగదు నెలలోపు అందుతుందని తెలిపారు. టీడీపీ నేతలు గురవారెడ్డి, వెంగళరెడ్డి, బడే కొండారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పీఎంఏవై అర్హుల ఎంపికకు గ్రామసభలు

ఉదయగిరి రూరల్: జీ.అయ్యవారిపల్లి, నేలటూరు పంచాయతీల్లో మంగళవారం ప్రధానమంత్రి అవాజ్ యోజన పథకం కింద పక్కాగృహాల లబ్ధిదారుల ఎంపికకు అధికారులు గ్రామసభలు నిర్వహించారు. ఈ సందర్భంగా పల్స్ సర్వేలో నివాసాలు లేని వారి పేర్లు గ్రామసభలో చదివి వినిపించారు. ఆ పేర్లపై అభ్యంతరాలుంటే గ్రామస్థులు తెలియచేయాలన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన 13 అంశాల్లో అర్హులై ఉంటే పక్కాగృహాలు మంజూరు చేస్తామన్నారు. తహసీల్దారు టి.వెంకటసునీల్, వ్యవసాయాధికారి జహీర్, సర్పంచు వెంకట్రామయ్య, కార్యదర్శులు పాల్గొన్నారు.

సీతారామపురం: గుండుపల్లి గ్రామంలో మంగళవారం ఎంపీడీవో కిరణ్‌కుమార్ గ్రామసభ నిర్వహించారు. సర్పంచ్ కాటసాని రమణమ్మ, పంచాయతీ కార్యదర్శి జయకుమార్ పాల్గొన్నారు.

దుత్తలూరు: తెడ్డుపాడులో తహసీల్దారు రామకృష్ణ ఆధ్వర్యంలో గ్రామసభ నిర్వహించారు. గ్రామంలో పక్కాగృహాలకు అర్హుల ఎంపికపై గ్రామస్థులతో చర్చించారు. గ్రామస్థుల నుంచి అర్జీలు స్వీకరించారు.

నవరత్నాలను నమ్ముతున్నారు!



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే మేకపాటి

ఉదయగిరి రూరల్: వైసీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ప్రకటించిన నవరత్నాల పథకాలను ప్రజలు నమ్ముతున్నారని ఉదయగిరి మాజీ ఎమ్మెల్యే మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం స్థానిక మెరిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో విలేఖరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నంద్యాలలో శిల్పా మోహన్‌రెడ్డి విజయం తథ్యమన్నారు. ఈనెల 3న నంద్యాలలో జరిగిన బహిరంగసభలో జగన్ మాటలను వక్రీకరించి టీడీపీ నాయకులు లేనిపోని రాద్ధాంతం సృష్టిస్తున్నారన్నారు. టీడీపీ ఎమ్మెల్సీ శిల్పా చక్రపాణిరెడ్డి ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేసేసే వైసీపీలో చేరాలని వైఎస్ జగన్ సూచించడం రాష్ట్రంలో చర్చనీయాంశంగా మారిందన్నారు. వైసీపీకి చెందిన 20 మంది ఎమ్మెల్యేలను టీడీపీలో చేర్చుకుని, మంత్రి పదవులు ఇవ్వడం ఆ పార్టీ అనైతికతకు నిదర్శనమన్నారు. చంద్రబాబు అబద్ధాల కోరని నంద్యాలలోని ప్రతి వీధిలో ప్రజలు అంటున్నారన్నారు. అక్కడ వైసీపీ మన విజయం తప్పదన్నారు. చింతలరెడ్డి సుబ్బారెడ్డి, అక్కి భాస్కర్‌రెడ్డి, జయరాజ్‌తదితరులు పాల్గొన్నారు .

జగన్‌కు ప్రజలే బుద్ధి చెబుతారు

ఉదయగిరి రూరల్: రాష్ట్రం లోటు బడ్జెట్‌లో ఉన్నా, అభివృద్ధికి ఎనలేని కృషి చేస్తున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుని కాల్చి చంపాలని 11 కేసుల్లో నిందితుగా వున్న జగన్‌మోహన్‌రెడ్డి వ్యాఖ్యానించడం దారుణమని టీడీపీ నాయకులు విమర్శించారు. మంగళవారం వారు మాట్లాడుతూ 40 ఏళ్ల సుదీర్ఘ రాజకీయ జీవితంలో చంద్రబాబు ఎప్పుడూ అనుచిత వ్యాఖ్యలు చేయలేదన్నారు. పదేళ్ల ప్రతిపక్షంలో ఉన్నా, ఎవరెన్ని మాటలన్నా వ్యక్తిగత దూషణలకు దిగలేదన్నారు. పట్టిసీమతో 14 లక్షల హెక్టార్లకు సాగునీరు అందించారన్నారు. రాయలసీమకు 120 టీఎంసీల నీరు ఇచ్చిన ఘనత చంద్రబాబుకే దక్కుతుందన్నారు. అలాంటి వ్యక్తిని విమర్శిస్తున్న జగన్‌కు ప్రజలే బుద్ధి చెపుతారన్నారు. జగన్ ఉన్మాద చర్యలను భరించలేకే, వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఆయనను బెంగుళూరులోనే ఉంచాడన్నారు. ఎంపీ పదవీ కోసం సొంత బాబాయితో రాజీనామా చేయించిన వ్యక్తి జగన్ అన్నారు. రాష్ట్ర ప్రజలు ఈ విషయాలను గమనిస్తున్నారన్నారు. నంద్యాలలో టీడీపీ విజయం తప్పదన్నారు. మండల కన్వీనర్ డి.వెంకటస్వామి, నాయకులు బొజ్జా నరసింహులు, బయ్యన్న, ఓబులరెడ్డి, గడ్డం వెంకటేశ్వర్లు, నల్లిపోగు రాజా, కల్లూరిమోహన్‌రావు, బొజ్జా శ్రీనివాసులు, సయ్యద్ సందానీ పాల్గొన్నారు.

దినఫలాలు

అదృష్టసంఖ్యలు: 5, 9

మేషరాశి: (మార్చి21-ఏప్రిల్20): సినీ, రాజకీయ, న్యాయ, ఉన్నత విద్యా రంగాల వారికి ఆర్థికంగా అనుకూలిస్తుంది. ప్రియతములకు సంబంధించి కీలక సమాచారం అందుకుంటారు. ప్రయాణాలు, చర్చలు, వేడుకలు ఉల్లాసం కలిగిస్తాయి.

వృషభరాశి: (ఏప్రిల్21-మే20): బంధు, మిత్రులతో ఉల్లాసంగా గడుపుతారు. ప్రదర్శనలు, సభలకు అనుకూలం. ఆర్థిక విషయాల్లో సన్నిహితుల వైఖరి గురించి ఆలోచిస్తారు. ఇంటి కోసం విలువైన వస్తువులు సమకూర్చుకుంటారు.

మిథునరాశి:(మే21-జూన్21): పెద్దలతో సమావేశాలు ఉల్లాసం కలిగిస్తాయి. వృత్తి, ఉద్యోగాలకు సంబంధించిన కీలక సమాచారం అందుకుంటారు. సోదరీ సోదరుల విషయాల్లో శుభపరిణామాలు సంభవం.

కర్కాటకరాశి:(జూన్22-జూలై23): వేడుకల్లో పాల్గొంటారు. ప్రణాళికాబద్ధంగా వ్యవహరించి ఆర్థికపరమైన లక్ష్యాలు సాధిస్తారు. పెట్టుబడులకు సంబంధించిన వివరాలు సేకరిస్తారు. సంకల్పం ఫలిస్తుంది.

సింహరాశి:(జూలై24-ఆగస్ట్23): పూర్వ మిత్రులను కలుసుకుంటారు. మ్యూచ్యువల్ ఫండ్స్, బ్యాంకు లావాదేవీలు లాభిస్తాయి. ఆర్థిక వ్యవహారాలపై స్పష్టమైన నిర్ణయానికి వస్తారు. ఆత్మావలోకనం చేసుకునేందుకు తగిన సమయం.

కన్యారాశి: (ఆగస్ట్24-సెప్టెంబర్23): సమావేశాలు, బృందకార్యక్రమాల్లో పాల్గొంటారు. దూర ప్రాంతాల్లో ఉన్న వ్యక్తులతో అనుబంధం ఏర్పడుతుంది.భాగస్వామి గురించి ఆలోచిస్తారు. కొత్త పరిచయాలు లక్ష్య సాధనకు తోడ్పడతాయి.

తులారాశి: (సెప్టెంబర్24-అక్టోబర్23): బంధుమిత్రులతో విందు వినోదాల్లో పాల్గొంటారు. ఆస్పత్రులు సందర్శిస్తారు. వైద్యం, హోటల్, రిటైల్ రంగాల వారికి ఆర్థికంగా ప్రోత్సాహకరం. ఆహార నియమాలు పాటిస్తారు.

వృశ్చికరాశి: (అక్టోబర్24-నవంబర్22): ప్రముఖులతో వేడుకల్లో పాల్గొంటారు. మీ ప్రతిభకు గుర్తింపు లభిస్తుంది. ఆర్థిక విషయాల్లో సంకల్పం నెరవేరుతుంది. చిట్‌ఫండ్‌లు, డిపాజిట్లపై మంచి ప్రతిఫలం అందుకుంటారు.

ధనూరాశి: (నవంబర్23-డిసెంబర్21): బంధుమిత్రుల కలయికతో ఇంట్లో సందడిగా ఉంటుంది. ఇంటికి అవసరమైన వస్తువుల రవాణాకు అనుకూలం. బదిలీల విషయంలో వ్యూహాత్మకంగా వ్యవహరించి లక్ష్యం సాధిస్తారు.

మకరరాశి(డిసెంబర్22-జనవరి21): సోదరీ సోదరుల విషయాల్లో శుభపరిణామాలు సంభవం. చిరకాల మిత్రుల కలయిక ఆనందం కలిగిస్తుంది. సన్నిహితుల స్నేహసరీ, రవాణా, బోధన, ఏజెన్సీ రంగాల వారికి ఆర్థికంగా ప్రోత్సాహకరం.

కుంభరాశి: (జనవరి22-ఫిబ్రవరి18): వేడుకల్లో పాల్గొంటారు. భాగస్వాముల లాభిస్తాయి. స్నేహ పరిచయాల ఆధారంగా ఆర్థికపరమైన లక్ష్యాలు సాధిస్తారు. ప్రియతముల కోసం విలువైన వస్తువుల కొనుగోలు చేస్తారు. బహుమతులు ఇచ్చిపుచ్చుకుంటారు.

మీనరాశి:(ఫిబ్రవరి19మార్చి20): విందు, వినోదాలతో ఉల్లాసంగా గడుపుతారు. ఉద్యోగ సంస్థలు, పరిశ్రమలు, వైద్య రంగాల వారికి కొత్త ఆలోచనలు స్ఫురిస్తాయి. కొత్త ప్రాజెక్టుల ప్రారంభానికి అనుకూల సమయం.

-బిజుమళ్ళ బిందుమాధవ శర్మ

రుణాల మంజూరుపై విచారణకు ఆదేశం

● విచారణాధికారిగా జేసీ -2 ● కమిటీ అనుమతి లేకుండా మంజూరు ఎలా ?
● నిధుల దుర్వినియోగంపై కలెక్టర్ ఆగ్రహం ● బాధ్యులపై కేసులకు రంగం సిద్ధం

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

నెల్లూరు (వేదాయపాళెం): ఎస్సీ కార్పొరేషన్ ద్వారా అందించే ఎన్ఎస్ఎఫ్‌డీసీ రుణాల్లో జరిగిన అవకతవకలపై కలెక్టర్ ఆర్ ముత్యాలరాజు విచారణకు ఆదేశించారు. విచారణ అధికారిగా జేసీ-2ని నియమించారు. మంగళవారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన 'ఎస్సీ కార్పొరేషన్ రుణాల మంజూరులో చేతివాటం' అనే కథనానికి కలెక్టర్ స్పందించారు. 2016 - 17 సంవత్సరానికి గానూ ఎన్ఎస్ఎఫ్‌డీసీ రుణాల్లో సెలక్షన్ కమిటీ అనుమతి లేకుండా 43 యూనిట్లకు రూ. 1.30 కోట్లు విలువగల ఆస్తులు పంపిణీ జరిగినట్లు అధికారుల ద్వారా సమాచారం సేకరించినట్లు తెలిసింది. అసలు ఎస్సీ కార్పొరేషన్‌లో ఏం జరిగింది.. కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేసినట్లు సమాచారం. కమిటీ అనుమతి లేకుండా రూ.1.30 కోట్లు ఎలా పంపిణీ చేస్తారంటూ ప్రశ్నించారు. వెంటనే జేసీ-2 వెంకటసుబ్బారెడ్డిని ఈ వ్యవహారంపై విచారణ అధికారిగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటికే అర్హులైనవారికి రుణాలు అందలేదని, భూమికొనుగోలు పథకంలో సీజేఎఫ్ఎస్ భూములు ఉన్నాయని, ఎన్ఎస్‌కేఎఫ్‌డీసీ రుణాలు సెలక్షన్ కమిటీకి సంబంధం లేకుండా జాబితా ప్రకటించారని ఓ దళితనేత కలెక్టర్‌కు, ఎస్సీ, ఎస్టీ కమిషన్ ఛైర్మన్‌లకు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో జేసీ-2ని విచారణ అధికారిగా కలెక్టర్ నియమించారు. ఈ విచారణ తుది దశకు చేరుకుంది. ఈ నేపథ్యంలో ఇప్పుడు మళ్లీ ఎన్ఎస్ఎఫ్‌డీసీ రుణాల్లో గోల్‌మాల్‌పై జేసీ-2ని విచారణ అధికారిగా నియమించడంతో ఒకే కార్యాలయంలో రెండు ఫిర్యాదులపై ఏక కాలంలో ఒకరే విచారణ చేపట్టినట్లయింది. ఈ నివేదికల ఆధారంగా బాధ్యులపై క్రిమినల్ చర్యలు తీసుకునేలా కలెక్టర్ యోచిస్తున్నట్లు సమాచారం. ఇదే జరిగితే గత ఈడీ ఏ జయరాంతో పాటు సిబ్బందిపై వేటు పడనున్నది.

11న ప్రభుత్వ ఉద్యోగులకు గ్రీవెన్స్

నెల్లూరు(కలెక్టరేట్): ప్రభుత్వ ఉద్యోగులకు ఈనెల 11వ తేదీ సాయంత్రం 5 గంటలకు కలెక్టరేట్‌లో కలెక్టర్ ముత్యాలరాజు గ్రీవెన్స్ కార్యక్రమం నిర్వహించనున్నారని డీఆర్వో వీ వెంకటసుబ్బయ్య ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని ప్రభుత్వ ఉద్యోగులంతా వారి సర్వీసుకు సంబంధించిన సమస్యలు ఏమైనా ఉంటే ఆ రోజు కలెక్టర్‌కు లిఖితపూర్వకంగా తెలియపరచుకోవచ్చని ఆయన తెలిపారు.

రేపు శాంతియుత నిరసన ర్యాలీ

నెల్లూరు (సాంస్కృతికం): క్రైస్తవ,ముస్లిం మతాలను స్వీకరించిన దళితులను షెడ్యూల్డ్ కులాలుగా పరిగణించ రాదంటూ 1950 ఆగస్టు 10న రాజ్యాంగం ఉత్తర్వులు ఇచ్చింది.ఇందుకు నిరసనగా గురువారం క్రైస్తవులు శాంతియుత నిరసన ర్యాలీ నిర్వహించనున్నట్లు ఆల్ ఇండియా క్రిష్టియన్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు బీ యేసురత్నం తెలిపారు. ఈ సందర్భంగా బిషప్‌హౌస్‌లో మంగళవారం బ్లాక్‌డే పోస్టర్‌ను ఆవిష్కరించారు. 10వ తేదీ ఉదయం 10గంటలకు ఏబీఎం కాంపౌండ్ నుంచి భారీ ర్యాలీగా బయలుదేరి కలెక్టర్‌కు వినతిపత్రం అందచేస్తున్నామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో బిషప్ ఎండీ ప్రకాశం, పాదర్ జోసెఫ్, ఆల్ ఇండియా క్రిష్టియన్ ఫెడరేషన్ రాష్ట్రకార్యదర్శి యూ సురేంద్రబాబు పాల్గొన్నారు.

క్రీడా మైదానాలను వెంటనే పూర్తి చేయండి

నెల్లూరు (వేదాయపాళెం) : జిల్లాలో వివిధ దశలలో ఉన్న పాఠశాల క్రీడా మైదానాలను వెంటనే పూర్తి చేయాలని డ్వామా పీడీ హరిత ఆదేశించారు. మంగళవారం తన ఛాంబర్‌లో ఇంజనీరింగ్ కన్సల్టెంట్స్, జూనియర్ ఇంజనీర్లతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో మొత్తం 220 పాఠశాలల క్రీడా ప్రాంగణాలు మంజూరు కాగా అందులో 45 మాత్రమే పురోగతిలో ఉన్నాయన్నారు. మిగిలిన వాటిని త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. 5,639 పనుల్లో ఈనెల 15వ తేదీ లోపు పూర్తిస్థాయి నివేదిక తీసుకుని రావాలన్నారు. 57,079 పనుల్లో మొక్కల పెంపకం మినహాయించి, మిగిలిన పనులకు సంబంధించి ఈనెల 30లోపు పూర్తి స్థాయి నివేదిక సిద్ధం చేయాలన్నారు. బోర్‌వెల్ రీచార్జి కట్టడాలను, సాలిడ్ వేస్ట్ ప్రాసెసింగ్ సెంటర్లను ప్రతి మండలానికి ఐదు చొప్పున సెప్టెంబరు 15లోపు పూర్తి చేయాలన్నారు. జిల్లాలో మిగిలిన వ్యక్తిగత మరుగుదొడ్లను ఈనెల 30వ తేదీ లోపు పూర్తి చేయాలన్నారు. పూర్తయిన వెంటనే జియో ట్యాగింగ్ చేయాలని ఆమె ఆదేశించారు.

రేపు విద్యాసంస్థల బంద్

గూడూరు(రూరల్): రాష్ట్రవ్యాప్తంగా ఈ నెల పదో తేదీన విద్యాసంస్థల బంద్ చేపడుతున్నట్లు ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు సునీల్ తెలిపారు. మంగళవారం స్థానిక సీపీఎం కార్యాలయంలో ఏఐఎస్ఎఫ్, ఎస్ఎఫ్ఐ, పీడీఎస్‌యూ, పీడీఎస్ఓ విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో బంద్‌కు సంబంధించిన గోడపత్రిక ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ విద్యా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ బంద్‌కు పిలుపునిచ్చామన్నారు. ప్రభుత్వం పాఠశాలలు, హాస్టళ్లను మూసివేయడం, మున్సిపల్ పాఠశాలల్లో తెలుగు మీడియం తీసివేయడంతో పేద విద్యార్థులు విద్యకు దూరమయ్యే అవకాశం ఉందన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంటు, స్కాలర్ షిప్‌లను వెంటనే విడుదల చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు బాబురావు, పవన్, శ్రీకాంత్, గిరిబాబు, కరిముల్లా, లోకేష్, కోటేశ్వరరావు పాల్గొన్నారు.



గోడపత్రిక విడుదల చేస్తున్న నాయకులు

గ్రామీణ లబ్ధిదారులను బట్టి లక్ష్యాలు

ఎస్సీ కార్పొరేషన్ ఈడీ బీఆర్ అంబేద్కర్

నెల్లూరు (వేదాయపాళెం): గ్రామాలలో బ్యాంకుల పరిధిలో ఉన్న లబ్ధిదారులకు బట్టి ఈ ఏడాది నుంచి లక్ష్యాలు నిర్దేశించనున్నామని ఎస్సీ కార్పొరేషన్ ఈడీ బీఆర్ అంబేద్కర్ తెలిపారు. మంగళవారం జెడ్పీడీసీ వీవో చాంబర్‌లో జరిగిన అధికారులు, బ్యాంకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలో బ్యాంకు ప్రాతిపదికన లక్ష్యాలు కేటాయించేవారన్నారు. దీంతో ఒక బ్యాంకును కేవలం 10 మంది లబ్ధిదారులు మాత్రమే ఎంపిక చేసి ఉంటే 20 యూనిట్లు లక్ష్యంగా, అదేవిధంగా 30 మందిని ఎంపిక చేసుకుని ఉంటే అదే 20 యూనిట్లు లక్ష్యంగా ఇచ్చేవారన్నారు. దీంతో కొన్ని బ్యాంకుల్లో సబ్సిడీ నిరుపయోగం అవుతుండగా, మరి కొన్ని బ్యాంకుల్లో తక్కువ వేదన్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని కలెక్టర్ ఈ నిర్ణయం తీసుకున్నారన్నారు. అంతేకాక రుణాలకు దరఖాస్తు చేసుకుని కమిటీలో ఎంపిక అయిన తరువాత లక్ష్యాలు పూర్తయిన కారణంగా బ్యాంకులు రుణాలు గ్రౌండింగ్ లబ్ధిదారులకు ఈ ఏడాది కమిటీలతో సంబంధం లేకుండా ఎంపికలో బ్యాంకులకు తొలి ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. లబ్ధిదారుల ఎంపికకు మండల కమిటీలో బ్యాంకర్లు హాజరు కాకుంటే ఎంపికలు వాయిదా వేయాలని ఆయన తెలిపారు. బ్యాంకర్లు ఎంపికల్లో తప్పకుండా ఉండాలన్నారు. కలెక్టర్ అనుమతితో, జిల్లా కమిటీ ఆమోదంతో రుణ ప్రక్రియ ప్రారంభిస్తున్నారు. దీనిపై ఏపీజీబీ జిల్లా సమన్వయకర్త మాట్లాడుతూ గతేడాది ఏపీజీబికి 960 యూనిట్ల లక్ష్యంగా ఉండగా, ఈ ఏడాది 1600 యూనిట్లు కేటాయించారన్నారు. పట్టణాల్లో ఉన్న లక్ష్యాలను ఇతర బ్యాంకులకు బదలాయించి, గ్రామీణ ప్రాంతాలలో ఈ లక్ష్యాన్ని పూరించాలనన్నారు.ఈ కార్యక్రమంలో బీసీ కార్పొరేషన్ ఈడీ వెంకటస్వామి, మైనారిటీ కార్పొరేషన్ ఈడీ సబీహా పర్విన్, ఎల్‌డీఎం వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

కావలి డీఏవోగా అల్లూరు తహసీల్దార్

నెల్లూరు(కలెక్టరేట్) : అల్లూరు తహసీల్దార్‌గా పనిచేస్తున్న జనార్దనరావును కావలి ఆర్డీవో కార్యాలయంలో డివిజనల్ పరిపాలనాధికారిగా నియమిస్తూ కలెక్టర్ ముత్యాలరాజు మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన గ్రీవెన్స్‌లో కలెక్టర్ ముత్యాలరాజును, వెబ్ ప్రసారంలో ఆయన అసభ్యంగా మాట్లాడినందుకు దండనగా ఆయనను కావలిలో డీఏవోగా నియమించారు. గ్రీవెన్స్‌కు సంబంధించి కలెక్టర్, తహసీల్దార్ కార్యాలయాల్లో వెబ్ ప్రసారాలను ఏర్పాటు చేయించారు. ఆ ప్రసారాలన్నీ కలెక్టరేట్‌లోని ప్రధాన వెబ్ స్క్రీన్‌లో వీక్షించేలా ఏర్పాట్లు చేయించారు. సోమవారం జనార్దనరావు అసభ్య పదజాలాన్ని విన్న కలెక్టర్ ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు.

బంగారం, వెండి ధరలు

22 క్యారెట్స్ బంగారం

గ్రాము ధర	-	2,722
సవర (8 గ్రాములు)	-	21,776
వెండి కిలో ధర	-	40,500
వెండి గ్రాము ధర	-	40.50

చికెన్ ధరలు

వెన్‌కాబ్..

బాయిలర్ రైతు ధర	83
లేయర్	77
స్కిన్ చికెన్	137
స్కిన్‌లెస్ చికెన్	162
లేయర్ మాంసం	130

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్..

బాయిలర్ లైవ్	93
లేయర్ లైవ్	77
స్కిన్ చికెన్	154
స్కిన్‌లెస్	180
లేయర్	130

నిమ్మ ధరలు (బస్తా) గూడూరు

పచ్చివి: రూ.1,200 నుంచి రూ. 2,200 వరకు
పండ్లు: రూ.800 నుంచి రూ.1,200 వరకు

జలాశయాల్లో నీటిమట్టాలు

సోమశిల

పూర్తి సామర్థ్యం:		78 టీఎంసీలు
ప్రస్తుత నీటినిల్వ:		6.840 టీఎంసీలు
ఇన్‌ఫ్లో :		------------
అవుట్‌ఫ్లో	:	500 క్యూసెక్కులు
ఆవిరి	:	56 క్యూసెక్కులు

సంగం ఆనకట్ట

నీటిమట్టం	: -------------
కనిగిరికాలువ :	-------------
ఎడమ కాలువ :	-------------
కనుపూరు కాలువ:	-------------
బీపీఆర్ కాలువ :	-------------
నెల్లూరుచెరువుకాలువ :	------------

పదాలు కనుక్కోండి

S	U	N	F	Z	H	P	A	S
V	A	C	A	T	I	O	N	W
S	W	O	M	F	H	O	T	I
U	T	F	I	A	Q	L	L	M
M	J	U	L	J	U	N	E	M
M	U	N	Y	A	R	H	S	I
E	L	A	U	G	U	S	T	N
R	Y	M	B	E	A	C	H	G

family
summer
vacation

sun
hot
fun

beac
pool
swim

June
July
August

నవ్వుల్ నవ్వుల్

టింకు : అరేయ్ బిట్టూ! మా టామీ మీ ఇంటి కన్నా ఎక్కువ ఎత్తు ఎగరగలదు తెలుసా?

బిట్టు : అంత సీను లేదు రా! నేను నమ్మను.

టింకు : చూడు మా టామీ ఎగిరింది. మరి మీ ఇల్లు ఎగురుతుందా?

బిట్టు : !!!!!!!!!!!!

దారి కనుక్కోండి





బుల్‌ఫైట్ తెలుసు. స్ట్రీట్ ఫైట్ తెలుసు. కానీ ఫుడ్‌ఫైట్ గురించి తెలుసా! వేల మంది ఒకచోట గుమికూడి రోడ్లపై టన్నుల కొద్దీ టొమాటోలు కుమ్మరించి వాటితో కొట్టుకోవడమే ఫుడ్‌ఫైట్. స్పెయిన్ దేశంలోని బ్యునెల్‌లో ఈ ఫుడ్‌ఫైట్ జరుగుతుంది. ప్రతి ఏడాది ఆగస్టు నెల చివరి బుధవారంలో జరిగే ఈ ఫుడ్‌ఫైట్‌ను చూడటానికి ప్రపంచం నలుమూలల నుంచి పర్యాటకులు వెళుతుంటారు.



అతి పెద్ద టొమాటో ఫైట్

బ్యునెల్....

స్పెయిన్‌లో చిన్న ఊరు. అక్కడి జనాభా తొమ్మిది వేలే. కానీ, ఆగస్టు నెల చివరి బుధవారం వచ్చిందంటే చాలు రోడ్లన్నీ జనమయం అవుతాయి. ఎక్కడ చూసినా టొమాటోలే కనిపిస్తాయి. 'వరల్డ్ బిగ్గెస్ట్ ఫుడ్‌ఫైట్'గా పిలిచే ఈ వేడుకను తిలకించడానికి ప్రపంచం నలుమూలల నుంచి పర్యాటకులు వస్తుంటారు. 2013లో సుమారు 50 వేల మంది ఈ ఫైట్‌లో పాల్గొనడానికి వచ్చారట. అంత మంది పాల్గొనడం కష్టమని భావించిన నిర్వాహకులు లాటరీ సిస్టమ్‌ను పెట్టి 20 వేల మందిని ఎంపిక చేశారు. ఈ ఫుడ్‌ఫైట్‌కు ఉన్న క్రేజ్ అది.

ఎలా మొదలయింది?

ఈ టొమాటో ఫుడ్‌ఫైట్ సంప్రదాయంగా వస్తోంది. అయితే ఇది ఎలా మొదలయిందీ అనే విషయం కచ్చితంగా తెలియదు. రకరకాల కథనాలు చెబుతుంటారు. 1944-45లో మొదటి సారి ఫుడ్‌ఫైట్ జరిగింది. స్నేహితుల మధ్య ఆహారం కోసం జరిగిన పోరు అని చెబుతుంటారు. ప్రమాదవశాత్తు ఒక లారీ బోల్తా పడటం వల్ల మొదలయిందని అంటుంటారు. అన్నింటికన్నా ఎక్కువ ప్రాచుర్యంలో ఉన్న కథనం ఏమిటంటే ఒక రోజు టౌన్‌లో ఉత్సవాలు జరుగుతున్న సమయంలో సిటీ కౌన్సిల్‌మెన్ పాలనపై అసంతృప్తితో ఉన్న ప్రజలు టొమాటోలతో దాడి చేశారట. ఫుడ్‌ఫైట్ ఎలా మొదలయినా దాన్ని బాగా ఎంజాయ్ చేయడంతో మరుసటి సంవత్సరం కూడా నిర్వహించారు. అలా అది ప్రతి ఏడాది జరుగుతూ వచ్చింది. అయితే ఫ్రాన్సిస్కో ఫ్రాంకో పాలన సమయంలో ఫుడ్‌ఫైట్‌కు ఎలాంటి సంప్రదాయ ప్రాముఖ్యత లేకపోవడంతో ఆ రోజు సెలవును రద్దు చేశారు. అయితే 1970లో ఆయన తరువాత మళ్లీ సెలవును పునరుద్ధరించారు. పట్టణాన్ని రక్షించే దేవతలైన ల్యూయిస్ బెర్‌ట్రాన్, మారె దిడ్యూ డేల్స్ గౌరవార్థం ఈ పండుగను నిర్వహిస్తున్నారు.



సందడే సందడి

ఉదయం 11 గంటలకు టౌన్ సెంటర్‌లోకి టొమాటోలతో ట్రక్కులన్నీ చేరుకుంటాయి. తరువాత రెండు అంతస్తుల పొడవున్న ఒక పొడవాటి కర్రకు గ్రీజును పూసి సెంటర్లో పాతుతారు. దాన్ని పైకి ఎక్కిన తరువాతే ఫుడ్‌ఫైట్ మొదలవుతుంది. ఫుడ్‌ఫైట్ ప్రారంభానికి సంకేతంగా నీటి ఫిరంగులను ప్రయోగిస్తారు. దాంతో పండుగ మొదలవుతుంది. వేల మంది టొమాటోలతో కొట్టుకోవడం మొదలుపెడతారు. సరిగ్గా ఒక గంట తరువాత ఫైట్ ముగుస్తుంది. అప్పుడు ఎవ్వరూ కూడా టొమాటోలు విసరడం చేయరు. వెంటనే టౌన్‌లోని వీధులన్నీ శుభ్రం చేసే కార్యక్రమం మొదలవుతుంది. పర్యాటకులు దగ్గరలో ఉన్న బ్యునెల్ నదిలో స్నానం చేస్తారు. మొత్తంగా ఫుడ్‌ఫైట్ మరచిపోలేని మధురానుభూతిని అందిస్తుంది.

ఈ ఫుడ్‌ఫైట్‌లో పాల్గొనే వారు కొన్ని రూల్స్ పాటించాలి. అవి...

- పదునైన వస్తువులు, బాటిల్స్ తీసుకెళ్లకూడదు.
- ఇతరుల టీషర్టులు చింపకూడదు.
- టొమాటోలు విసిరే ముందు తప్పకుండా చిదమాలి.
- టొమాటోలను తీసుకొచ్చిన లారీలకు దూరంగా ఉండాలి.

ఇది నిజం !



థాయ్‌లాండ్‌లో షాపింగ్ చేసినపుడు, బిల్లింగ్ కౌంటర్‌లో మిమ్మల్ని చూసి షాప్ యజమాని 'హాహాహా' అంటే.. అపార్థం చేసుకోవద్దు. ఎందుకుంటే థాయ్‌లో 'హా' అంటే ఐదు అని అర్థం. హాహాహా అంటే 555.

రంగులు వేయండి



టంగ్‌ట్విస్టర్స్

1. I feel a feel a funny feel a funny feel feel I,If I feel a funny feel a funny feel feel I.
2. If a fella met a fella in a field of fitchesCan a fella tell a fella where a fella itches?
3. It's a nice night for a white rice fight.



సూక్తి

ఓడిపోతామనే భయంతో ప్రయత్నించకుండా ఉండటం కంటే ప్రయత్నించి ఓడిపోవడం మేలు.

మీకు తెలుసా?

- పాలను తోడుబెట్టి పెరుగు తయారు చేయడం, వెన్న సేకరించడం వంటి ప్రక్రియలు క్రీస్తు పూర్వం 5000 సంవత్సరాల నాటికే మానవులకు తెలుసు.
- ప్రాచీన కాలంలోనే భారతీయులు పాలతో రకరకాల వంటకాలను తయారు చేసేవారు.

ఇరిగేషన్‌లో పది కోట్లకు 'టెండర్'

- ఇప్పటికే రూ.35 కోట్లతో పనులు మొదలు
- తాజాగా మరో 10 కోట్లకు అనుమతులు
- పనులన్నీ సదరన్, రేబాల సప్లయ్ ఛానళ్లకే

నెల్లూరు, (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : కోవూరు నియోజకవర్గంలో 'నీరు- ప్రగతి' స్కీం కింద మరో రూ. 10 కోట్ల నిధులకు టెండర్ పెట్టేందుకు సన్నాహాలు మొదలయ్యాయి. ఇప్పటికే ఈ నియోజకవర్గంలో రూ. 35 కోట్లతో పనులు సాగుతుండగా, తాజాగా నీటి సంఘాల పేరిట పంపిన ప్రతిపాదనలకు పరిపాలనా అనుమతులు లభించడం విశేషం. నీటి సంఘాల నేత నేతృత్వంలో రూ. 6 కోట్లతో సరదన్, రేబాల సప్లయ్ ఛానళ్ల పనులు చేపట్టేందుకు సిద్ధమవుతున్నట్లు సమాచారం. ఎస్టిమేట్లు, సాంకేతిక అనుమతుల కోసం ఆ నేత ఇంజనీర్లపై ఒత్తిళ్లు తెస్తున్నట్లు ప్రచారం సాగుతోంది. గతంలో పంపిన ప్రతిపాదనలపై విచారణ జరిపి పలు పనులు అవసరం లేదని అధికారులు తేల్చడంతో వాటిని పక్కనపెట్టి తాజాగా మరో రూ.పది కోట్ల అనుమతులివ్వడం, వాటిలో సిమెంటు పనులే అధికంగా ఉన్నాయని ఇ ంజనీరింగ్ అధికారులు చెబుతుండడం, ఈ వ్యవహారమంతా మూడో కంటికి తెలియకుండా గోప్యంగా సాగిపోతుండడం పలు అనుమానాలకు తావిస్తోంది. రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గి కేవలం రెండు కాలువలకే నీరు-ప్రగతి నిధులు కట్టబెట్టడంపై విమర్శలు వస్తున్నాయి.



బుచ్చిరెడ్డిపాళెంలోని సదరన్ సప్లయ్ ఛానల్

● గత ప్రతిపాదనలు పక్కనపెట్టి..

కోవూరు నియోజకవర్గంలో ఈ ఏడాది నీరు - ప్రగతి కింద రూ.35 కోట్లతో చెరువుల అభివృద్ధి, తూముల రిపేర్లు, కాలువలపై కల్వర్టులు తదితర పనులను చేపట్టాలని ఇంజనీర్లు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. అవసరమున్న చోటే డీ సిల్టింగ్, మట్టితో చెరువు కట్టలను అభివృద్ధి చేయడం వంటి పనులు చేపట్టే విధంగా ఇంజనీర్లు ప్రభుత్వానికి నివేదికలు పంపారు. ఈ రూ.35 కోట్లతో 850 పనులను ప్రతిపాదించి పరిపాలనా అనుమతులు ఇచ్చారు. ఈ పనుల్లో నేతల జోక్యం అధికం కావడంతో పనులన్నీ కూడా రూ. 5 లక్షలలోపు విభజించి నీటి సంఘాధ్యక్షుల పేరుతో పందేరం చేపట్టారు. దీనిపై ఆంధ్రజ్యోతిలో కథనాలు వెలువడడంతో కలెక్టర్ రేవు ముత్యాలరాజు జేసీ-2 వెంకటసుబ్బారెడ్డిని విచారణాధికారిగా నియమించి పరిశీలించారు. దీంతో ఇంజనీర్లు, నేతలు సర్దుకుని అవసరమున్న చోటే పనులు చేపడుతామంటూ ప్రస్తుతం 460 పనులకు కుదించి సాంకేతిక అనుమతులు ఇచ్చారు. తీరా అగ్రిమెంట్ సమయానికి 310 పనులను రూ. 25 కోట్లతో చేపట్టే విధంగా నిర్ణయం తీసుకున్నారు. అంటే సుమారు రూ. 10 కోట్లతో చేపట్టే 540 పనులు పక్కన పెట్టారు. మొదటి నుంచి నీరు- ప్రగతిపై విమర్శలు వెల్లువెత్తడంతో ప్రభుత్వం కొన్ని మార్గదర్శకాలు జారీ చేసింది. డీ సిల్టింగ్ (పూడిక తీత) ఎర్త్ వర్క్ (మట్టి పని) వంటి పనుల్లోనే అవినీతి జోరుగా ఉందని ఈ పనుల్లో జాగ్రత్తలు పాటించాలని ఆదేశాలు వెలువడ్డాయి. ఇందుకనే ఎక్కువగా సిమెంటు నిర్మాణ పనులకే ప్రాధాన్యత ఇస్తున్నట్లు ఇంజనీర్లు పేర్కొంటున్నారు. సుమారు 50 శాతం పనులు పక్కన పెట్టి మరో 50 శాతం పనులనే ప్రస్తుతం సాగిస్తున్నారు. నీరు- ప్రగతిలో ఏదైన తేడా వస్తే ఆ ఇంజనీర్లపై వేటు తప్పదని ఇప్పటికే కలెక్టర్ పదే పదే హెచ్చరిస్తున్నారు. పెన్నాడెల్టా ఆయకట్టు పరిధిలో వోఅండ్ఎం నిధుల ద్వారా పనులు చేపట్టాలని మరో ప్రతిపాదన తెరపైకి వచ్చింది. ప్రస్తుతానికి వోఅండ్ ఎం నిధులు తగినంత లేకపోవడంతో నీరు-ప్రగతి ద్వారానే ఈ పనులన్నీ నిర్వహిస్తు న్నారు.

● పది కోట్లకు టెండర్

పెన్నాడెల్టాలోని ఓ నీటి సంఘాల నేత రూ. 10 కోట్లతో నీరు - ప్రగతిలో పనులు చేపట్టే విధంగా ఇంజనీర్లపై ఒత్తిళ్లు తెచ్చారు. ఇంజనీర్లు ప్రతిపాదనలు సిద్ధం చేసి కలెక్టర్‌కు నివేదికలు సమర్పించారు. మొదటి నుంచి కోవూరు నియోజకవర్గంపై ఆరోపణలు వెల్లువెత్తడంతో కలెక్టర్ పలు జాగ్రత్తలు చెప్పి విమర్శలు లేకుండా పనులు చేపట్టాలని హెచ్చరించి నాలుగు రోజుల క్రితం రూ. 9.61 కోట్ల విలువైన 116 పనులకు పరిపాలనా అనుమతులు ఇచ్చారు. ఇందులో సదరు నీటి సంఘాల నేత సారథ్యంలోనే రూ.6 కోట్ల విలువైన 64 పనులు చేపట్టాలంటూ ఇంజనీర్లపై ఒత్తిళ్లు మొదలయ్యాయి. అవీ... బుచ్చి సబ్ డివిజన్‌లోని సరదన్, రేబాల సప్లయ్ ఛానళ్ల పరిధిలోనే పనులు చేపట్టేలా పావులు కదుపుతున్నారు. మిగిలిన రూ. 3.61 కోట్ల పనులు మాత్రం నెల్లూరు సబ్ డివిజన్‌కు కేటాయించారు. రెండు రోజుల క్రితం ఆ నేత ఇరిగేషన్ కార్యాలయానికి వచ్చి పరిపాలనా అనుమతులు వచ్చిన పనులకు సాంకేతిక అనుమతి ఇచ్చి అగ్రిమెంట్ చేయాలని ఇంజనీర్లపై ఒత్తిళ్లు తెస్తున్నట్లు సమాచారం. సదరు నీటి సంఘాల నేత రాజకీయ పైరవీలతో గతంలో కూడా రూ. 6 కోట్ల పనులకు పరిపాలనా అనుమతులు తీసుకురాగా, ఆంధ్రజ్యోతిలో వచ్చిన కథనంతో ఆ పనులన్నీ పక్కన పెట్టిన సంగతి తెలిసిందే. ఈ నేథ్యంలో తాజాగా కోవూరు నియోజకవర్గంలో రూ. 10 కోట్లకు నీరు- ప్రగతి పనులు చేపట్టాలని తీసుకున్న నిర్ణయం వివాదాస్పదమవుతోంది. ప్రధాన కాలువలపనుల చేపట్టకుండా ఇలా సప్లయ్ ఛానళ్ల పనులు పేరుతో దోపిడీ చేస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి. జిల్లా అధికారులు, పూర్తి స్థాయిలో పరిశీలించి పనులు నిర్వహించాలని ఆయకట్టు రైతులు కోరుతున్నారు.

మార్గదర్శకాల మేరకే పనులు

నీరు - ప్రగతిలో మార్గదర్శకాల మేరకే పనులు జరుగుతున్నాయి. తాజాగా కొన్ని పనులను పరిపాలనా అనుమతులు వచ్చాయి. వీటిని పూర్తి స్థాయిలో పరిశీలించిన తరువాతే సాంకేతిక అనుమతి, అగ్రిమెంట్లు చేస్తాం. కచ్చితమైన నిబంధనలు పాటించాలని కింది స్థాయి ఇంజనీర్లను ఆదేశించాం. ఎక్కడ పొరపాటు జరిగినా చర్యలు తీవ్రంగా ఉంటాయి.

- కృష్ణమోహన్, ఇరిగేషన్ సెంట్రల్ డివిజన్ ఈఈ



క్రీడాకారులకు శిక్షణ ఇస్తున్న కోచ్‌లు

- వివిధ రాష్ట్రాల నుంచి 17 జట్లు రాక
- ప్రారంభించనున్న మంత్రి కొల్లు రవీంద్ర
- 11 వరకు నిర్వహణ

నేటి నుంచి

జాతీయ సాఫ్ట్‌బాల్ పోటీలు

నెల్లూరు (క్యాంపస్) : ఏడో మినీ సబ్ జూనియర్ జాతీయ సాఫ్ట్‌బాల్ చాంపియన్ షిప్ పోటీలు బుధవారం నుంచి నెల్లూరు వీఆర్సీ మైదానంలో ప్రారంభం కానున్నాయి. ఈ పోటీలను క్రీడాశాఖామంత్రి కొల్లు రవీంద్ర, శాప్ ఎండీ ఎన్ బంగారురాజులు ప్రారంభించనున్నారు. 9, 10, 11 తేదీలలో ఈ పోటీలు జరుగుతాయి. పలు రాష్ట్రాల నుంచి అండర్ 10, అండర్ 12 బాల, బాలి కల జట్లు పాల్గొననున్నాయి. ఈ పోటీల్లోనే జాతీయ జట్టును ఎంపిక చేయనున్నారు.

● ఎనిమిది కోర్టులలో నిర్వహణ

నెల్లూరు సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వ ర్యంలో వీఆర్సీ మైదానంలో ఎనిమిది కోర్టు లలో ఈ పోటీలను నిర్వహించానున్నారు. ఇందుకుగాను ఏర్పాట్లను అసోసియేషన్ నాయకులు మంగళవారం దగ్గరుండి పూర్తి చేయించారు. ఇప్పటికే పలు రాష్ట్రాలకు చెందిన జట్లు వీఆర్సీ మైదానానికి చేరుకొని ప్రాక్టిస్‌లో నిమగ్నమయ్యారు. దేశవ్యాప్తంగా పలు రాష్ట్రాల నుంచి 17 జట్లు తరలివచ్చారు. వీరికి కోసం వీఆర్సీ కళాశాలలో వసతి, భోజనం ఏర్పాట్లు సిద్ధం చేశారు. బుధవారం మధ్యాహ్నం 1గంటలకు ఈ పోటీలను ప్రారంభిస్తారు.

ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తాం

జాతీయ స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలను ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తామని సాఫ్ట్ బాల్ అసోసియేషన్ ఇండియా సీఈవో ప్రవీణ్ అనోకర్ తెలిపారు. పోటీల కోసం జరుగుతున్న ఏర్పాట్లను మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నెల్లూరు సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ పోటీలు చిరస్థాయిలో గుర్తుండేలా నిర్వహించను న్నామన్నారు. కార్యక్రమంలో సన్ని సుల్తాన్, వేషాంగ్, సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ రాష్ట్ర క్యాదర్శి వెంకటేశ్వర్లు, ఆర్గనైజింగ్ సెక్రటరీ సీహెచ్ రవికుమార్ పాల్గొన్నారు.



సాఫ్ట్‌బాల్ ఆడుతున్న క్రీడాకారులు

నేటి నుంచి సంపూర్ణ

గ్రామ దేవాలయ సందర్శన రథయాత్ర

- కమలానంద భారతి



రథయాత్ర గోడ పత్రిక ఆవిష్కరిస్తున్న కమలానంద భారతి

నెల్లూరు (సాంస్కృతికం) : ప్రతి దేవాలయంలో ధూప దీప నైవేద్యాలు సమర్పించడంతోపాటు భక్తులలో సంస్కృతి, సంప్రదాయాలు పెంపొందించేందుకు బుధవారం నుంచి సంపూర్ణ గ్రామ దేవాలయ సందర్శన రథయాత్ర ప్రారంభిస్తున్నామని హిందూ దేవాలయ ప్రతిష్ఠాన పీఠం అధిపతి కమలానంద భారతి తెలిపారు. ఈ యాత్ర గోడపత్రికలను మంగళవారం నెల్లూరులోని ఏబీవీపీ కార్యాలయంలో ఆయన ఆవిష్కరించారు. అనంతరనం విలేఖరులతో మాట్లాడుతూ ఈ యాత్రను 2012లో ప్రారంభించామని చెప్పారు. 2022 వరకు కొనసాగే యాత్రలో 26వేల గ్రామాలు, ఒక లక్ష ఆలయాలను దర్శించడం, లక్ష ట్రస్టులు ఏర్పాటు చేయడం, 10లక్షల మంది హిందూ దేవాలయాల పరిరక్షణ కార్యకర్తలను తయారు చేయడం తమ లక్ష్యమన్నారు. ఇప్పటి వరకు 7వేల గ్రామాలు, 25 వేల ఆలయాలు సందర్శించామన్నారు. బుధవారం ప్రారంభించే యాత్రలో చిత్తూరు, నెల్లూరు జిల్లాల్లోని 1000 గ్రామాలను సందర్శిస్తామని చెప్పారు. హిందూ ధర్మ పరిరక్షణ ట్రస్ట్, సమరసతా సేవా ఫౌండేషన్ సహకారంతో ఈ రథయాత్ర ఆరు నెలల పాటు జరుగుతుందన్నారు. తిరుమల తిరుపతి దేవస్థానం నుంచి లక్షరూపాయి నాణేలు తీసుకొచ్చామని, గ్రామాల్లో ప్రజలకు ఆ నాణేలు పంపిణీ చేస్తామన్నారు. వాటితోపాటు పుస్తక ప్రసాదం, కంకణాలు అందజేస్తామన్నారు. ఈ రూపాయి నాణేలు ముడుపులు కట్టిన భక్తులు 2018 ఫిబ్రవరి 4వ తేదీన తిరుమలకు చేరుకుంటారని, అక్కడ లక్ష మందితో విష్ణుసహస్ర నామ గళార్చన చేసి వేంకటేశ్వర స్వామిని సందర్శించుకుంటారని తెలిపారు.

సంపూర్ణ గ్రామ దేవాలయ సందర్శన రథయాత్రను డక్కిలి మండలంలోని స్తంభాలగిరి ఈశ్వరయ్య దేవస్థానం నుంచి ఉదయం 9గంటలకు ప్రారంభిస్తామని కమలానంద భారతి తెలిపారు. ప్రారంభోత్సవ కార్యక్రమానికి వివిధ ఆశ్రమాలు, మఠాల స్వాములు, ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొంటారని చెప్పారు. అలాగే, వినాయక చవితి వేడుకల్లో చవితి వేడుకల్లో మద్యం, రికార్డు డ్యాన్సులుకు దూరంగా ఉండాలని ఆయన పిలుపునిచ్చారు. గణేశ్ ఉత్సవాలను హిందూ సంప్రదాయాల విలువలు పెంచేలా నిర్వహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ముప్పిరాల సుబ్రహ్మణ్యం, రమేష్, ఏబీవీపీ నాయకులు పాల్గొన్నారు.

హాజరుకానున్న మన్మోహన్‌సింగ్

నెల్లూరు(కలెక్టరేట్): రెవెన్యూ శాఖ రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి డాక్టర్ మన్మోహన్ సింగ్ బుధవారం 9 గంటలకు డక్కిలి మండలంలోని దేవుని వెల్లంపల్లిలో ఉన్న శ్రీశ్రీ స్తంభాల గిరి ఈశ్వరయ్య ఆలయంలో వెయ్యి గ్రామాల రథయాత్రను ప్రారంభిస్తారని డీపీఆర్వో మనోరంజన్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అనంతరం నెల్లూరులో ఏర్పాటు చేసిన కార్యక్రమాలలో పాల్గొంటారన్నారు.

18 నుంచి వెంకయ్య స్వామి ఆరాధనోత్సవాలు

నెల్లూరు (సాంస్కృతికం) : గొలగమూడి వెంకయ్యస్వామి 35వ ఆరాధన మహోత్సవాలు ఈ నెల 18 నుంచి 25వ తేదీ వరకు గొలగమూడిలో జరగనున్నాయి. తొలిరోజు ఉదయం సర్వభూపాల వాహనసేవ, రాత్రి కల్పవృక్ష వాహనసేవ, 19వ తేదీ ఉదయం హనుమంత సేవ, రాత్రి చంద్రప్రభ వాహనసేవ, 20వ తేదీ ఉదయం చిన్న శేష వాహన సేవ, రాత్రి హంసవాహన సేవ, 21వ తేదీ ఉదయం సూర్యప్రభ వాహనసేవ, రాత్రి గజవాహనసేవ, 22వ తేదీ పెద్ద శేషవాహనసేవ, 23వ తేదీ ఉదయం సింహ వాహనసేవ, రాత్రి గరుడ సేవ జరగనున్నాయి. 24న ఆరాధన మహోత్సవం, రథోత్సవం, రాత్రి తెప్పోత్సవం జరుగుతాయని, ప్రతి రోజూ సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని, గజవాహన సేవ ఉభయదాత డీవీ నాయుడు ఓ ప్రకటనలో కోరారు.

ఆర్టీసీ బస్సు సర్వీసు పునరుద్ధరణ

అనంతసాగరం: వరికుంటపాడు గ్రామానికి ఆత్మకూరు ఆర్టీసీ డిపో నుంచి నూతన బస్సుసర్వీసును ప్రారంభించడంపై స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఆత్మకూరు డిపో నుంచి ఉదయం, సాయంత్రం వేళల్లో ఈ సర్వీసు వరికుంటపాడుకు నడుపుతున్నారు. ఎనిమిదేళ్ల తర్వాత బస్సు సర్వీసును పునరుద్ధరించడంతో గ్రామ ఉపసర్పంచ్ బి.యల్లమ్మ, స్థానికులు ఎమ్మెల్యే మేకపాటి గౌతమ్‌రెడ్డికి, మండల ఉపాధ్యక్షుడు రాపూరు వెంకటసుబ్బారెడ్డికి, ఆర్టీసీ అధికారులకు ధన్యవాదాలు తెలిపారు.

• ఇంటర్వ్యూ



మెరుగైన విద్య అందించడమే లక్ష్యం

నరసింహులు, హెచ్‌ఎం
హిందూ ప్రాథమిక పాఠశాల

?. పాఠశాలలోని విద్యార్థులకు ఎలాంటి వసతులు కల్పిస్తున్నారు?

!. పాఠశాలలో కేవలం మూడు గదు లు మాత్రమే ఉన్నాయి. విద్యార్థులకు అసౌకర్యంగా ఉండడంతో సమస్యను విద్యాశాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లాం. స్థానిక ఉర్దూ పాఠశాలలో గదులు కేటాయించడంతో సమస్య కొంత పరిష్కారమైంది.

?. దాతల సహకారం అందుతోందా

!. దాతల సహకారంతో బెంచీలు, గదులకు గ్రిల్స్, నోటుపుస్తకాలు, యూనిఫాం అందచేసేవిధంగా చర్యలు తీసుకుంటున్నాం.

?. ముగ్గురు ఉపాధ్యాయులతో అన్ని తరగతులకు విద్యాబోధన ఎలా చేస్తున్నారు?

!. ముగ్గురు ఉపాధ్యాయులు పని చేస్తున్నాం. సొంత నిధులతో మరో ముగ్గురు వలంటీర్లను ఏర్పాటు చేసుకున్నాం. సమస్యను గుర్తించిన అధికారులు డిప్యుటేషన్‌పై మరో ముగ్గురు ఉపాధ్యాయులను నియమించారు. చిన్నారులకు ఇంగ్లీషు బోధనపై ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం.

- అనంతసాగరం

ఉప్పు నీరే దిక్కు!

● వసతి గృహాల్లో పనిచేయని నీటి శుద్ధి యంత్రాలు ● అవస్థల్లో విద్యార్థులు



బాలికల వసతిగృహంలో నిరుపయోగంగా నీటి శుద్ధి యంత్రం

మర్రిపాడు: వసతి గృహాల్లోని విద్యార్థుల ఆరోగ్యపరిరక్షణలో భాగంగా సురక్షితమైన తాగునీటిని అందించాలన్న లక్ష్యంతో ఏర్పాటు చేసిన నీటిశుద్ధి యంత్రాలు హాస్టల్ సిబ్బంది అవగాహనలోపం, అధికారుల నిర్లక్ష్యం కారణంగా నిరుపయోగంగా మారాయి. మరమ్మతులకు గుర్తైనా పట్టించుకునేవారు లేకపోవడంతో విద్యార్థులకు బోర్లనుంచి వస్తున్న ఉప్పునీరే దిక్కయింది.

మర్రిపాడు మండలంలో ఫ్లోరైడ్ సమస్యను గుర్తించిన ప్రభుత్వం ఐదేళ్ల క్రితం స్థానిక బాలుర, బాలికల వసతిగృహాల్లో ఒక్కోదానికి రూ.30 వేలు వెచ్చించి నీటి శుద్ధి యంత్రాలను ఏర్పాటు చేసింది. వాటి నిర్వహణపై సిబ్బందికి అవగాహన లేకపోవడంతో కొన్ని రోజులకే చెడిపోయాయి. మరమ్మతులకు నోచుకోకపోవడంతో నిరుపయోగంగా మారాయి. ఏళ్ల తరబడి వినియోగంలో లేకపోవడంతో, ప్రస్తుతం వాటికి మరమ్మతులు చేయడం కూడా కష్టమేనని ఆయా వసతిగృహాల వార్డెన్లు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. విద్యార్థుల సంక్షేమాన్నిర దృష్టిలో వుంచుకుని ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నా ఉన్నతాధికారుల నిర్లక్ష్యం కారణంగా అవి విఫలమవుతున్నాయని విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి నీటిశుద్ధి యంత్రాలను వినియోగంలోకి తేవాలని పలువురు కోరుతున్నారు.

నీటిని కొనుగోలు చేస్తున్నాం



నీటిశుద్ధి యంత్రాలు నిరుపయోగంగా మారడం వాస్తవమే. విద్యార్థులకు మినరల్ వాటర్ కొనుగోలు చేసి అందిస్తున్నాం. ఈ సమస్యను ఉన్నతాధికారులకు తెలియచేశాం.

- అంకయ్య, వార్డెన్, బాలుర వసతిగృహం

అధికారుల నిర్లక్ష్యం



ఉన్నతాధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. తాగునీటి విషయంలోనే కాదు.మౌలిక వసతులను కల్పించడంలో కూడా అశ్రద్ధ చూపుతున్నట్లు తెలుస్తోంది.

- వెంగయ్య, రైతుసంఘం నాయకుడు

జాగ్రత్తలు తప్పనిసరి



తాగునీటి విషయంలో జాగ్రత్తలు తప్పనిసరిగా పాటించాలి. కలుషిత నీటితో అనారోగ్యంతో పాటు, భవిష్యత్తులో కూడా ఇబ్బందులు పడాల్సి వస్తుంది.

- వెంకటకిషోర్, వైద్యాధికారి

చర్యలు తీసుకుంటాం



వసతి గృహాలను సందర్శించి చర్యలు తీసుకుంటాం. నీటి శుద్ధి యంత్రాలను పరిశీలించి ఉన్నతాధికారులకు తెలియజేస్తాం. ఇంతవరకు ఆ సమస్య మా దృష్టికి రాలేదు.

- రమేష్‌మోహన్‌బాబు, ఎంపీడీవో

పల్స్ సర్వే ఆధారంగా పీఎంఏవై లబ్ధిదారుల ఎంపిక

సంగం: గ్రామ సభలు నిర్వహించి ప్రధానమంత్రి అవాస్ యోజన పథకం లబ్ధిదారులను ఎంపిక చేస్తున్నట్లు ఎంపీడీవో షఫీఖాన్ తెలిపారు. మంగళవారం ఆయన నీలాయపాళెంలో గ్రామసభలో పాల్గొన్నారు. సర్పంచ్ ఒట్టిగుంట రాజానాయుడు అధ్యక్షతన జరిగిన గ్రామసభలో ఎంపీడీవో షఫీఖాన్ మాట్లాడుతూ పల్స్‌సర్వే ఆధారంగా లబ్ధిదారులను ఎంపిక చేసి నివేదిక అందజేస్తామన్నారు. ఎంపికైన వారికి పక్కా భవనం నిర్మాణానికి రూ. 2 లక్షలు మంజూరు అవుతుందన్నారు. నీలాయపాళెంలో పల్స్‌సర్వే ప్రకారం 13 మంది అర్హులు ఉన్నారన్నారు. ఈ గ్రామసభలో పంచాయతీ కార్యదర్శి మల్లికార్జురావు, వీఆర్‌వో పుల్లయ్య, హౌసింగ్ వర్క్ ఇన్‌స్పెక్టర్ తదితరులు పాల్గొన్నారు.



గ్రామసభలో మాట్లాడుతున్న ఎంపీడీవో షఫీఖాన్

జ్ఞానేంద్రియాలపై విజ్ఞాన ప్రదర్శన



వైజ్ఞానిక ప్రదర్శనకు హాజరైన విద్యార్థులు

ఆత్మకూరు: సంచార విజ్ఞాన ప్రదర్శన విద్యార్థులకు ఎంతో ఉపయుక్తమని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వాసు, తిరుపతి ప్రాంతీయ విజ్ఞాన కేంద్రం కో-ఆర్డినేటర్ ఎన్.మధు తెలిపారు. ఆత్మకూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ప్రాంతీయ విజ్ఞాన కేంద్రం నుంచి వచ్చిన విజ్ఞానరథం ద్వారా విజ్ఞానశాస్త్రంపై అవగాహన కల్పించారు. మంగళవారం నిర్వహించిన మన జ్ఞానేంద్రియాలు అనే అంశంపై ప్రదర్శన విద్యార్థులను ఆకట్టుకుంది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నాలుగు రోజులుగా ఆత్మకూరు ప్రభుత్వ పాఠశాల ఆవరణలో నిర్వహించిన విజ్ఞానప్రదర్శనను ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు సందర్శించారన్నారు. ఈ కార్యక్రమంలో ప్రాంతీయ విజ్ఞానకేంద్రం తిరుపతి టీమ్ సభ్యులు పవన్‌కుమార్, జి.యోగానందం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సుస్థిర అభివృద్ధి లక్ష్యాలపై అవగాహన

ఏఎస్‌పేట: స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం పీపుల్స్ మానిటరింగ్ కమిటీ, సీఆర్‌ఎస్‌డీ, ఏపీ బడ్జెట్‌వారి సహకారంతో సుస్థిర అభివృద్ధి లక్ష్యాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఐక్యరాజ్యసమితి 2015లో విడుదల చేసిన 17 లక్ష్యాలను సాధించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. అందులో పేదరిక నిర్మూలన, అందరికీ విద్య, స్త్రీ-పురుష సమానత్వం, ఆరోగ్యం, సుస్థిర వ్యవసాయం, పౌష్టికాహారం, పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరు కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం సుస్థిర అభివృద్ధి లక్ష్యాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ ప్రసన్న, ఏపీవో శిరీష, పీఎంసీ జిల్లా కన్వీనర్ ఎస్.పెంచలనరసయ్య, పీయుఎస్ సెక్రటరీ కొండయ్య, తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న
పీఎంసీ జిల్లా కన్వీనర్ పెంచలనరసయ్య

పాఠశాలల్లో నీటి సమస్య పరిష్కారానికి చర్యలు

చేజర్ల: మండలంలోని పాఠశాలల్లో నీటి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటు న్నట్లు ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ శ్రీనివాసరావు తెలిపారు. మంగళవారం మండలంలోని పలు పాఠశాలలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పలు పాఠశాలల్లో నీటి సమస్య గుర్తించామన్నారు. పక్కా ప్రణాళికతో నీటి సమస్య లేకుండా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ హజ రత్, విద్యాశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

వీఆర్‌ఏ మృతి

చేజర్ల: చేజర్ల గ్రామ రెవెన్యూ సహాయకుడు(వీఆర్‌ఏ) మాతంగి పెంచలయ్య అనారోగ్యం కారణంగా మంగళవారం మృతి చెందాడు. ప్రభుత్వం తరపున డిప్యూటీ తహసీల్దారు శ్రీరామకృష్ణ మంగళవారం ఆయన కుటుంబానికి రూ.10 వేల ఆర్థిక సహాయం అందచేశారు.పెంచలయ్య మృతికి సంతాపం వ్యక్తం చేశారు.

11న లక్ష కుంకుమార్చన

సంగం: మండలం కేంద్రంలోని కామాక్షీదేవి సమేత సంగమేశ్వర స్వామి ఆలయంలో శ్రావణమాస మూడవ శుక్రవారం సందర్భంగా బ్రహ్మశ్రీ కనుమళ్ళ సత్యనారాయణశర్మ ఆధ్వర్యంలో లక్ష కుంకుమార్చన నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా ఆలయంలో స్వామి, అమ్మవారికి అభిషేకాలు, చందనాలంకారం, పూలంగి సేవలు నిర్వహిస్తామని తెలిపారు. మధ్యాహ్నం అన్నదానం ఉంటుందన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని వారు కోరారు.

అర్ధాంతరంగా ఆగిన శ్మశాన వాటిక పనులు



కొరిమెర్ల శ్మశాన వాటిక

సంగం: బిల్లుల మంజూరులో జాప్యం కారణంగా కొరిమెర్ల శ్మశానవాటిక అభివృద్ధి పనులు అర్ధాంతరంగా నిలిచిపోయాయి. ఉపాధి హామీ పథకం కింద కొరిమెర్ల శ్మశానవాటిక అభివృద్ధికి రూ. 10 లక్షలు నిధులు మంజూరు కావడంతో ఏడు నెలల కిందట పనులు ప్రారంభించారు. చుట్టూ ప్రహరీ నిర్మించారు. బోరు వేశారు. ముఖద్వారం, కర్మలకు అరుగు, ఒక గది నిర్మించాలి. ఆరు లక్షల రూపాయల పనులు చేసినా బిల్లులు మంజూరు కాకపోవడంతో ఏడు నెలల క్రితం కాంట్రాక్టర్ పనులు నిలిపేశారు. దీంతో ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి బిల్లులు మంజూరు చేసి, పనులు పూర్తి చేయాలని కోరుతున్నారు.

అడుగంటిన బావి

సంగం: పెరమన పంచాయతీ గొల్లపాళెంలో పురాతన బావి నీళ్లలేక అడుగంటింది. గొల్లపాళెంలో సుమారు 28 కుటుంబాలున్నాయి. గతంలో గొల్లపాళెం గ్రామస్థులు ఈ బావి నీటినే వాడేవారు. ఇటీవల గ్రామంలో పైపులైన్లు వేసిన తరువాత బావి నీటిని వాడడం మానేశారు. కరెంట్ ఉంటేనే నీళ్లు వస్తుండడంతో, నీరు రాని రోజుల్లో ఈ బావి ద్వారా నీటి అవసరాలు తీర్చుకునేవారు. ఇటీవల బావిలో చుక్కనీరు లేకుండా ఎండిపోవడంతో కరెంటు లేనప్పుడు గ్రామ ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

చుక్కల భూములకు మోక్షం!



- ప్రభుత్వ నిర్ణయంతో రైతుల్లో హర్షం
- సమస్య పరిష్కారానికి ప్రత్యేక కమిటీల ఏర్పాటు


అనంతసాగరం: చుక్కల భూముల సమస్య పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై రైతుల్లో హర్షం వ్యక్తం అవుతోంది.

జిల్లాలోని దాదాపు అన్ని మండలాల్లో చుక్కల భూముల సమస్య ఉంది. ఆయా మండలాల డైగ్లాట్‌లలో కొన్ని భూములను చుక్కలతో సూచించగా, వాటిని సాగు చేస్తున్న రైతులు తమ పొలాలను 1బి, 10 వన్ రిజిస్టర్లలో తమ పేర్లు నమోదు చేయించుకున్నారు. గతంలో ఈ చుక్కల భూముల క్రయవిక్రయాలు ఎలాంటి ఆటంకం లేకుండా జరిగేవి. రిజిస్ట్రేషన్లు కూడా అయ్యేవి. చుక్కల భూములకు సంబంధించి రెవెన్యూ రికార్డుల్లో సర్వే నెంబర్లు మాత్రమే వుండేవి. వాటిని సాగు చేస్తున్న రైతుల వివరాలు ఉండేవి కాదు. కొంత కాలం క్రితం ఇలాంటి భూముల రిజిస్ట్రేషన్లను ప్రభుత్వం నిలిపివేసింది. దీంతో ఆయా భూములకు చెందిన రైతుల్లో రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన వ్యక్తమైంది. ఈ నేపథ్యంలో సమస్యను పరిష్కరించేందుకు ప్రభుత్వం ముందుకు వచ్చింది. జీవో నెం 298 ప్రకారం ఆర్‌ఎస్‌ఆర్‌లో చుక్కల భూములున్న రైతుల పేర్లు నమోదు చేసి రెగ్యులరైజ్ చేసేందుకు చర్యలు తీసుకుంది.ఈ ఏడాది సెప్టెంబర్ 10వ తేదీ వరకు చుక్కభూములపై ప్రత్యేక కార్యక్రమం చేపట్టింది. ప్రభుత్వ ఆదేశాల మేరకు రెవెన్యూ అధికారులు చుక్క భూముల వివరాల సేకరణలో నిమగ్నమైనట్లు తెలుస్తోంది.

ప్రత్యేక కమిటీ ఏర్పాటు

చుక్కల భూముల సమస్య పరిష్కారానికి సంబంధించి ప్రభుత్వం ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేస్తుంది. కమిటీలో జిల్లా అధికారులతోపాటు ఆర్‌డీవో, తహసీల్దార్లు సభ్యులుగా ఉంటారు. వారు ఏఏ గ్రామాల్లో చుక్కలభూములు ఉన్నాయో గుర్తించి, ఆయా భూములను పరిశీలిస్తారు. గ్రామసభలు నిర్వమించి అభ్యంతరాలు ఉంటే పరిస్థితి రైతులకు నోటీసులు అందచేస్తారు. సమస్యలు ఏమీ లేకుంటే ఆర్‌ఎస్‌ఆర్‌లో చుక్కలు తీసివేసి రైతుల పేర్లు పొందిపరిచేలా చర్యలు తీసుకోనున్నారు


ప్రభుత్వ నిర్ణయంతో ఊరట



చాలాకాలంగా ఉన్న సమస్యను ప్రభుత్వం పరిష్కరించేదిశగా చర్యలు తీసుకోవడం సంతోషంగా ఉంది. ఈ కార్యక్రమంతో చుక్కలభూముల రైతులకు ఊరట లభిస్తుంది. దీనిపై రైతులకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలి.

– సురేష్, రైతు, ఎగువపల్లి

భూ సమస్యలకు పరిష్కారం



ప్రభుత్వం చేపట్టిన ఈ కార్యక్రమంతో సమస్యలు పరిష్కారమవుతాయి. ఆర్‌ఎస్‌ఆర్‌లో పేర్లు నమోదైతే భూసమస్యలు ఉండవు. రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు కూడా అవకాశం లభిస్తుంది.

– రమణయ్య, రైతు, గోగులపల్లి

నంద్యాలలో వైసీపీ గెలుపు ఖాయం!

- ఎమ్మెల్యే మేకపాటి గౌతమ్‌రెడ్డి

అనంతసాగరం: నంద్యాలలో జరుగుతున్న ఉప ఎన్నికల్లో వైసీపీ అభ్యర్థి భారీ మెజార్టీతో గెలుపొందడం ఖాయమని ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి గౌతమ్‌రెడ్డి తెలిపారు. మంగళవారం మండలంలోని కొత్తపల్లిలో దాత సూరా నరసింహారెడ్డి విద్యార్థులకు బ్యాగులు అందచేయగా ఎమ్మెల్యే చేతుల మీదుగా వాటిని పంపిణీ చేశారు. ఆయన తొలుత గ్రామంలో ఉన్న దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఉప ఎన్నికల ఫలితాలు వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో నాంది పలకనున్నాయన్నారు. వైసీపీకి రాష్ట్రంలో ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారన్నారు. వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి కావడం తథ్యమని పేర్కొన్నారు. అనారోగ్యంతో బాధపడుతున్న కొత్తపల్లి వైసీపీ నాయకులు చిలక సుబ్బరామిరెడ్డిని ఆయన పరామర్శించారు. ఆయన వెంట జడ్పీటీసీ సభ్యురాలు పెయ్యల సంపూర్ణమ్మ, వైసీపీ నాయకులు షేక్ షబ్బీర్, ఓబుల్‌రెడ్డి, దళపతి, తదితరులు ఉన్నారు.



విద్యార్థులకు బ్యాగులు అందచేస్తున్న ఎమ్మెల్యే

చోరీకి యత్నించిన యువకుడు పోలీసులకు అప్పగింత

చేజర్ల: మండలంలోని ఓబులాయపల్లి గ్రామంలో చోరీకి ప్రయత్నిస్తున్న ఓ వ్యక్తిని గ్రామస్థులు పట్టుకున్నారు. ఓబులాయపల్లిలో మంగళవారం తెల్లవారు జామున దాదాపు ఐదుగురు యువకులు ఓ ఇంట్లో చోరీకి యత్నించారు. ఈ విషయం గమనించిన స్థానికులు వారిని పటుకునేందుకు యత్నించారు. దాంతో వారు బైక్‌లపై పారిపోతూ, ఎదురుగా వస్తున్న 108 వాహనాన్ని చూసి, ఇద్దరు యువకులు ముళ్ళపొదల్లో దాక్కున్నారు. వారిని వెంబడిస్తున్న గ్రామస్థులు ముళ్ళపొదల్లో దాక్కున్న వారిని పట్టుకునేందుకు ప్రయత్నించగా ఒక యువకుడు పరారయ్యాడు. మరో యువకుడిని ఆదుపులోని తీసుకుని, చేజర్ల పోలీసులకు అప్పగించారు. నిందితుడు సంగంలో ఐటీఐ చదువుతున్న పవన్‌కుమార్ అని, త్వరలో మిగతావారిని కూడా పట్టుకుంటామని ఎస్‌ఐ బాచిరెడ్డి తెలిపారు.

బెల్టు షాపులు అరికట్టేందుకు కమిటీలు



ఎస్‌ఐ బాచిరెడ్డితో మాట్లాడుతున్న ఎక్సైజ్ ఎస్‌ఐ రమణ

చేజర్ల: గ్రామాల్లో బెల్టుషాపులు అరికట్టేందుకు ప్రత్యేక కమిటీలు ఏర్పాటు చేయనున్నట్లు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఎస్‌ఐ రమణ పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని పలు గ్రామాల్లో తనిఖీ చేశారు. అనంతరం చేజర్ల ఎస్‌ఐ బాచిరెడ్డితో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో బెల్టుషాపులను అరికట్టేందుకు ప్రజలకు అవగాహన కల్పిస్తూ ఎంపీపీ అధ్యక్షతన తహసీల్దారు, ఎంపీడీవోతో ఒక కమిటీ, గ్రామాల్లో ప్రత్యేక కమిటీలు ఏర్పాటు చేయనున్నట్లు తెలియజేశారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు బెల్టుషాపుల నిర్మూలనే లక్ష్యంగా పని చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా పోలేరమ్మ జాతర



చేజర్ల: చేజర్లలో మంగళవారం పోలేరమ్మ జాతరను భక్తులు అత్యంతవైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలు రకాల పుష్పాలతో అమ్మవారిని అలంకరించి ప్రత్యేక హోమాలు చేపట్టారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందచేశారు.

ఆంజనేయుడికి ఆకుపూజ



ఆత్మకూరు: పట్టణంలోని హనుమాన్ జంక్షన్‌లో వెలసిన అభయాంజనేయస్వామి ఆలయంలో మంగళవారం పత్రపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి ఉదయం పంచామృతాభిషేకం, సహస్రనామార్చన, అనంతరం ప్రత్యేక పూజలు చేశారు. అధికసంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు

ఎమ్మార్ వ్యాక్సినేషన్‌లో సరిహద్దు వివాదం

- మాది కాదంటే మాది కాదంటున్న వైద్యులు
- కుల్లూరు, కలువాయి పీహెచ్‌సీల మధ్య వివాదం
- ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు టీకా ప్రశ్నార్థకం

కలువాయి: అప్పుడప్పుడు పోలీసుశాఖలో సరిహద్దు వివాదాలు చూస్తుంటాం. కానీ పీహెచ్‌సీల నడుమ సరిహద్దు వివాదం నెలకొనడం విశేషం. మాది కాదంటే మాది కాంటూ ఓ పాఠశాల విద్యార్థులకు ఎమ్మార్ వ్యాక్సిన్ వేయకుండా వైద్య సిబ్బంది దోబూచులాడుతున్నారు. మండలంలో కలువాయి, కుల్లూరులో పీహెచ్‌సీలు ఉన్నాయి. ఈ రెండు పీహెచ్‌సీల సిబ్బంది మండల వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో వైద్య సేవలు అందించాల్సి ఉంది. మొదట కలువాయిలో పీహెచ్‌సీ ఉండగా, కుల్లూరులో డిస్పెన్సరీ ఉండేది. తదనంతరం దానిని పీహెచ్‌సీగా అప్‌గ్రేడ్ చేసిన సమయంలో కలువాయిలోని కొంత భాగం కుల్లూరు పీహెచ్‌సీ పరిధిలోని తోపుగుంట సబ్‌సెంటర్‌లో కలిపారు. కానీ కలువాయి బస్టాండు సమీపంలోని మెయిన్ ప్రాథమిక పాఠశాలను రెండు పీహెచ్‌సీల వారు కొంత కాలంగా పట్టించుకోకుండా వదిలేశారు. ఇది మా పరిధిలోనిది కాదని కలువాయి, అది కలువాయి పరిధేనని కుల్లూరు వైద్య సిబ్బంది ఇక్కడ వైద్యసేవలు అందించకుండా వదిలేశారు. రెండేళ్లుగా విద్యార్థులకు వైద్య పరీక్షలు ఎవరూ నిర్వహించడం లేదు. ఈ క్రమంలో ప్రభుత్వం ఈనెల 1వ తేదీ నుంచి ప్రతిష్టాత్మకంగా ఎమ్మార్ వ్యాక్సిన్ కార్యక్రమం చేపట్టింది. సుమారు 40 రోజుల పాటు జరిగే ఈ కార్యక్రమంలో అందుకు సంబంధించి ప్రణాళికలు సిద్ధం చేశారు. రెండు పీహెచ్‌సీల పరిధిలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో ఏ రోజు ఎమ్మార్ వ్యాక్సిన్ వేస్తారో ముందుగా ఎంఈవోకి వైద్య ఆరోగ్యశాఖ అధికారులు షెడ్యూలు ఇచ్చారు. అందులో కలువాయి మెయిన్ ప్రాథమిక పాఠశాల ఏ పీహెచ్‌సీ పరిధిలో లేకపోవడం ఆశ్చర్యం కలిగిస్తోంది. దీంతో ఈ పాఠశాల విద్యార్థులకు ఎవరు వ్యాక్సిన్ వేస్తారన్నది అంతుబట్టక సరిహద్దు వివాదం తెరపైకి వచ్చింది. ఆ పాఠశాల విషయమై వారిని ప్రశ్నిస్తే అది మా పరిధి కాందంటే మాది కాదంటున్నారు. దీనిపై ఉన్నతాధికారులు జోక్యం చేసుకొని తక్షణ చర్యలు చేపట్టి రెండు పీహెచ్‌సీల వివాదం పరిష్కరించి ఇక్కడ విద్యార్థులకు ఎమ్మార్ వ్యాక్సిన్ వేసేలా చూడాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

అది మా పరిధి కాదు

కలువాయి మెయిన్ ప్రాథమిక పాఠశాల మా పరిధిలో లేదు. కొంత కాలంగా అక్కడ వైద్యసేవలు కలువాయి పీహెచ్‌సీ వారు అందిస్తున్నారు. దాని చుట్టుపక్కల ప్రాంతం వారిదైనప్పుడు ఈ పాఠశాల ఎందుకు రాదు.

– డాక్టర్ ఓబుల్‌రాజ్, ఇన్‌చార్జి వైద్యాధికారి, కుల్లూరు

కుల్లూరు పీహెచ్‌సీ పరిధిలోకి వస్తుంది

కలువాయి మెయిన్ పాఠశాలకు పక్కనే ఉన్న జడ్పీ ఉన్నత పాఠశాల కుల్లూరు పరిధిలోకి వచ్చినప్పుడు ఈ పాఠశాల వారి పరిధిలో ఎందుకు లేదు. ఈ విషయం గతంలో జిల్లా ఉన్నాతాధికారుల దృష్టికి కూడా పోయింది. ఇక్కడ కొంత కాలంగా మేము ఎలాంటి వైద్యసేవలు అందించడం లేదు. అది కుల్లూరు పీహచ్‌సీ పరిధిలోకే వస్తుంది.

– డాక్టర్ ఆర్ రాకేష్, వైద్యాధికారి, కలువాయి

బ్యాంకు రుణాలతో ఆర్థిక ప్రగతి సాధించాలి

వింజమూరు: బ్యాంకుల నుంచి స్వయం సహాయ సంఘాలు రుణాలు తీసుకుని ఆర్థిక ప్రగతి సాధించాలని నాబార్డు ఏజీఎం రమేష్ తెలిపారు. మంగళవారం స్థానిక వీఆర్ ఫంక్షన్ ప్లాజాలో ఏర్పాటు చేసిన స్వయం సహాయక సంఘ సభ్యుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సహాయ సంఘాలు జాయింట్ లయబిలిటీ ద్వారా రుణాలు పొంది, సక్రమంగా ఉపయోగించుకుని ప్రగతి సాధించాలన్నారు. ఇంతకుముందు జిల్లాలోని రైతు గ్రూపులు రుణాలు తీసుకోవడం, తిరిగి చెల్లించడంలోనూ ముందుండేవన్నారు. ప్రస్తుతం కొందరు రుణాలు చెల్లించలేకపోతున్నారన్నారు.

6,000 మంది చిన్నారులకు ఎంఆర్ వ్యాక్సినేషన్

ఆత్మకూరు: ఎంఆర్ వ్యాక్సినేషన్ మొదలైన నాలుగు రోజుల్లో 6000మందికి పైగా చిన్నారులకు టీకాలు వేశామని మహిమలూరు పీహెచ్‌సీ ఆరోగ్యవిస్తరణాధికారి జావీద్ తెలిపారు. మంగళవారం కరటంపాడు, సాతానుపల్లి, వెన్నవాడ, బి.చిరువెళ్ళ, నారంపేట, ఆరవీడుజంగాలపల్లెల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు వ్యాక్సినేషన్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో 13,500 మంది విద్యార్థులను లక్ష్యంగా నిర్ణయించినట్లు తెలిపారు. మండలంలో మంగళవారం 914 మంది చిన్నారులకు వ్యాక్సిన్ వేయాల్సి ఉండగా 862 మందికి వేశామన్నారు. పిల్లలకు గతంలో ప్రైవేట్ ఆసుపత్రిల్లో మీజిల్స్, రూబెల్లా వ్యాక్సిన్ వేయించినా, ఎంఆర్ వ్యాక్సిన్ వేయించవచ్చని తెలిపారు. తల్లిదండ్రులు తమ సమీపంలో ఉన్న పాఠశాలలకు తమ పిల్లలను తీసుకెళ్లి వ్యాక్సిన్ శిబిరాల వద్ద ఎంఆర్ వ్యాక్సిన్ వేయించాలన్నారు. హెల్త్ అసిస్టెంట్ చిన్నప నాయుడు, కరటంపాడు ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మల్లికార్జునశర్మ, ఏఎన్‌ఎంలు భూదేవి, ధనమ్మ, అనురాధ, ఆశవర్కర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బంద్ జయప్రదం చేయండి

ఉదయగిరి రూరల్: విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం ఈనెల 10న చేపట్టే విద్యాసంస్థల బంద్‌ను జయప్రదం చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా నాయకుడు బి.నాగరాజు పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక పుచ్చపల్లి సుందరయ్య భవనంలో విద్యార్థి సంఘాల నాయకులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేజీ నుంచి పీజీ వరకు ఉచిత విద్యనందిస్తామని హామీ ఇచ్చిన ప్రభుత్వం దాని ఊసే ఎత్తడం లేదన్నారు.

నేడు గూడూరుకు సద్భావన యాత్ర

గూడూరు(టౌన్): రాజీవ్ సద్భావన యాత్ర బుధవారం గూడూరుకు చేరుతుందని డీసీసీ అధ్యక్షుడు పనబాక కృష్ణయ్య మంగళవారం తెలిపారు. ఈ సద్భావన యాత్ర మధ్యాహ్నం 3 గంటలకు స్థానిక టవర్‌క్లాక్ కేంద్రం వద్దకు చేరుకుంటుందన్నారు. ఈ యాత్రలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు ప్రజలకు చేసిన సేవా కార్యక్రమాలు, అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాల గురించి ఈ సద్భావన యాత్రలో తెలియజేస్తారన్నారు. దీంతో కాంగ్రెస్ పార్టీ నాయకుల, కార్యకర్తలు, అభిమానులు పెద్దసంఖ్యలో టవర్‌క్లాక్ కేంద్రానికి చేరుకుని సద్భావన యాత్రకు ఘనస్వాగతం పలకాలన్నారు.

ఆన్‌లైన్ మోసం

● బ్యాంకు ఖాతాలో సొమ్ము మాయం

కోట: ఆన్‌లైన్ మోసాలు యథేచ్ఛగా జరుగుతున్నాయి. ఏటీఎం డెడ్ అయిందని, ఆధార్, రేషన్, ఏటీఎం నెంబర్లు చెబితే సరి చేస్తామంటూ ఆన్‌లైన్‌లో అజ్ఞాత వ్యక్తులు ఫోన్ చేయడంతో పలువురు నెంబర్లు చెప్పి మోసపోతున్నారు. అలాంటి సంఘటన కోటలో వెలుగు చూసింది. బాధితుడి కథనం మేరకు.. మండలంలోని విద్యానగర్‌కు చెందిన నాగరాజు అనే యువకుడికి తన మొబైల్‌కు ఒక ఫోన్ వచ్చింది. ఫోన్ చేసిన వ్యక్తి మీ ఏటీఎం కార్డు డెడ్ అయిందని, దానితో లావాదేవీలు ఆగిపోతాయని చెబుతూ దీని వల్ల ఇబ్బందులు పడకుంబడా ఏటీఎం పిన్ నెంబర్, ఆధార్, రేషన్ కార్డు నెంబర్లు చెబితే 48 గంటల్లో అన్నీ సరిచేస్తామని చెప్పాడు. అది నమ్మిన నాగరాజు అన్ని వివరాలు ఫోన్‌లో చెప్పాడు. మరుసటి రోజు విద్యానగర్‌లోని స్టేట్‌బ్యాంక్‌లోకి వెళ్లి తన అకౌంట్‌లో ఉన్న నగదు పరిశీలించగా అందులో రూ. 16 వేలు డ్రా అయినట్లు ఉంది. బ్యాంక్ అధికారులను సంప్రదించగా ఆ ముందురోజే నగదు డ్రా అయ్యిందని చెప్పడంతో నాగరాజు పోలీసులను ఆశ్రయించి ఈ ఆన్‌లైన్ మోసంపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేశాడు. ఈ ఆన్‌లైన్ మోసాలు రెండు నెలల నుంచి జరుగుతున్నట్లు సమాచారం.

చంద్రన్న బీమాలో సహజ మరణానికి రూ.2 లక్షలు

● ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్



చంద్రన్న బీమా చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్

చిల్లకూరు: చంద్రన్న బీమా పథకంలో ఆగస్టు 15వ తేదీ నుంచి సహజంగా మరణించిన వారికి రూ.2 లక్షలు టీడీపీ ప్రభుత్వ అందజేస్తుందని ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ అన్నారు. మంగళవారం స్థానిక మండల కార్యాలయంలో మండలంలోని 15 మంది బాధితులకు రూ.8.92 లక్షలు చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలకు అండగా ఉండి వారిని ఆదుకునే ప్రభుత్వం టీడీపీ ప్రభుత్వమేనన్నారు. 15 రూపాయలు చెల్లించి చంద్రన్న బీమా పొందిన ఎందరో పేద ప్రజలకు చంద్రన్న బీమా భరోసాగా నిలిచిందన్నారు. సహజ మరణానికి ప్రస్తుతం రూ. 30 వేలు చెలిస్తుండగా ఈ నెల 15వ తేదీ నుంచి రూ. 2 లక్షలు అందజేస్తామన్నారు. కోట మండలంలో బీసీ గురుకుల పాఠశాలతోపాటు కళాశాల కూడా మంజూరైందన్నారు. చిల్లకూరు మండలం చింతవరం, గూడూరు మండలం చెన్నూరు గ్రామాలలో జూనియర్ కళాశాలలు మంజూరయ్యాయన్నారు. మంజూరుకు సహకరించిన అప్పటి బీసీ సంక్షేమశాఖ మంత్రి కొల్లు రవీంద్ర, మంత్రి అచ్చెన్ననాయుడులకు కృతజ్ఞతలు తెలిపారు.

ప్రజా సమస్యలు పరిష్కరించాలి

ప్రజా సమస్యలను అధికారులు వెంటనే పరిష్కరించాలని ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఆవరణంలో ప్రజా విజ్ఞప్తుల దినం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు వారి సమస్యలను పరిష్కరించుకునేందు తహసీల్దారు, మండల కార్యాలయాల చుట్టూ తిరిగే అవసరంలేదన్నారు. సమస్య వాస్తవమైతే అధికారుల సమక్షంలో పరిష్కరిస్తామన్నారు. నెలలో ఒక రోజు ప్రజా విజ్ఞప్తుల దినం నిర్వహిస్తామన్నారు. ఆర్డీవో అరుణ్‌బాబు మాట్లాడుతూ అధికారులు ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు వేగవంతంగా పరిష్కరించాలన్నారు. ప్రజలు అధికారుల దృష్టికి తీసుకువచ్చే సమస్యలను పరిష్కరించలేకపోతే ఎందుకు సమస్యను పరిష్కరించలేకపోతున్నారో అందుకు కారణం అర్జీలపై బాధితులకు అర్థమయ్యేలా రాసి ఇవ్వాలన్నారు. అనంతరం వారు అర్జీలను స్వీకరించి పలు సమస్యలను అక్కడకక్కడే పరిష్కరించారు. ఈ కార్యక్రమంలో పెంచలకోన ట్రస్టు బోర్డు చైర్మన్ తానంకి నానాజీ, ఎంపీపీ రమాదేవి, తహసీల్దార్ రమణయ్య, ఎంపీడీవో విజయేంద్రకుమార్, టీడీపీ నాయకులు పెనుబోలు జానకిరామిరెడ్డి, పారిచెర్ల శ్రీరామచంద్రయ్య, ఉచ్చూరు వెంకటేశ్వర్లురెడ్డి, నెల్లూరు రామ్మూర్తి, కనపర్తి దిలీప్‌రెడ్డి, బొల్లినేని కోటేశ్వరరావు. సరుపూరు సురేష్‌నాయుడు, చిట్టేటి నారాయణ, యనమల ప్రభాకర్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

● ఇంటర్వ్యూ



రిమాండ్ ఖైదీల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ

● వెంకటేశ్వరరావు, సబ్‌జైలు సూపరింటెండెంట్, గూడూరు

? మండల న్యాయ సేవాధికార సంస్థ అందిస్తున్న సేవలు ఏమిటి.

! ప్రతి శనివారం మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో సబ్‌జైలులో రిమాండ్ ఖైదీలకు కౌన్సెలింగ్ ఇవ్వడంతో పాటు న్యాయవాదిని ఏర్పాటు చేసుకోలేని వారికి న్యాయవాదిని ఏర్పాటు చేస్తూ, న్యాయ సలహాలు అందిస్తున్నాం. దీంతో సబ్‌జైలులో రిమాండ్ ఖైదీల సంఖ్య తగ్గుముఖం పట్టింది.

? ఖైదీల ఆరోగ్యం పట్ల తీసుకుంటున్న జాగ్రత్తలేవి.

! సబ్‌జైలులో వారానికి రెండు సార్లు ప్రభుత్వ వైద్యుల ఆధ్వర్యంలో ఖైదీలకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నాము. చికిత్సలు అవసరమైన వారిని అందుబాటులో ఉన్న అంబులెన్స్ ద్వారా వైద్యులు నిర్ణయించిన ఆసుపత్రిల్లో చికిత్స అందిస్తున్నాం.

? సబ్‌జైలు అభివృద్ధికి తీసుకుంటున్న చర్యలేమిటి.

! అస్తవ్యస్తంగ ఉన్న డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరిచాం. రిమాండ్ ఖైదీలకు అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలు కల్పించాం.

- గూడూరు

రైతులకు క్షేత్రస్థాయిలో అవగాన



రైతులకు అవగాహన కల్పిస్తున్న సంస్థ సభ్యులు

గూడూరు(రూరల్): మండలంలోని సచిన్ దత్తత గ్రామమైన పుట్టంరాజు కండ్రిగలో మంగళవారం నిమ్మ సాగుపై రైతులకు రిలయన్స్ ఫౌండేషన్, నెల్లూరు కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా షౌండేషన్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ యాకోబు, ఉద్యాన విభాగం శాస్త్రవేత్త నారాయణస్వామి మాట్లాడుతూ యాజమాన్య పద్ధతులను పాటించడం ద్వారా నిమ్మ సాగులో వచ్చే చీడ, పీడలు తగ్గించుకోవచ్చన్నారు. ప్రధానంగా సేంద్రియ ఎరువులు, కషాయాలు వినియోగించడం వలన పెట్టుబడులు తగ్గడంతో పాటు అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో పార్థసారధి, వెంకటరమణ, బుజ్జా నాగేశ్వరరావు పాల్గొన్నారు.

అభివృద్ధి కోసమైతే రాజీనామా చేసి గెలవాలి



మాట్లాడుతున్న వైసీపీ నాయకులు

గూడూరు(టౌన్): ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ నియోజకవర్గ అభివృద్ధి కోసమే పార్టీ మారితే ఆ పదవికి రాజీనామా చేసి ఉప ఎన్నికలో పోటీ చేసి గెలవాలని వైసీపీ జిల్లా అధికార ప్రతినిధి నాశిన నాగులు అన్నారు. మంగళవారం స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథిగృహంలో విలేఖరులతో ఆయన మాట్లాడుతూ నంద్యాల ఉప ఎన్నిక సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం రూ.1600 కోట్లతో అభివృద్ధి పనులు చేస్తుందని, గూడూరు అభివృద్ధి కాంక్షిస్తే రాజీనామా చేసి ఉప ఎన్నిక వస్తే నంద్యాల తరహాలో గూడూరులో కూడా కోట్లాది రూపాయలతో అభివృద్ధి పనులు జరుగుతాయన్నారు. దీంతో చరిత్రలో అభివృద్ధి చేసిన ఎమ్మెల్యేగా నిలిచిపోవచ్చన్నారు. రాష్ట్రంలో పార్టీ ఫిరాయింపులు సీఎం చంద్రబాబునాయుడుకు తప్పు కాదని, తెలంగాణలో అయితే తీవ్రమైన ద్రోహంగా మాట్లాడటం సమంజసం కాదన్నారు. ఈ కార్యక్రమంలో రాజారెడ్డి, రాధారెడ్డి, బొమ్మిడి శ్రీనివాసులు, చోళవరం గిరిబాబు, పెంచలరెడ్డి, నారాయణరెడ్డి, ఉదయ్‌కుమార్, విద్యాసాగర్ పాల్గొన్నారు.

'ఆనందలహరి'తో ఒత్తిడి లేని విద్య

చిల్లకూరు: ఆనందలహరి అభ్యసన కార్యక్రమం ద్వారా విద్యార్థులు ఒత్తిడి లేని విద్యను అభ్యసించవచ్చునని ఎంపీపీ వీరుబోయిన రమాదేవి అన్నారు. మంగళవారం మండలంలోని నల్లయగారిపాళెం ప్రాథమిక పాఠశాలలో ఆనందలహరి కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆనందలహరి అభ్యసన ద్వారా విద్యార్థుల ఆనందంగా ఆహ్లాదంగా విద్యను నేర్చుకోవచ్చునన్నారు విద్యార్థులలో సంపూర్ణ వికాసానికి ఈ అభ్యసన దోహదపడుతుందన్నారు. 1, 2 తరగతులలోని విద్యార్థుల సామర్థ్యాల ఆధారంగా బోధన ఉంటుందన్నారు. వ్యక్తిగతంగా విద్యార్థి సామర్థ్యాన్ని మెరుగుపరుచుకోవచ్చునన్నారు. ట్యాబ్ ఆధారంగా కూడా విద్యా బోధన జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం నాగేశ్వరరావు, పిచ్చయ్యానాయుడు, కృష్ణారెడ్డి, శ్రీనివాసులు, సుజాత తదితరులు పాల్గొన్నారు



మాట్లాడుతున్న ఎంపీపీ వీరుబోయిన రమాదేవి

ఎస్సీ వర్గీకరణే ధ్యేయంగా పోరాడుతాం



కురుక్షేత్ర గోడపత్రిక ఆవిష్కరిస్తున్న ఎంఎస్‌ఎఫ్ నాయకులు

గూడూరు(టౌన్): ఎస్సీ వర్గీకరణే ధ్యేయంగా మాదిగ స్టూడెంట్స్ ఫెడరేషన్ పాటుపడుతుందని ఎంఎస్‌ఎఫ్ నాయకులు సిసింద్రీ అన్నారు. మంగళవారం స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో చలో అమరావతి కురుక్షేత్ర సభ పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు జూలై 24 నుంచి అనేక నిరసన కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. ఈ క్రమంలో ఆగస్టు 9న కలెక్టరేట్‌ల ముట్టడి, ఆగస్టు 11న విద్యాసంస్థల బంద్‌కు పిలుపునిచ్చినట్లు తెలిపారు. అదే విధంగా ఈ నెల 14న రాష్ట్ర రాజధాని అమరావతిలో కురుక్షేత్ర మహాసభ నిర్వహిస్తున్నామన్నారు. ఈ నిరసన కార్యక్రమాలను జయప్రదం చేసేందుకు విద్యార్థులు పెద్దసంఖ్యలో మద్దతు తెలపాలన్నారు. ఈ కార్యక్రమంలో వెంకటేష్, మణి తదితరులు పాల్గొన్నారు.

సినిమా గైడ్

గూడూరు

శ్రీనివాస్ తేజ:	నక్షత్రం
సుందరమహల్:	దర్శకుడు
సీవీ :	ఫిదా
సంగం:	గౌతమనంద

కోట

ఆర్‌ఆర్‌టి :	ఫిదా
రామ్‌రాజ్:	ఏజెంట్ భైరవ
అరుణ:	గౌతమనంద

రెండు లారీల ఢీ

● ఒకరికి గాయాలు

చిల్లకూరు: మండలంలోని పారిచెర్లపాళెం గ్రామ సమీపంలో మంగళవారం రెండు లారీలు ఢీకొని ఒకరికి గాయలయ్యాయి. స్థానికుల కథనం మేరకు.. అనంతపురం జిల్లా తాడిపత్రి గ్రామానికి చెందిన లారీ డ్రైవర్ సాయినాథ్‌రెడ్డి లారీతో చింతవరం వైపు వెళుతుండగా అదే సమయంలో చిల్లకూరు వైపు వస్తున్న మరో లారీ ఎదుగా వచ్చి ఢీకొంది దీంతో లారీ డ్రైవర్ సాయినాథ్‌రెడ్డికి గాయాలయ్యాయి. గాయపడిన డ్రైవర్‌ను 108 సిబ్బంది గూడూరు ఏరియా ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. ఈ ప్రంతంలో ఉన్న మలుపులతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి.

సద్భావన యాత్రకు తరలిరండి

కోట: తమిళనాడు నుంచే బయలుదేరిన సద్భావన యాత్ర ఈ నెల 9వ తేదీ న జాతీయ రహదారిపై కోట క్రాస్ రోడ్డుకు చేరుకుంటుందని, మండల ప్రజలకు తరలి రావాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు దువ్వూరు శ్రీనివాసులురెడ్డి పిలుపునిచ్చారు. కోటలో మంగళవారం ఆయన విలేఖరులతో మాట్లాడుతూ రాజీవ్ గాంధీ మరణించిన తమిళనాడులోని శ్రీపెరుంబుదూర్ నుంచి ఈ సద్భావన యాత్ర ప్రారంభమైందన్నారు. అక్కడి నుంచి నేరుగా కోట హైవే క్రాస్ రోడ్డుకు చేరుకుంటుందన్నారు. డీసీసీ అధ్యక్షుడు పనబాక కృష్ణయ్య ఆధ్వర్యంలో జరిగే ఈ సద్భావన యాత్ర గూడూరు మీదుగా నెల్లూరుకు చేరుకొని ఢిల్లీ వెళుతుందన్నారు. 2019 ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని ఈ యాత్ర కొనసాగుతుందన్నారు. ఈ యాత్రకు ఆల్‌ఇండియా కాంగ్రెస్ పార్టీ జాతీయ నాయకులు హాజరవుతారన్నారు. ఆయన వెంట యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు మీజూరు మల్లికార్జున్, మండల అధికార ప్రతినిధి పాల మల్లికార్జున్, బీసీ సెల్ అధ్యక్షుడు పురిణి మురళి తదితరులు ఉన్నారు.


మాట్లాడుతున్న దువ్వూరు శ్రీనివాసులురెడ్డి

భూ సమస్యలపై నివేదిక ఇవ్వండి


అధికారులతో సమీక్షిస్తున్న ఆర్డీవో అరుణ్‌బాబు

గూడూరు: డివిజన్ పరిధిలో భూ సమస్యలపై అధికారులు నివేదికలు అందజేయాలని ఆర్డీవో అరుణ్‌బాబు అన్నారు. మంగళవారం స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయంలో సైదాపురం, చిట్టమూరు, బాలాయపల్లి, వెంకటగిరి మండలాల రెవెన్యూ, ఆటవీశాఖ, గిరిజనాభివృద్ధి సంస్థ అధికారులతో ఆర్డీవో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలాల్లోని ప్రభుత్వ, ఆటవీ భూములను గుర్తించి సరిహద్దుల వివాదాలు తలెత్తకుండా నివేదికలు అందజేస్తే కలెక్టర్‌కు అందజేస్తామన్నారు. అదేవిధంగా భూరికార్డుల తప్పులను సవరించే పనిని వేగవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థులకు యూనిఫాం అందజేత

గూడూరు: డ్రీమ్ ఇండియా ఫౌండేషన్ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక సంస్థ కార్యాలయంలో 60 మంది విద్యార్థులకు యూనిఫాం అందజేసినట్లు ఆ సంస్థ నిర్వాహకుడు బొమ్మిరెడ్డి సురేంద్రరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒకటో తరగతి నుంచి పదో తరగతి వరకు ప్రతి ఏడాది ప్రతిభ ఆధారంగా పేద విద్యార్థులను గుర్తించి వారిని పట్టణంలోని ప్రైవేటు, కార్పొరేట్ విద్యాసంస్థలలో చదివిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో దశరథరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



యూనిఫాం అందజేస్తున్న నిర్వాహకులు

అన్నింటికీ 'ఆధార్'

● బ్యాంకు ఖాతాలతో అనుసంధానం
● ప్రతి పథకానికి తప్పనిసరి


పల్స్ సర్వేలో ఆధార్ అనుసంధానం చేస్తున్న తహసీల్దారు లావణ్య (ఫైల్)

వాకాడు: ఆధార్ అనేది పన్నెండు అంకెల వ్యక్తిగత గుర్తింపు కార్డు. దీనిని భారత విశిష్ట గుర్తింపు ప్రాధికార సంస్థ జారీ చేస్తోంది. మనిషి యొక్క వ్యక్తి గత చిరునామాకు దేశంలో ఎక్కడైనా ఈ సంఖ్య ఆధారంగా పని కొస్తోంది. ప్రభుత్వం నుంచి ఏ చిన్నపాటి లబ్ధి పొందాలన్నా, బ్యాంకుల్లో లావాదేవీలు చేసుకోవాలన్నా ఆధారే ముఖ్యం. ఒక్క మాటలో చెప్పాలంటే ప్రస్తుతం ఆధార్ కార్డు లేనిదే ఏపని చేయలేం. ప్రభుత్వ పథకాలలో అవినీతిని అరికట్టేందుకు, విద్యార్థుల ఉపకార వేతనాలు, ఉపాధిహామీ పథకం వంటి వాటిని ప్రజలకు అందించేందుకు ప్రభుత్వం ఆధార్‌ను అనుసంధానం చేసింది. దీని వల్ల ప్రయోజనాలు నేరుగా లబ్ధిదారుడికే చేరేందుకు వీలు కలుగుతుందనేది ప్రభుత్వ భావన. ప్రస్తుత పరిస్థితులలో ఆధార్‌ను అనుసంధానం చేయకపోతే ప్రభుత్వపరంగా వస్తున్న సదుపాయాలను కోల్పోవాల్సి వస్తోంది. ఆధార్‌తో లబ్ధిదారుడికి అన్ని సంక్షేమ పథకాల చెల్లింపులను నేరుగా బ్యాంకు ఖాతాకు బదిలీ చేయడానికి, ఎప్పుడైనా, ఎక్కడైనా బ్యాంకింగ్ కార్యకలాపాలు నిర్వహించుకునేందుకు వీలుంటుంది. అదేవిధంగా ఆధార్ ప్రభుత్వ ప్రైవేటు సంస్థల మధ్య నమ్మకాన్ని పెంపొందించుకునేందుకు ప్రయత్నిస్తోంది. దీంతో గుర్తింపు కార్డు లేదన్న కారణంతో ప్రజలకు తమ సేవలను తిరస్కరించనవసరం లేదు. బ్యాంకు అకౌంట్, పాస్‌పోర్టు, డ్రైవింగ్ లైసెన్స్, ఓటర్ ఐడీ, పల్స్ సర్వే లాంటి మొదలైన సేవలను పొందడానికి ప్రతి సారీ తమ గుర్తింపు పత్రాలను చూసి తమ గుర్తింపును నిరూపించుకోవాల్సిన సమస్యకు ప్రజల ఆధార్ ద్వారా అరికట్టే రోజులు ప్రస్తుతం నడుస్తున్నాయి. అదేవిధంగా ఆధార్ లేనిదే ఏ గుర్తిపూ ఉండదని ప్రభుత్వాలు కూడా స్పష్టం చేస్తున్నాయి. రానున్న రోజుల్లోనూ ఆధార్ అవసరం మరింత పెరగుందనడంలో ఎలాంటి సదేహమూ లేదని ప్రజలు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.



ప్రభుత్వం జారీ చేస్తున్న ఆధార్ కార్డు

బహిరంగ చర్చకు వైసీపీ సిద్ధమా?

కోట: గూడూరు నియోజకవర్గంలో అభివృద్ధి జరగలేని చెబుతున్న వైసీపీ సమన్వయకర్త మేరిగ మురళీధర్ అభివృద్ధిపై బహిరంగ చర్చకు సిద్ధంగా ఉండాలని టీడీపీ నాయకులు సవాల్ విసిరారు. కోటలో మంగళవారం జరిగిన టీడీపీ కార్యకర్తల సమావేశంలో మండల కన్వీనర్ మద్దాలి సర్వోత్తమరెడ్డి మాట్లాడుతూ అనైతిక విలువలు కలిగినటువంటి మేరిగ మురళీధర్ అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తున్న ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్‌పై విమర్శలు చేయడం అర్ధరహితం అన్నారు. జిల్లాలో ఏ నియోజకవర్గంలో జరగనంత అభివృద్ధి గూడూరులో జరిగిందన్నారు. రాత్రి సమయాల్లో నేతల ఆశీర్వాదం కోసం తిరిగే వ్యక్తికి అభివృద్ధి ఎలా తెలుస్తుందన్నారు. వైసీపీ నుంచి టీడీపీలో చేరిన ఎమ్మెల్యేలంతా శాసన సభ్యత్వాలకు రాజీనామా చేయాలని చెప్పడం దెయ్యాలు వేదాలు వళ్లించినట్లు ఉందన్నారు. నోటికొచ్చినట్లు మాట్లాడితే ప్రజలు తగిన గుణపాఠం చెబుతారన్నారు. వచ్చే ఎన్నికల్లో వైసీపీకి డిపాజిట్లు కూడా దక్కవనారు. ఈ సమావేశంలో జడ్పీటీసీ ఉప్పల ప్రసాద్‌గౌడ్, పాదర్తి కోటేశ్వరరెడ్డి, నెల్లూరు మోహన్‌రెడ్డి, కోనిశెట్టి రమేష్, మర్రి అనిల్, గూడూరు కిరణ్, మధుయాదవ్, రఘునాథరెడ్డి, గురుస్వామి, తూపిలి రాధాకృష్ణారెడ్డి, పలగాటి భాస్కర్‌రెడ్డి, సుధాకర్‌శెట్టి, చెంగల్‌రాయులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కన్వీనర్ సర్వోత్తమరెడ్డి

బీసీ గురుకులంలో సైన్స్‌ఫెయిర్

కోట: పట్టణంలోని బీసీ గురుకులంలో మంగళవారం సైన్స్‌ఫెయిర్ నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని గురుకులాల ఏజీవో కిరణశ్రీ ప్రారంభించారు. విద్యార్తులు పలు ప్రయోగాలను ప్రదర్శించారు. అతితక్కువ ఖర్చుతో చంద్రయాన్ రాకెట్ ప్రయోగంతో పాటు వివిధ నమూనాలు ప్రదర్శనలో ఉంచారు. వీటిలో ఉత్తమమైన వాటిని ఎంపిక చేసి బహుమతులు అందజేశారు.


రాకెట్ ప్రయోగాన్ని చూపిస్తున్న విద్యార్థులు

తిమ్మనాయుడుపాళేన్ని దత్తత తీసుకుంటాం

కోట: మండలంలోని తిమ్మనాయుడు పాళెం గ్రామాన్ని దత్తత తీసుకుంటా మని డివిజనల్ పంచాయతీ అధికారి వీరయ్య తెలిపారు. మంగళవారం తిమ్మానాయుడు పాళెం గ్రామాన్ని డీఎల్‌పీవో వీరయ్య, పంచాయతీ విస్తరణ అధికారి కల్పన, కార్యదర్శి శ్రీనివాసులు సందర్శించారు. గ్రామంలో ఉన్న డ్రైనేజీ వ్యవస్థను పరిశీలించారు. ఆదేవిధంగా పారిశుధ్య కార్యక్రమాలను తనిఖీ చేశారు. ఆయా కార్యక్రమాలు బాగుండటంతో సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం రచ్చబండ సమావేశం ఏర్పాటు చేసి గ్రామానికి కావాల్సిన పనుల గురించి చర్చించారు. ఈ గ్రామాన్ని తాను దత్తత తీసుకుంటునానని, కలెక్టర్‌తో చర్చించి మరిన్ని నిధులు తీసుకువచ్చి అభివృద్ధికి సహకారిస్తానని తెలిపారు. అపరిష్కృతంగా ఉన్న సమస్యలను గ్రామస్థులు డీఎల్‌పీవో దృష్టికి తీసుకువచ్చారు. వీటిపై కూడా తక్షణ చర్యలు తీసుకుంటానని ఆయన గ్రామస్థులకు హామీ ఇచ్చారు. ఆదర్శ గ్రామంగా తీర్చదిద్ది మరిన్ని నిధులు తీసుకువస్తానన్నారు. కార్యదర్శి శ్రీనివాసులుకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు.


మొక్క నాటుతున్న డీఎల్‌పీవో

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్రగాయాలు

నాయుడుపేటరూరల్: నాయుడుపేట శ్రీకాళహస్తి బైపాస్ రోడ్డు వద్ద మంగళవారం రాత్రి గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో మోటారు సైకిల్‌పై వెళుతున్న ఓ వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. నెల్లూరు పట్టణానికి చెందిన నవీన్ మోటారు సైకిల్‌పై తిరుపతికి వెళుతుండగా మార్గమధ్యలో నాయుడుపేట బైపాస్ రోడ్డు వద్ద గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో ఈ ప్రమాదం చోటు చేసుకుంది. సమాచా రం అందుకున్న 108 సిబ్బంది క్షతగాత్రుడిని నాయుడుపేట ప్రభుత్వాసుపత్రికి తరలించారు. తలకు బలమైన గాయం తగలడంతో రక్తస్రావం జరిగి పరిస్థితి విషమంగా మా రింది. ప్రాథమిక చికిత్స అనంతరం మెరు గైన వైద్యం కోసం నెల్లూరుకు తరలించారు.

విద్యార్థులకు ఎమ్మార్ వ్యాక్సిన్

ఓజిలి: సగుటూరు పంచాయతీలోని వీర్లగునుపాడు ప్రాథమిక పాఠశాలలో మంగళవారం విద్యార్థులకు ఎమ్మార్ వ్యాక్సిన్ వేశారు. పెద్దపరియ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది ఈ కార్యక్రమం చేపట్టారు. పాఠశాలలోని విద్యార్థులకు అవగాహన కల్పించి టీకా వేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం సత్యనారాయణరాజు, ఏఎన్‌ఎం సంపూర్ణ, హెల్త్ అసిస్టెంట్ కేవీ రమణయ్య, ఆశా వలంటీర్‌యు సుజాత, అంగన్‌వాడీ వర్కర్ రత్నమ్మ పాల్గొన్నారు. అంతకుముందు సమావేశంలో వైద్యఆరోగ్యశాఖ సిబ్బంది విద్యార్థులకు ఆరోగ్యం, పరిసరాల పారిశుధ్యం, వ్యక్తిగత పరిశుభ్రత వంటి విషయాల గురించి వివరించారు.

చిట్టమూరు: కొత్తగుంట టీఎంఆర్ పాఠశాలలో విద్యార్థులకు మంగళవారం ఎమ్మార్ వ్యాక్సిన్ వేశారు. చిట్టమూరు వైద్యాధికారి ప్రసాద్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ తంబిరెడ్డి మనోహర్ రెడ్డి, డైరెక్టర్ విజయలక్ష్మి, ఉపాధ్యాయులు ఉన్నారు.

ఒక్క టీకాతో రెండు వ్యాధులు దూరం

నాయుడుపేట : ఒక్క టీకాతో రెండు వ్యాధులు దరి చేరవని సెయింట్‌మేరీస్ ఇంగ్లీషు మీడియం పాఠశాల ప్రిన్సిపాల్ ఉషారాణి అన్నారు. మంగళవారం పాఠశాలలో ఆరోగ్యశాఖ సిబ్బంది ఆధ్వర్యంలో రుబెల్లా టీకాలను విద్యార్థులకు వేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ టీకాల వల్లన ప్రాణాంతక వ్యాధులైన తట్టు, రుబెల్లా బారిన పడ కుండా ఉంటారన్నారు. 9 నెలల నుంచి 15 ఏళ్ల లోపు పిల్లలకు వీటిని వేయవచ్చన్నారు. విద్యార్థులు, వారి తల్లిదండ్రులు టీకాపై అవగాహన పెంచుకొని ప్రతి ఒక్కరు టీకా వేయించుకునేలా చూడాలన్నారు.

సమస్యల్లో ఉన్నాం..స్పందించండి

● తాగునీరిచ్చి ఆదుకోవాలని సంజయ్‌గాంధీ కాలనీ మహిళల వినతి ● మౌలిక వసతులు కల్పించాలన్న వత్రపాళెం వాసులు



వత్రపాళెంలో పర్యటిస్తున్న చైర్ పర్సన్ నూలేటి



నాయుడుపేట: చైర్‌పర్సన్ శోభారాణితో మాట్లాడుతున్న సంజయ్‌గాంధీ కాలనీ మహిళలు

నాయుడుపేట : పట్టణంలోని సంజయ్‌గాంధీకాలనీకి తాగునీరిచ్చి ఆదుకోవాలని కాలనీ మహిళలు చైర్ పర్సన్ శోభారాణికి మంగళవారం వినతి పత్రం అందజేశారు. కాలనీకి అర్ధరాత్రి సమయంలో కొద్దిసేపు నీరు వస్తున్నా యని మిగతా సమయాలలో తాగునీరు రావడం లేదని వారు వాపోయారు. కాల నీలో ఉన్న చేతిబోర్లు కూడా మరమ్మతు లకు నోచుకోవడంతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామని వినతిపత్రంలో తెలి యజేశారు. కూలీనాలి పనిచేసుకొనే తాము నగదుఇచ్చి వాటర్‌క్యాన్లను కొను గోలు చేసే పరిస్థితిలో లేమని వాపోయారు. దీనికి చైర్ పర్సన్ శోభా రాణి స్పందించి నగరపంచాయతీ డీఈ కోటేశ్వరరావుకు కాలనీకి తాగునీరును ఏర్పాటు చేయాలని ఆమె ఆదేశించారు.

తాగునీటి పైప్‌లైన్లకు మరమ్మతులు : పట్టణంలోని శ్రీరాంన గర్‌లో తాగునీటి ఎద్దడి నెలకొనడంతో ఆ ప్రాంతంలో పైపులైన్లకు మరమ్మ తులు జరిగాయి. ఈ మరమ్మతులను టీడీపీ నాయకులు మైలారి రాజశేఖర్, పూనాటి తిరుమలనాయుడు పరిశీలిం చారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయ కులు ముదూరు శేఖర్, చంద్రారెడ్డి, తది తరులు ఉన్నారు.

సూళ్లూరుపేట : వీధిలైట్లు లేక, తాగునీరు రాక, రహదారిలేక, అవస్థలు పడుతున్నామంటూ వత్రపాళెం వాసులు మున్సిపల్ చైర్ పర్సన్‌కు విన్న వించుకున్నారు. దీంతో మంగళవారం చైర్ పర్సన్ నూలేటి విజయలక్ష్మి, కమిష నర్ రాజగోపాల్‌రావు వత్రపాళెంను సందర్శించారు. అక్కడి ప్రజల సమస్య లపై వాకబుచేశారు. వెంటనే వీధి లైట్లు వేయిస్తామని, తాగునీరు సక్రమంగా సరఫరా అయ్యేలా చేస్తామని హామీ ఇచ్చారు. అలాగే రహదారి ఏర్పాటుకు సహకరిస్తామని తెలిపారు.

పారిశుధ్యంతో సీజనల్ వ్యాధులు దూరం



పారిశుధ్యం పనులు పరిశీలిస్తున్న శివయ్య, సర్పంచు

నాయుడుపేటరూరల్ : సంపూర్ణ పారిశుధ్యంతో సీజనల్ వ్యాధులు ప్రబలవని నాయుడుపేట ఎంపీడీవో శివయ్య అన్నారు. నాయుడుపేట మండలం తిమ్మాజికండ్రిగ గ్రామంలో మంగళవారం ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాల్లో భాగంగా గ్రామంలో కాలువల్లో పూడికలు తీయించడం, తదితర పనులను ప్రారంభించారు. ప్రతి గ్రామంలో పారిశుధ్యంపై దృష్టి సారిస్తున్నట్లు ఆయన తెలిపారు. గ్రామాల్లో పారిశుధ్యంపై దృష్టి సారించడం వలన ప్రజలందరూ సీజనల్ వ్యాధులు రాకుండా ఆరోగ్యంగా ఉంటారని ఆయన తెలి పారు. ఈ పారిశుధ్య ప్రత్యేక కార్యక్రమాలు అక్టోబరు 2 వరకు ప్రతి గ్రామంలో చేపడుతున్నట్లు ఆయన తెలిపారు. అనంతరం తిమ్మాజి కండ్రిగ పంచాయతీ కార్యాలయంలో గృహనిర్మాణాలపై గ్రామస భను సర్పంచు పిల్లెటి రమణయ్య అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి సుధీర్, తదితరులు పాల్గొన్నారు.

చంద్రన్న బీమాతో కుటుంబాలకు మేలు



చంద్రన్నబీమా పత్రాలు అందజేస్తున్న చైర్ పర్సన్ శోభారాణి

నాయుడుపేట : చంద్రన్నబీమాతో కుటుంబాలకు మేలు చేకూ రుతుందని నాయుడుపేట చైర్ పర్సన్ మైలారి శోభారాణి అన్నారు. నాయుడుపేట నగరపంచాయతీ కార్యాలయంలో మంగళవారం కమిషనర్ ఆవినేని ప్రసాద్‌తో కలిసి లబ్ధిదారులకు చంద్రన్నబీమా పత్రాలు అందజేశారు. పట్టణంలోని రాజగోపాలపురానికి చెందిన గురులక్ష్మి భర్త పవన్‌కుమార్ ప్రమాదంలో మృతి చెందగా ఆమెకు 5 లక్షల రూపాయల చంద్రన్నబీమా మంజూరైంది. మొదట విడ తగా గురులక్ష్మికి 75వేల రూపాయలు మంజూరైనట్లు బీమాప త్రాన్ని ఆమెకు అందజేశారు. అలాగే పట్టణంలోని రాజీకి కవితకు 30వేల రూపాయలు, నందకుమార్‌కు 30వేల రూపాయల పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో న్యాయవాది పసల గంగాప్రసాద్, కౌన్సిలర్ శేషం మునిగోపీ, మెప్మా రజని, తదితరులు పాల్గొన్నారు.

కారు ప్రమాద నిందితుల అరెస్ట్

నాయుడుపేటరూరల్ : నాయుడుపేట మండలం ద్వారకా పురం రోడ్డు వద్ద ఆదివారం రాత్రి మోటారుసైకిల్‌ను కారుతో ఢీకొని ఒకరి మృతికి కారణమైన నిందితులను అరెస్టు చేసినట్లు సీఐ రత్తయ్య, ఎస్సై రవినాయక్ తెలిపారు. ఈ సందర్భంగా వీరిని విలేఖర్ల ముందు ప్రవేశపెట్టారు. తమీమ్, జమీరుద్దీన్, పఠాన్‌న యామ్, నజీర్, మస్తాన్ మద్యం సేవించి కారు నడపడంతో ప్రమాదం జరిగినట్లు తెలిపారు. వీరందరిని మంగళవారం కోర్టుకు హాజరుపర్చగా ఐదు మందిని రిమాండ్‌కు తరలిస్తూ నాయుడుపేట జూనియర్ సివిల్ జడ్జి ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రీ జీవీఎల్ సరస్వతి తీర్పుని చ్చినట్లు వీరు తెలిపారు.



నిందితుల వివరాలు తెలుపుతున్న సీఐ రత్తయ్య, ఎస్సై రవినాయక్

నాయుడుపేట విద్యార్థికి డాక్టరేట్ ప్రదానం



ఐఐటీ డైరెక్టర్ యూబిదేశాయి నుంచి డాక్టరేట్‌ను స్వీకరిస్తున్న భగత్‌సింగ్

నాయుడుపేటరూరల్ : నాయుడు పేట పట్టణానికి చెందిన జీవీపీ భగత్‌సింగ్ కు ఈ నెల 5వ తేదీన హైదరాబాదులోని ఐఐటీ డైరెక్టర్ యూబి దేశాయి డాక్టరేట్ (పీహెచ్‌డి)ను అందజేశారు. చిట్టమూరు మండలం మొలకలపూడి జడ్పీ పాఠశాల ఉపాధ్యాయుడు ఆనంద్ కుమారుడైన భగత్ సింగ్ 1వ నుంచి 10వ తరగతి వరకు మండలంలోని గొట్టిప్రోలు జడ్పీ పాఠశాలలో తెలుగుమీడియంలో విద్యను అభ్యసించాడు. ప్రొఫెసర్ కేవీఎల్ సుబ్రహ్మణ్యం పీహెచ్‌డీ, పీడీఎఫ్ పర్యవేక్షణలో రీసెర్చ్ కాలర్‌గా చేరి అంతర్జాతీయంగా జపాన్, కెనడా దేశాలలో 16 పరిశోధన పత్రాలను ప్రచురించడం జరి గింది. ప్రస్తుతం రీసెర్చ్ కాలర్‌గా థర్మల్ పవర్‌ప్లాంట్ నుంచి వ్యర్థ పదార్థం (ఫ్లయాష్) నుండి అల్యూమినో సిలికేట్ అనే కొత్త సిమెంట్‌ను కనుగొన్నాడు. తెలుగుమీ డియం చదివి ఇంత ఉన్నత స్థాయికి చేర డంతో డైట్ ప్రిన్సిపాల్ ప్రసంజనేయులు, ఉదయ్‌శంకర్, మునిరత్నం, రవి, భూపయ్య , తదితరులు భగత్‌సింగ్‌కు అభినందనలు తెలియజేశారు.

ఎన్నికలపై విద్యార్థులకు అవగాహన అవసరం



సూళ్లూరుపేట: నారాయణ స్కూల్‌లో విద్యార్థుల ఎన్నికల నిర్వహణ

సూళ్లూరుపేట : విద్యార్థి దశ నుంచే ఎన్నిక లపై అవగాహన కల్పించడంతోపాటు నాయ కత్వం లక్షణాలు కలుగజేసేందుకు తమపాఠశా లల్లో కేబినెట్ ఎన్నికలు నిర్వహించామని శ్రీ చైతన్య పాఠశాల ప్రిన్సిపాల్ సాయిరాం, నారా యణ స్కూల్ ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు తెలిపారు. ఈ రెండు పాఠశాలల్లో మంగళవారం ఎన్నికలు నిర్వహించారు. పోలింగ్‌బూత్‌లు ఏర్పాటు చేసి విద్యార్థులచే ఓట్లు వేయించారు. హెడ్‌బాయ్, హెడ్‌గర్ల్, డిప్యూటీ హెడ్‌బాయ్, డిప్యూటీ హెడ్ గర్ల్, స్పోర్ట్స్ కెప్టెన్, సాంస్కృతిక కార్యదర్శి, తరగతి నాయకుల ఎంపికకు ఎన్నికలు నిర్వహించారు. శ్రీచైతన్య పాఠశాలలో ఏజీఎం శ్రీకాంత్, డీన్ వెంక టేశ్వర్లు, పీఈటీ సుబ్బయ్య, ఏవో బాగ్యరాజ్, నారాయణ పాఠశాలలో డివిజనల్ డీన్ సుధీర్, ఏజీఎం శ్రీనివాసులు రెడ్డి, ఇద్రాణి, హరీష్, శివప్రసాద్, జ్యోష్నదేవి ఎన్నికల నిర్వ హణలో పాల్గొన్నారు.

నాయుడుపేట : శ్రీచైతన్య పాఠశాలలో మంగళవారం విద్యార్థి నాయకుల ఎంపిక ఎన్నికలు నిర్వహించారు. విద్యా ర్థులు తమ ఓటును వినియోగించుకున్నారు. ఏజీఎం శ్రీకాంత్ మాట్లాడుతూ సాధారణ ఎన్నికల తరహాలో పాఠ శాలలో నాయకుల ఎన్నికలు నిర్వహించి విద్యార్థులకు అవ గాహన కల్పించామన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు అంబటి రవీంద్రబాబు, ఏవో దాసరి ప్రభాకర్, డీన్ శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు పాల్గొ న్నారు.

మేరిగను విమర్శించడం తగదు : వైసీపీ నేతలు



మాట్లాడుతున్న వైసీపీ నేతలు సన్నారెడ్డి, తదితరులు

చిట్టమూరు : గూడూరు నియోజకవర్గ సమన్వయకర్త మేరిగను విమర్శిస్తూ టీడీపీ నేతలు ప్రకటనలు చేయడం మంచిది కాదని వైసీపీ మండల కన్వీనర్ సన్నారెడ్డి శ్రీనివాసులు రెడ్డి అన్నారు. చిట్టమూరు ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో మంగళవారం విలేఖర్లతో మాట్లాడారు. చిల్లరరాజకీయాలు చేయడం తగదని అన్నారు. నియోజకవర్గ అభివృద్ధిని వైసీపీ అడ్డుకుంటుందనే టీడీపీ నేతల విమర్శలను ఆయన కొట్టిపారేశారు. నియోజకవర్గంలో ఎక్కడ అభివృద్ధి జరిగిందో చర్చకు రావాలన్నారు. చిట్టమూరు మండలంలో ని పక్కాగృహాల్లో అవినీతి జరిగిందని, మరుగుదొడ్లు, పింఛన్లలో అవినీతి చోటు చేసుకుందని ఆరోపించారు. నియోజకవర్గ నేతలను విమర్శించే ముందు మన స్థాయిని మరచిపోరాదన్నారు. ఈ సమావేశంలో వైసీపీ నాయకులు బాబురెడ్డి, కామిరెడ్డి కస్తూరెడ్డి, సుధాకర్‌రెడ్డి, మల్లాం రమణారెడ్డి, మనోహర్ మస్తానయ్య, లోకేష్‌రెడ్డి, అనీల్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

కారూరు మిట్టలో పోలేరమ్మ జాతర

తడ : కారూరుమిట్ట గ్రామంలో మంగళవారం పోలేరమ్మ జాతర అంగరంగ వైభవంగా ప్రారంభమైంది. మూడు రోజులపాటు జరిగే ఈ జాతరలో మొదటిరోజు మంగళవారం భక్తులు అమ్మణ్ణికి అంబళ్లు పోశారు. గ్రామంలో మహిళలంతా అంబళ్లను తలపై ఉంచుకొని ఊరేగింపుగా పోలేరమ్మ బండ వద్దకు చేరుకున్నారు. అక్కడ పోలేరమ్మకు అంబళ్లను సమర్పించి తమ మొక్కులు తీర్చుకున్నారు. మంగళవారం నుంచి గురువారం వరకు ఈ జాతర వేడుకలు జరగనున్నాయి. దీంతో గ్రామంలోని ప్రతి ఇంట్లో పండుగ వాతావరణం నెలకొంది.

మృతదేహం అప్పగింత

పెళ్లకూరు : మండల పరిధిలోని రావులపాడు గ్రామం వద్ద సోమవారం రాత్రి ట్రాక్టర్ ఆటోను ఢీ కొన్న ప్రమాదంలో దుర్మరణం పాలైన సలీమ్ మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. సలీమ్ చిత్తూరుజిల్లా తొట్టంబేడు మండలం శ్రీకాళహస్తిలోని ఎన్టీఆర్ నగర్‌కు చెందిన వాడు. ప్రమాదం అనంతరం పోలీసులు నాయుడుపేట ప్రభుత్వ ఆసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించి కుటుంబసభ్యులకు మృతదేహాన్ని అప్పగించారు.

డివైడర్‌ను ఢీ కొన్న బైక్

తడ : ఓ బైక్ అదుపుతప్పి డివైడర్‌ను ఢీ కొట్టింది. బాలయపల్లి మండలం వెంగమాంబపురం గ్రామానికి చెందిన సాయి తడ ఐటీఐ కళాశాలలో పరీక్షకు హాజరయ్యే నిమిత్తం మంగళవారం బైక్‌పై తడకు బయలుదేరాడు. మార్గ మధ్యలో ఓజిలి గ్రామానికి చెందిన సాయికుమార్‌ను ఎక్కించుకొని వస్తుండగా అక్కంపేట జాతీయ రహదారి వద్ద బైక్ అదుపుతప్పి డివైడర్‌ను ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో సాయికి తీవ్ర గాయాలు కాగా సాయికుమార్‌కు స్వల్పగాయాలయ్యాయి. 108 సిబ్బంది క్షతగాత్రులను సూళ్లూరుపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

స్వర్ణముఖిబ్రిడ్జి సమీపంలో కంటైనర్ బోల్తా


రోడ్డుపై బోల్తా పడిన కంటైనర్

నాయుడుపేటరూరల్ : నాయుడుపేట స్వర్ణముఖిబ్రిడ్జి సమీపంలో మంగళవారం తెల్లవారుజామున భారీ కంటైనర్ బోల్తా కొట్టింది. వివరాలు ఇలా ఉన్నాయి. చెన్నై నుంచి పేపర్ రీల్ లోడ్‌తో మేనకూరు సెజ్‌లోని ఓ మిల్లుకు బయలుదేరిన కంటైనర్ స్వర్ణముఖి బ్రిడ్జి సమీపంలోకి రాగానే అడ్డంగా గుర్తుతెలియని వాహనం రావడంతో అదుపుతప్పి బోల్తా కొట్టినట్లు డ్రైవర్ గోపీనాథ్ స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ ప్రమాదంలో డ్రైవర్ సురక్షితంగా బయటపడ్డాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ

పెళ్లకూరు :గుర్రప్పతోట వద్ద ఓ ఇంట్లో సోమవారం రాత్రి చోరీ జరిగింది. ఇంట్లోనే టీ దుకాణం నడుపుతున్న మర్రి మునిప్రసాద్, భార్యతోపాటు ఊరికి వెళ్లి ఉండగా ఇంటి ముందుభాగంలో ఉన్న టీ దుకాణానికి సంబంధించిన రేకు తలుపును విరగగొట్టి దొంగలు ప్రవేశించారు. ఇంట్లో ఉన్న సవర బంగారు, 8,600 రూపాయల నగదును తీసుకెళ్లారు. కాగా తలుపులు విరిగి ఉండడంతో చుట్టుపక్కల వారు మునిప్రసాద్‌కు సమాచారం అందించడంతో ఊరికి వెళ్లిన అతను ఇంటికి చేరుకొని ఇంట్లో పరిశీలించి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు అందించాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు సాగిస్తున్నారు.

అట్టహాసం..అపహాస్యం..!

● ప్రభుత్వ పథకాల అమలు తీరుపై విమర్శలు


మొక్క నాటుతున్న ఆర్డీవో, ఎమ్మెల్యే (ఫైల్)


పచ్చదనం-పరిశుభ్రత జాడ లేని తడ రహదారి సమీప ప్రాంతం

తడ : పర్యావరణాన్ని పరిరక్షించాలి... పరిశుభ్రతను పాటించాలి.. ప్రతి ఒక్కరు మొక్కలు నాటాలి... ఇది ప్రభుత్వ అధికారులు, పాలకులు చెప్పే మాట. మొక్కలు నాటే కార్యక్రమంలో మాత్రం హడావుడి చేసే వీరు ఆ తరువాత వాటిపై శ్రద్ధ వహించడం లేదు. వివరాలలోకి వెళితే.. దేశాన్ని సుందరంగా తీర్చిదిద్దేందుకు మొదట స్వచ్ఛభారత్, అనంతరం మొక్కల పరిరక్షణ వంటి కార్యక్రమాలను ప్రభుత్వాలు చేపట్టాయి. కేంద్ర ప్రభుత్వం అట్టహాసంగా ప్రారంభించిన స్వచ్ఛభారత్ అపహాస్యం పాలవుతోంది. ఎక్కడ చూసిన దుర్గంధం వెదజల్లే చెత్తాచెదారలే దర్శనమిస్తున్నాయి. మొదట్లో స్వచ్ఛభారత్ కార్యక్రమానికి ప్రజా ప్రతినిధులు, అధికారులు, స్వచ్ఛందసంస్థలు విరివిగా ప్రాధాన్యమిచ్చారు. వీధులు చిమ్మటం, చెత్తకుప్పలను ఏరివేయటం వంటి కార్యక్రమాలను చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతి గ్రామానికి ఓ డంపింగ్‌యార్డ్ ఖచ్చితంగా ఉండాలన్న ఉద్దేశ్యంతో ఆ మేరకు చర్యలు తీసుకుంది. అనంతరం 2016 ఆగస్టులో మొక్కలు పెంచాలంటూ నినాదంతో వనంకోసం-మనం అంటూ పెద్ద ఎత్తున మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. ఒక్క జిల్లాలోనే అధికారికంగా లక్ష మొక్కల వరకు నాటడం విశేషం. ఇక వీరితోపాటు స్వచ్ఛంద సంస్థలు సైతం ఈ వనం మనం కార్యక్రమాన్ని నిర్వహించాయి. వీళ్లతోపాటు పోలీసులు మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రతిష్ఠాత్మకంగా తీసుకొని ప్రతి గ్రామంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇలా ఆర్భాటంగా ప్రారంభించిన ఈ కార్యక్రమం మరుసటి రోజు నుంచి మరుగున పడిపోయింది. మొక్కలు నాటే సందర్భంలో తప్పా మిగిలిన రోజుల్లో వాటి ఆలనాపాలనా కరువైంది. దీంతో మొక్కలు కొన్నిచోట్ల ఎండిపోగా, మరికొన్ని చోట్ల పశువులకు ఆహారంగా మారాయి. వీటికి తోడు తీవ్ర వర్షాభావం పరిస్థితుల దృష్ట్యా ఈ మొక్కలు ఎండిపోవటం కూడా ఓ కారణమైంది.

ఇక స్వచ్ఛకార్యక్రమంలో భాగంగా ఆయా పంచాయతీ పరిధిల్లో ప్రతి వారానికి ఒక రోజు పరిశుభ్రతను పాటించాలంటూ పంచాయతీలలో చెత్త కుప్పలను ఎప్పటికప్పుడు శుభ్రపరచాలని ఆదేశించిన ఆదేశాలు ప్రస్తుతం బుట్టదాఖలయ్యాయి. ఎక్కడ చూసినా చెత్తకుప్పలు మురుగుగుంటలు నేటికి దర్శనమిస్తూనే ఉన్నాయి. మరి కొన్ని గ్రామాల్లో నేటి వరకు డంపింగ్‌యార్డ్‌లు ఏర్పాటు కాలేదు. దీంతో చెత్తా చెదారాలన్నీ రోడ్లపైనే దర్శనమిస్తున్నాయి. కొన్నిచోట్ల జాతీయ రహదారి వెంబడి ఈ చెత్తా చెదారాలను నుంచి వచ్చే దుర్వాసనతో వాహనదారుల ముక్కుపూటలు అదిరిపోతున్నాయి. పచ్చదనం-పరిశుభ్రతతో కళకళలాడాల్సిన గ్రామాలు ప్రస్తుతం మురుగు కంపుతో అల్లాడుతున్నాయి. ప్రభుత్వం చేపట్టే ప్రతి కార్యక్రమాన్ని చిత్తశుద్ధితో నిర్వహించేలా ప్రతి ఒక్కరూ నడుం కట్టాల్సి ఉంది.

రాచపాళెం సర్పంచు చెక్‌పవర్ రద్దు

ఓజిలి: ఓజిలి మండలం రాచపాళెం పంచాయతీ సర్పంచు పందేటి శ్రీలత చెక్‌పవర్ రద్దుచేస్తూ జిల్లా పంచాయతీ అధికారి కార్యాలయం నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఈమేరకు సంబంధిత ఉత్తర్వులు మంగళవారం ఓజిలి ఎంపీడీవో కార్యాలయానికి అందాయి. 2014 నుంచి 2017వ సంవత్సరం వరకు పంచాయతీకి అందిన సాధారణ నిధులు, 13, 14వ ఆర్థిక సంఘం నిధులు, రాష్ట్ర ఆర్థిక సంఘం నిధులు మొత్తం 29,57,661 రూపాయలు అందాయి. ఈమొత్తం నిధులలో ఇప్పటివరకు 14,50,588 రూపాయలకు మాత్రమే అన్ని వివరాలు, రికార్డుల నమోదు ఉన్నాయి. మిగిలిన 15,07,073 రూపాయలకు ఎలాంటి వోచర్లు, ఇతర రికార్డులు చూపలేదు. దీంతో విచారణ చేసిన పంచాయతీ అధికారులు చెక్‌పవర్ రద్దుచేస్తూ ఆదేశాలు జారీచేశారు.

లెక్కతేల్చకపోతే రికవరీకి ఆదేశం: లెక్కచూపని 15 లక్షల రూపాయలకు సంబంధించిన వివరాలు, వోచర్లను 15 రోజులలోపు జిల్లా పంచాయతీ కార్యాలయానికి అందజేయాలని ఉత్తర్వులలో పేర్కొన్నారు. వివరాలు అందకపోతే రికవరీకి ఆదేశాలు జారీ చేయనున్నట్లు ఇన్‌చార్జి పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసులుకు తాఖీదులు పంపారు.

రికార్డుల ప్యూరిఫికేషన్‌లో జాగ్రత్తలు పాటించండి

● మూడు మండలాల రెవెన్యూ సిబ్బందితో తెలుగుగంగ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ నరసింహం


మాట్లాడుతున్న టీజీపీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ నరసింహం


సమావేశానికి హాజరైన రెవెన్యూ సిబ్బంది

నాయుడుపేటరూరల్ : కలెక్టర్ ఆదేశాల మేరకు జరుగుతున్న రెవెన్యూ రికార్డుల ప్యూరిఫికేషన్ కార్యక్రమాన్ని అన్ని వివరాలతో నమోదు చేయాలని ప్రత్యేక అధికారి, తెలుగుగంగ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ నరసింహం సిబ్బందికి సూచించారు. నాయుడుపేట తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం నాయుడుపేట, ఓజిలి, పెళ్లకూరు, మండలాల తహసీల్దార్‌లు, ఆర్‌ఐలు, వీఆర్వోల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్యూరిఫికేషన్ కార్యక్రమంలో భాగంగా అన్ని కోణాలలో భూముల వివరాలను పరిశీలించి రెవెన్యూ రికార్డులు, ఇతర అంశాలను కూడా పరిగణలోకి తీసుకోవాలన్నారు. అప్పుడే రెవెన్యూ రికార్డుల ప్యూరిఫికేషన్ కార్యక్రమం విజయవంతం అవుతుందని తెలిపారు. మండలంలోని గ్రామాల వారీగా ఇప్పటి వరకు జరిగిన రెవెన్యూల రికార్డుల ప్యూరిఫికేషన్ వివరాలను పరిశీలించి వాటిపై పలు సలహాలు, సూచనలు ఆయన రెవెన్యూ సిబ్బందికి అందజేశారు. ఈ కార్యక్రమాన్ని త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో నాయుడుపేట, పెళ్లకూరు, ఓజిలి తహీసల్దార్‌లు మైత్రేయ, నాగరాజలక్ష్మి, సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

వెంకయ్యనాయుడుకు చెంగాళమ్మ చిత్రపటం


ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడుకు చెంగాళమ్మ చిత్రపటాన్ని అందజేస్తున్న చెంగాళమ్మ ఆలయ చైర్మన్ ముప్పాళ్ల

సూళ్లూరుపేట : ఉపరాష్ట్రపతిగా ఎన్నికైన నెల్లూరీయుడు ముప్పవరపు వెంకయ్యనాయుడుకు సూళ్లూరుపేట చెంగాళమ్మతల్లి ఆశీస్సులు మెండుగా లభించాలంటూ చెంగాళమ్మ ఆలయ చైర్మన్ ముప్పాళ్ల వెంకటేశ్వర్లురెడ్డి ఆయనకు చెంగాళమ్మ చిత్రపటాన్ని బహుకరించారు. మంగళవారం నెల్లూరులో వెంకయ్యనాయుడును ముప్పాళ్ల కలసి శాలువాతో సత్కరించి శుభాభినందనాలు తెలిపారు. ఆయనతోపాటు ఆలయ పాలకవర్గ సభ్యులు పులుగు శ్రీనివాసులురెడ్డి, ఆకుతోట రమేష్, సాయి పాల్గొన్నారు.

పాఠశాలకు ఫ్యాన్ బహూకరణ

సూళ్లూరుపేట : స్థానిక బాపూజీకాలనీలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు వాసవీక్లబ్ ప్రతినిధులు మంగళవారం ఫ్యాన్‌ను బహుకరించారు. వాసవీక్లబ్ మాజీ అధ్యక్షుడు బండారు శబరీష్ గుప్తా జన్మదినం సందర్భంగా ఫ్యాన్‌ను బహుకరించారు. క్లబ్ అధ్యక్షుడు నూతలపాటి శ్రీనివాసులు, జూనియర్ చాంబర్ దుగ్గి సుదర్శన్‌గుప్తా, కారంశెట్టి సుధాకర్, అమర్‌లు పాల్గొన్నారు. దాతలకు హెచ్‌ఎం రాజేశ్వరి, ఉపాధ్యాయులు భాస్కర్ కృతజ్ఞతలు తెలిపారు.


పాఠశాలకు ఫ్యాన్ బహూకరిస్తున్న వాసవీక్లబ్ ప్రతినిధులు

చెరువు ఆక్రమించారు!

• ఇబ్బందుల్లో ఆయకట్టు రైతులు • పట్టించుకోని అధికారులు



కోడూరు చెరువులో అక్రమంగా ఏర్పాటు చేసిన చేపలు గంతలు

తోటపల్లిగూడూరు : ఆయుకట్టు రైతులకు సాగునీరు, 20 గ్రామాలకు తాగునీరు అందిస్తున్న చెరువును అక్రమార్కులు ఆక్రమించేస్తున్నారు. దీంతో రొయ్యల గుంతలు, పంట పొలాలుగా చెరువు రూపాంతరం చెందుతోంది. ఫలితంగా సాగు, తాగునీరు అందక ప్రజలు అల్లాడిపోతున్నారు. తోటపల్లిగూడూరు మండల పరిధిలోని కోడూరు, ఈదూరులకు ఒకే చెరువు. రాజుల కాలం నుంచి ఈ చెరువు కింద సుమారు 10 వేల ఎకరాలు అయుకట్టు సాగవుతోంది. 1/4 వంతు భాగం టీఎంసీల నీరు నిల్వ చేసే సామర్థ్యం కలిగిన ఈ చెరువును సౌత్‌ఆమలూరు, వీలుకానిపల్లి, మాచర్లవారిపాళెం, ఈదూరు, కోడూరు, మహాలక్ష్మిపురం గ్రామాలకు చెందిన కొందరు ఆక్రమించి దాదాపు 150 ఎకరాలు రొయ్యలు, చేపల గుంతలు, పంట పొలాలుగా మార్చేశారు. ఈ ఆక్రమణ పొలాలు ఎగువ భాగంలో ఉండడం, సోమశిల జలాశయం నుంచి వచ్చే నీరు విద్యుత్ మోటార్ల ద్వారా తోడివేయడంతో చెరువుకు సాగు నీరు అందడం లేదు. దీంతో ఆయుకట్టు రైతులు అవస్థలు పడుతున్నారు.

ఆక్రమణలు తొలగించినా..

ఏడేళ్ల కిందట ఈ చెరువు ఆక్రమణలను రెవెన్యూ, నీటిపారుదలశాఖ అధికారులు ఆయుకట్టు రైతుల ఫిర్యాదు మేరకు పోలీసుల సమక్షంలో ఎక్స్‌కవేటర్ సాయంతో తొలగించారు. విద్యుత్ కనెక్షన్లను రద్దు చేయించారు. అయితే ఏడాదికే తిరగకుండానే మళ్లీ చెరువును ఆక్రమించేశారు.

రద్దయిన ఆధునికీకరణ పనులు

ఈ చెరువును ఆధునీకరించి నీటి నిల్వ సామర్థ్యాన్ని పెంచి ఆయుకట్టు రైతులకు సాగు, పరిసర గ్రామాలకు తాగు నీటి ఇబ్బంది తొలగించాలని 1996లో నాటి మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి సుమారు రూ.10 కోట్లతో ఆధునీకరణ పనులు మంజూరు చేయించారు. అయితే ఆమలూరుకు చెందిన కొందరు నాయకులు, చెరువులో ఆక్రమణలను పట్టించుకోకపోవడంతో మంజూరైన నిధులు రద్దయ్యాయి.

జోరుగా క్రయవిక్రయాలు

ఆక్రమించిన చెరువును ఇటీవల కొందరు అమ్మకాలు, కొనుగోల్లు ప్రారంభించారు. ఇప్పటికే వందల ఎకరాలకు పైగా ఈ ప్రక్రియ పూర్తయిందన్నది సమాచారం. ఎకరా పొలం రూ.50 నుంచి 80వేల వరకు అమ్మారని తెలిసింది.

పాతాళానికి జలమట్టం

ఆక్రమణలు ఇలాగే కొనసాగితే భూగర్భ జలమట్టం పాతాళానికి పడిపోయే ప్రమాదం ఉందని రైతులు, ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ఆక్రమణలు తొలగించి చెరువును కాపాడాలని వారు కోరుతున్నారు.



సాగునీరు అందడం లేదు

సోమశిల జలాశయం నుంచి విడుదల చేసే సాగునీరు చెరువు కింది ఆయుకట్టు రైతులకు సక్రమంగా అందడం లేదు. ఆక్రమణ కారణంగా సాగు నీరు అందక పంటలు ఎండిపోతున్నాయి.

- మణికంఠ



ఆక్రమణలు తొలగించాలి

చెరువు ఆక్రమించి చేపట్టిన చేపలు, రొయ్యల గుంతలు అధికారులు వెంటే తొలగించాలి. అప్పుడే పంటలు పండించుకోగలం. చెరువు ఆక్రమణతో ఆయకట్టు రైతులు అవస్థలు పడుతున్నారు.

- హరి, ఈదూరు

ఇరువర్గాల అరెస్ట్

తోటపల్లిగూడూరు : మండలంలోని తోటపల్లిగూడూరు గ్రామానికి చెందిన పాకం ఏడుకొండలు అతనిపై దాడికి పాల్పడిన మరో వర్గానికి చెందిన వంగిపొడి రాధాకృష్ణయ్య, రాగయ్యలను అరెస్ట్ చేసినట్లు పోలీసులు తెలిపారు. ఈ ముగ్గురు ఈ నెల 4వ తేదీన ఇంటి స్థలం విషయమై పరస్పరం దాడిచేసుకున్న కేసులో నిందితులు. వీరిపై కేసు నమోదు చేసి కోర్టుకు తరలించినట్లు ఎస్‌ఐ శివకృష్ణారెడ్డి తెలిపారు.

బావమరిదిపై దాడి

తోటపల్లిగూడూరు : చెల్లెలు, బావమరదుల మధ్య కక్షలు బావమరదిపై బావ దాడి దారితీశాయి. మండల పరిధిలోని వరిగొండ పంచాయతీ పట్టుగొళ్లపాళెం గ్రామంలో మంగళవారం తెల్లవారుజామున ఈ ఘటన జరిగింది. గ్రామానికి చెందిన ఎస్‌కె. సత్తార్ అతని భార్య మునీషాల మధ్య కుటుంబ కలహాల కారణంగా రెండేళ్లుగా విడిపోయారు. మునీషా నెల్లూరు నగరంలోని మూలాపేటలో ఉన్న తల్లి ఇంటి వద్దనే ఉంటోంది. దీన్ని దృష్టిలో ఉంచుకున్న మునీషా పెద్ద అన్న సందాని స్నేహితుడు ఉడతా శివతో కలిసి మంగళవారం తెల్లవారుజామున పట్టుగొళ్లపాళెంలో ఉన్న సత్తార్ ఇంటికి వెళ్లి తలుపు పగులగొట్టి మారణాయుధాలతో దాడి చేశారు. సత్తార్ కేకలతో చుట్టపక్కల వారు అక్కడికి చేరుకుని నిందితులను పట్టుకుని పోలీసులకు అప్పగించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ శివకృష్ణారెడ్డి తెలిపారు.

చెన్నకేశవుడికి పారువేట ఉత్సవం

మనుబోలు : స్థానిక దళితవాడ చెన్నకేశవుని బ్రహోత్సవాల్లో బాగంగా మంగళవారం రాత్రి స్వామివారికి పారువేట ఉత్సవం నిర్వహించారు. స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులకు అభిషేకాలు జరిపించి అర్చకులు వేదమంత్రాలతో అశ్వవాహనంపై కొలువుతీర్చారు. పారువేట ఉత్సవంలో భాగంగా కోనేరు వరకు ఊరేగించారు. అక్కడ కోడిపందెల పోటీ ప్రక్రియ భక్తులను ఆకట్టుకుంది. ఈ ఉత్సవానికి అడపాల కుటుంబ సభ్యులు ఉభయకర్తలుగా వ్యవహరించారు. ఉత్సవాల సందర్భంగా ఆలయాన్ని విద్యుద్దీపాలతో శోభాయామానంగా అలంకరించారు. మేళతాళాలు, బాణసంచా పేలుళ్లతో చెన్నకేశవుడి పారువేట ఉత్సవం వైభంగా ముందుకు సాగింది. ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారికి కాయ, కర్పూరం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. అర్చకులు తీర్థప్రసాదాలు అందజేశారు.



పారేవేటలో చెన్నకేశవుడు

సమస్యలపై నిర్లక్ష్యం తగదు : కాకాణి

వెంకటాచలం: ప్రజా సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం తగదని ఎమ్మెల్యే కాకాణి గోవర్ధన్‌రెడ్డి అధికారులకు హితవు పలికారు. వెంకటాచలం ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం జరిగిన మండల కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. పలువురు సభ్యులు మాట్లాడుతూ ఎంతో కాలంగా స్థానిక సమస్యలు అధికారుల దృష్టికి తీసుకెళుతున్నా స్పందించడంలేదని ఆరోపించారు. దీనిపై కాకాణి మాట్లాడుతూ అధికారులు ఉన్నది ప్రజా సమస్యలు పరిష్కరించడానికేనని, కాబట్టి వాటికి తొలి ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. వర్షాభావం కారణంగా తాగునీటి సమస్య ఎర్పడిందని, అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి ప్రజలు ఇబ్బంది పడకుండా చర్యలు తీసుకోవాలని ఆయన అన్నారు. ప్రభుత్వ ఆదేశాలకు విరుద్ధంగా అధికారులు పక్కా ఇళ్లు కేటాయిస్తున్నారని కాకాణి ధ్వజమెత్తారు. ఇది సీజనల్ వ్యాధులు వ్యాపించే కాలమని, సంబంధిత అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. రాయితీ రుణాల మంజూరులో లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు మందల వెంకటశేషయ్య, తలపల అరుణ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

సీపీఎం మండల నాయకుల తొలగింపు

తోటపల్లిగూడూరు : తోటపల్లిగూడూరు మండల సీపీఎం ఆర్గనైజర్ గంగపట్నం రవణయ్య, మండల కార్యదర్శి కోమారి నందయ్య, మండల కమిటీ సభ్యుడు జడ్డా ఏడుకొండలను పార్టీ, ప్రాథమిక సభ్యత్వం సహా అన్ని బాధ్యతల నుంచి తొలగిస్తూ జిల్లా కమిటీ తీర్మానించిందని జిల్లా కార్యదర్శి చంద్రా రాజగోపాల్ మంగళవారం పేర్కొన్నారు. ఈ ముగ్గురు వ్యక్తులు భూపోరాటం పేరుతో పేదల నుంచి నగదు వసూలు చేసి కమిటీకి లెక్క చెప్పక ఆర్థిక అవినీతికి పాల్పడ్డారని ముఠాగా వ్యవహరించి పార్టీ వ్యక్తులతో సఖ్యతగా ఉండడం లేదన్న ఆరోపణలపై వీరిని తొలగించామన్నారు. పార్టీ కార్యకర్తలు, సభ్యులు, సానుభూతిపరులు వీరితో ఎలాంటి కార్యకలాపాలు నెరపరాదని పార్టీ ఆదేశించిందన్నారు.

నేడు ఆయిల్‌ఫెడ్ యూనిట్‌ను ప్రారంభించనున్న సోమిరెడ్డి

నెల్లూరు(కలెక్టరేట్) : వెంటాచలం మండలంలోని సర్వేపల్లిలో ఏర్పాటు చేసిన ఏపీ ఆయిల్‌ఫెడ్ మాన్యుప్యాక్చరింగ్ యూనిట్‌ను రాష్ట్ర వ్యవసాయశాఖా మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి బుధవారం ఉదయం 10 గంటలకు ప్రారంభిస్తారని డీపీఆర్‌వో ఒక ప్రకటనలో తెలిపారు.

విద్యుత్ స్తంభం నుంచి పడి ఒకరికి గాయాలు

కావలి(క్రైం) : కావలి మద్దురుపాడు డీబీఎస్ కళాశాల సమీపంలో విద్యుత్ స్తంభం నుంచి ఒకరు జారిపడి గాయపడిన ఘటన మంగళవారం రాత్రి జరిగింది. పెద్దినేని రామయ్య ఇంట్లోకి విద్యుత్ సరఫరా జరిగే తీగ తెగి పోయింది. రామయ్య స్తంభం ఎక్కి దానిని సరిచేసేందుకు ప్రయత్నించాడు. ఈ సందర్భంలో ఆయన స్తంభం నుంచి జారి కింద పడ్డాడు. గాయపడిన రామయ్య కావలి ఏరియా వైద్యశాలలో చికిత్స పొందుతున్నాడు.

కింకరులైనా నడవలేని కంకర రోడ్డు!

• నిలిచిపోయిన ఆర్టీసీ సర్వీసు • చినుకు పడితే ఛిద్రమే • పట్టించుకోని అధికారులు

ముత్తుకూరు: కృష్ణపట్నం పంచాయతీ మజరా గ్రామం, ముత్తుకూరుకు కూతవేటు దూరంలో ఉన్నా రహదారి సౌకర్యం లేకపోవడంతో కావలి దళితవాడ గ్రామస్థుల అవస్థలు వర్ణనాతీతంగా ఉన్నాయి. ఎప్పుడో వేసిన కంకర రోడ్డే రాకపోకలకు దిక్కయ్యింది. ఇది కూడా దెబ్బతినిపోయి కావలి దళితవాడకు వెళ్లే వారికి నరకం చూపుతోంది. ఎన్నికల సమయంలో మాత్రమే వచ్చే నేతలు రోడ్డు వేయిస్తామని హామీల వర్షం కురిపించి పోతున్నారు. అనంతరం అయిపుండరు. గతంలో ఈ గ్రామానికి ప్రతి రోజూ ఆర్టీసీ బస్సు నడిచేది. రోడ్డు సరిగా లేదన్న కారణంతో నిలిపి వేశారు. దీంతో ముత్తుకూరు రావాలంటే కాలినడకే శరణ్యమైంది. వాహన చోదకులూ అవస్థలు పడుతున్నామంటున్నారు. అభివృద్ధి చెందుతున్న కృష్ణపట్నం పంచాయతీ మజరా గ్రామమైనా కావలి దళితవాడ సంక్షేమాన్ని పట్టించుకోవడం లేదన్న విమర్శలున్నాయి. పరిశ్రమల నిధులతో కావలి దళితవాడ గ్రామానికి తారు రోడ్డు వేయాలని బాధితులు కోరుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కావలి దళితవాడకు దారిచూపాల్సి ఉంది.



చినుకు పడితే అధ్వానంగా తయారయ్యే కావలి దళితవాడ రహదారి

పట్టించుకునేవారేరి?

కృష్ణపట్నం పంచాయతీలోని మా గ్రామాన్ని పట్టిం చుకునే వారు లేరు. ముత్తుకూరు సమీపంలో ఉన్నందున పంచాయతీ పాలకులు కావలి దళితవాడ కృష్ణపట్నం పంచాయతీలో భాగమేనన్న విషయం ఎప్పుడో మరిచిపోయారు. గ్రామానికి రహదారి నిర్మిస్తే ఇబ్బందులు తొలగుతాయి.

- వేణు

నడక నరకప్రాయం

కావలి దళితవాడ గ్రామానికి సరైన రహదారి లేక ఇబ్బందులు పడుతున్నాము. ముత్తుకూరు వెళ్లాలంటే కాలినడకే దిక్కు. రాళ్లుతేలిన రహదారిపై నడవాలంటే నరకప్రాయంగా ఉంది. సంవంధిత అధికారులు స్పందించి తారు రోడ్డు నిర్మించాల్సి ఉంది.

- రఘు

ఆంధ్రజ్యోతి
బుధవారం,
9 ఆగస్టు 2017

ప్రభుత్వ పథకాలు వినియోగించుకోండి : ఐటీడీఏ పీవో



చల్లాయానాదులతో మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో

రాపూరు: చల్లాయానాదులు వారి పిల్లలను పాఠశాలల్లో చేర్పిస్తే ప్రభుత్వం నుంచి అన్ని సంక్షేమ పథకాలు, రుణాలు పొందవచ్చునని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి కమలకుమారి తెలిపారు. రాపూరు తూర్పు అగ్రకట్ట, సాయి గిరిజన కాలనీలను మంగళవారం ఆమె సందర్శించి చల్లాయానాదులతో మాట్లాడారు. చల్లాయానాదుల కోసం ప్రభుత్వం ఎన్నో సంక్షేమ పథకాలు తీసుకువచ్చిందన్నారు. ముఖ్యంగా రేషన్‌కార్డులు, మరుగుదొడ్డి, ఇళ్ల స్థలాలు, పక్కాగృహాలు, రుణాలు వంటివి అందుబాటులో ఉన్నాయన్నారు. వీరంతా తమ తమ పిల్లలను తప్పనిసరిగా పాఠశాలలకు పంపితే ఈ పథకాలను పొందవచ్చన్నారు. చదువుతోనే పిల్లలకు బంగారు భవిష్యత్తు ఉంటుందన్నారు. చల్లాయానాదుల కోసం రాత్రిపూట బడిని ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. రెవెన్యూ, హోప్ రూరల్ అండ్ అర్బన్ సొసైటీ నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

సీఎం చంద్రబాబును ఎందుకు కాల్చి చంపాలి?

● ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ

వెంకటగిరి: ముఖ్యమంత్రి చంద్రబాబును ఎందుకు కాల్చి చంపాలో చెప్పాలని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ వైసీపీ అధినేత జగన్మోహన్ రెడ్డిని ప్రశ్నించారు. మంగళవారం ఆయన స్వగృహంలోని పార్టీ కార్యాలయంలో విలేఖరులతో మాట్లాడుతూ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడుపుతున్నందుకా.. రాష్ట్రం ఆర్థిక సంక్షోభంలో ఉన్నా ప్రజా సంక్షేమ పథకాల అమలులో వెనకడుగు వేయనందుకా.. ఎందుకు కాల్చి చంపాలో చెప్పాలన్నారు. జగన్ మాటలు ఆయన నేర స్వభావానికి అద్దం పడుతున్న విషయాన్ని ప్రజలు అర్థం చేసుకోవాలన్నారు. రాష్ట్రంలో ఇలాంటి ప్రతిపక్ష నేత ఉండటం దురదృష్టకరమన్నారు. ఇలాటి ప్రతిపక్ష నేత ఉన్న సమయంలో తాను ఎమ్మెల్యేగా ఉండటం పూర్వజన్మలో చేసిన పాపంగా భావిస్తున్నానని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ప్రతిపక్ష నేతగా బాబు ఉన్నంత కాలం రాజకీయంగానే విమర్శలు చేశారన్నారు. అధికార పక్షాన్ని రాజకీయంగా నిలదీశారే తప్ప వ్యక్తిగత విమర్శలకు దిగిన దాఖలాలు లేవన్నారు. అలాంటిది తన తండ్రి వయస్సున్న చంద్రబాబును రాష్ట్ర ముఖ్యమంత్రి అన్న గౌరవం కూడా లేకుండా అసభ్య పదజాలంతో మాట్లాడటం ఆయన ఫ్యాక్షన్ రాజకీయాలకు నిదర్శనమన్నారు. తండ్రిని అడ్డుపెట్టుకొని ప్రజాధనం దోచుకున్న జగన్ చంద్రబాబు పేరెత్తేందుకు కూడా అర్హుడు కాడన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కురుగొండ్ల

జగన్‌కు ప్రజలే బుద్ధి చెబుతారు

డక్కిలి: వైసీపీ అధ్యక్షుడు జగన్మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే రోజాలు నాలుక ఉందికదా అని ఇష్టమొచ్చినట్లు మాట్లాడుతున్నారని, వారికి ప్రజలే బుద్ధిచెప్పే రోజులు దగ్గరపడ్డాయని టీడీపీ మండల అధ్యక్షుడు పోలంరెడ్డి కోటేశ్వరరెడ్డి అన్నారు. మంగళవారం ఆయన డక్కిలిలో విలేఖర్లతో మాట్లాడుతూ నంద్యాలలో జగన్‌మోహన్‌రెడ్డికి ఓటమి భయం పట్టుకుందన్నారు. అందుకే ఆయన ఎన్నికలు పూర్తి అయ్యేవరకు అక్కడే ఉంటానని చెప్పడం చూస్తుంటే ఆయన ఎంతగా భయపడుతున్నారో అర్థం అవుతుందన్నారు. ఈ క్రమంలోనే ఆయన ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి అఖిలప్రియపై లేనిపోని ఆరోపణలకు దిగుతున్నారని ఆరోపించారు. సినిమాల్లో రకరకాల దుస్తులు ధరించి ఎక్స్‌పోజ్ ఇచ్చే రోజాకు అఖిలప్రియ డ్రెస్ కోడ్ గురించి మాట్లాడే అర్హత లేదన్నారు. జగన్ కలలో కూడా సీఎం కాలేడని చెప్పారు.

నేడు డక్కిలికి ఎమ్మెల్యే రాక

వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ బుధవారం డక్కిలి మండల పర్యటనకు విచ్చేస్తున్నట్లు పోలంరెడ్డి కోటేశ్వరరెడ్డి తెలిపారు. తొలుత ఆయన దేవునివెల్లంపల్లి వెళ్లి స్తంభాలగిరి ఈశ్వరయ్య స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తారని చెప్పారు. అనంతరం హిందూ దేవాలయ ప్రతిష్టాపన పీఠం ఆధ్వర్యంలో జరిగే సంపూర్ణ గ్రామ దేవాలయ సందర్శన రథయాత్రను ప్రారంభిస్తారని చెప్పారు. అనంతరం కార్యకర్తలు, నాయకులను కలుసుకుని మండల సమస్యలపై చర్చిస్తారన్నారు.

పారదర్శకంగా లబ్ధిదారుల ఎంపిక



లబ్ధిదారుల ఎంపిక చేస్తున్న అధికారులు

డక్కిలి: ఎన్‌టీఆర్ గృహ కల్పన పథకం లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా నిర్వహిస్తున్నట్లు వ్యవసాయశాఖ అధికారి సుజాత పేర్కొన్నారు. మంగళవారం కమ్మపల్లి, వెంబులూరు గ్రామాల్లో లబ్ధిదారుల ఎంపికపై గ్రామ సభలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గృహనిర్మాణ లబ్ధిదారుల ఎంపిక ప్రజల సమక్షంలో పారదర్శకంగా చేస్తున్నామని తెలిపారు. పేదరికాన్ని అర్హతగా తీసుకొని లబ్ధిదారుల ఎంపిక చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుయువత అధ్యక్షుడు ఆర్వీనాయుడు, టీడీపీ నాయకులు దాములనాయుడు, కోటి, ఆలూరు వెంకటేశ్వర్లు, పాయసం ఈశ్వరయ్య పాల్గొన్నారు.

ఎర్రచందనం పరిరక్షణపై అవగాహన



పంగిలిలో మాట్లాడుతున్న టాస్క్‌ఫోర్సు అధికారి

రాపూరు: ఎర్రచందనం పరిరక్షణపై కొండకింద గ్రామమైన పంగిలిలో మంగళవారం రాత్రి టాస్క్‌ఫోర్సు అధికారులు, స్థానిక అటవీ అధికారులతో కలసి రోడ్ షో, లఘుచిత్రప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎర్రచందనం ఎంతో విలువైందని, అరుదైందని ఈ విషయాన్ని అందరూ గుర్తించుకోవాలన్నారు. ఎర్రచందనం వృక్షాలను నరకడం, స్మగ్లింగ్ చేయడం నేరమన్నారు. ఈ కార్యక్రమం ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ మాగంటి కాంతారావు ఆదేశాలతో ఎస్ఐ అశోక్‌కుమార్ పర్యవేక్షణలో నిర్వహిస్తున్నట్లు హెచ్‌సీ సుబ్రహ్మణ్యం తెలిపారు. ఈ కార్యక్రమంలో పీసీలు శ్రీనివాసరావు, పాపారావు, రమేష్, స్థానిక అటవీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

త్వరలో వ్యవసాయ మోటార్లు మార్పిడి

కలువాయి: ఎనర్జీ ఎఫిషియన్సీ సర్వీసు లిమిటెడ్ (ఈఈఎస్ఎల్) స్కీం ద్వారా త్వరలో రైతులు ఉపయోగించే పాత వ్యవసాయ విద్యుత్ మోటార్లు తీసుకుని వాటి స్థానంలో కొత్తవాటిని ఏర్పాటు చేస్తామని డిస్కం పొదలకూరు ఏడీఈ మధుసూదనరెడ్డి తెలిపారు. పొదలకూరు ఏడీఈగా బాధ్యతలు స్వీకరించిన తరువాత మంగళవారం ఆయన తొలిసారి కలువాయి విద్యుత్ సబ్‌స్టేషను తనిఖీ చేశారు. విద్యుత్ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. అనంతరం ఆయన విలేఖరులతో మాట్లాడుతూ విద్యుత్ పొదుపులో భాగంగా ప్రభుత్వం ఎనర్జీ ఎఫిషియన్సీ సర్వీసు పథకం తీసుకొచ్చిందని తెలిపారు. దీని ద్వారా రైతుల ఉపయోగించే 5హెచ్‌పీ మోటార్లు మాత్రమే తీసుకుని దాని స్థానంలో తక్కువ విద్యుత్‌ను తీసుకునే అదే సామర్థ్యం కలిగిన మోటారు రైతులకు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. దీనిపై త్వరలో సమావేశాలు నిర్వహించి రైతుల అభిప్రాయాలు తెలుసుకుంటామన్నారు. ఇంకా పూర్తిస్థాయిలో మార్గదర్శకాలు అందాల్సి ఉందని తెలిపారు. రైతులు, విద్యుత్ వినియోగదారులకు మంచి సేవలు అందించేందుకు కృషి చేస్తానని తెలిపారు. సమస్యలపై వెంటనే స్పందించి వాటిని పరిష్కరిస్తామని తెలిపారు. ఆయన వెంట కలువాయి ఇన్‌చార్జి ఏఈ శివారెడ్డి ఉన్నారు.



విద్యుత్ సబ్‌స్టేషను పరిశీలిస్తున్న మధుసూదనరెడ్డి

చవటపల్లి భూ రికార్డులు క్రోడీకరిస్తున్నాం

కలువాయి: మండలంలోని చవటపల్లి గ్రామం వద్ద సోమశిల కండలేరు వరద ప్రవాహపు కాలువ (తెలుగగంగ) కింద నిర్మించిన రిజర్వాయర్ కారణంగా ముంపునకు గురైయ్యే సీజేఎఫ్ఎస్, డీకేటీ, ప్రభుత్వ భూములకు సంబంధించి అన్ని రికార్డులు క్రోడీకరిస్తున్నట్లు తహసీల్దారు రవీంద్రనాథ్ తెలిపారు. మంగళవారం ఆయన విలేఖరులతో మాట్లాడుతూ ఈ భూములకు సంబంధించి పలు అక్రమాలు జరిగినట్లు ఆరోపణలు వచ్చిన నేపథ్యంలో రికార్డులు అన్నీ సమగ్రంగా పరిశీలిస్తున్నట్లు తెలిపారు. రిజర్వాయర్ నిర్మాణంలో సుమారు 300 ఎకరాలు ప్రభుత్వ, సీజేఎఫ్ఎస్, డీకేటీ భూములు ఉన్నట్లు తెలిపారు. వాటికి సంబంధించిన రికార్డులు ఆత్మకూరు ఆర్డీవో, నెల్లూరు ఆర్డీవో కార్యాలయాల నుంచి తీసుకొచ్చి పరిశీలన జరుపుతామని తెలిపారు. 1977లో అటవీ భూములను స్ప్లిట్ చేసి డీకేజీ, సీజేఎఫ్ఎస్ పట్టాలు ఇచ్చినట్లు మ్యాప్‌లో ఉందన్నారు. 2008లో ఇచ్చిన డీకేటీ పట్టాలకు సంబంధించిన రికార్డులు కూడా పరిశీలిస్తామన్నారు. సమగ్ర పరిశీలన జరిగిన తరువాతే పరిహారం కోసం లబ్ధిదారులకు సర్టిఫికెట్లు ఇస్తామని ఆయన తెలిపారు.

బ్యాండుపాళెంలో వైద్య శిబిరం

వెంకటగిరి(టౌన్): పట్టణంలోని బ్యాండుపాళెంలో శ్రీనివాసన్ సేవా సంస్థ, శ్రీ చక్ర వైద్యశాల ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. రోగులను పరీక్షించి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైద్యులు రవితేజ, శ్రీదేవి, శ్రీనివాస, తదితరులు పాల్గొన్నారు.

మాస్టర్ అథ్లెటిక్స్‌లో రాణించడం హర్షణీయం

వెంకటగిరి(టౌన్): మలేషియాలో జూలై 22, 23వ తేదీల్లో నిర్వహించిన మాస్టర్ అథ్లెటిక్స్‌లో పాల్గొని రాణించడం హర్షనీయమని పట్టణ వైసీపీ కన్వీనర్ గుమ్మళ్లపు డిల్లీబాబు అన్నారు. మంగళవారం స్థానిక తిరుపతి ఎంపీ కార్యాలయంలో వైసీపీ నాయకులు, మహిళలు ఆమెను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మలేషియాలో 400మీటర్ల డిక్స్‌త్రోలో వెండి పతకం, 1600 మీటర్లలో రజత పతకం తీసుకోవడం ఎంతో గర్వించదగ్గ విషయం అన్నారు. ప్రతి మహిళ ఆమెను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఇటువంటి వారిని ప్రభుత్వం గుర్తిస్తే బాగుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో వైసీపీ జిల్లా చేనేత విభాగం అధ్యక్షుడు నక్కా వెంకటేశ్వర్లు, గిరిరెడ్డి, న్యాయవాది రాజేష్, పాకనాటి రాజామణి, వెంకటేశ్వర్లు, మంగళపురి వెంకటేశ్వర్లు, చిరంజీవి, సాయినాయుడు, స్వప్న, సుభాషిణి పాల్గొన్నారు.



ధనియాల రాధను సన్మానిస్తున్న వైసీపీ నాయకులు

మంచినీటి ఎద్దడి లేకుండా చేస్తాం



బోరును ప్రారంభిస్తున్న టీడీపీ నాయకులు

రాపూరు: రాపూరు మేజర్ పంచాయతీలో మంచినీటి ఎద్దడి లేకుండా చేస్తామని టీడీపీ నాయకుడు తుమ్మలపల్లి మధుసూదనరావు అన్నారు. పట్టణంలోని తూర్పు అగ్రకట్ట చల్లాయానాదుల కాలనీలో సీబీఎన్ సహకారంతో హోప్ రూరల్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మంచి నీటి బోరును మంగళవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కిరణ్‌కుమార్, పాస్టర్లు దేవదానం, వెంకటసుబ్బయ్య పాల్గొన్నారు.

చిన్నారులకు ఎమ్మార్ వ్యాక్సిన్ తప్పనిసరి

రాపూరు: తొమ్మిది నెలల నుంచి 15 ఏళ్ల లోపు వయస్సు ఉన్న పిల్లలందరూ తప్పనిసరిగా ఎమ్మార్ వ్యాక్సిన్ వేయించుకోవాలని జిల్లా అబ్జర్వర్ కిరణ్‌కుమార్ అన్నారు. మండలంలోని వేపినాపి పీహెచ్‌సీని మంగళవారం ఆయన పరిశీలించారు. వేపినాపి, సిద్ధవరం గ్రామాల్లో వేస్తున్న వ్యాక్సిన్ కార్యక్రమాన్ని పరిశీలించారు. తప్పనిసరిగా పిల్లలందరినీ గుర్తించి ఈ వ్యాక్సిన్ ఇవ్వాలని వైద్యాధికారులను కోరారు. తట్టు, రుబెల్లా రాకుండా ఈ వ్యాక్సిన్ పనిచేస్తుందన్న విషయాన్ని పిల్లల తల్లిదండ్రులకు తెలియజేయాలన్నారు.



రికార్డులు పరిశీలిస్తున్న అబ్జర్వర్

సినిమా గైడ్

వెంకటగిరి

త్రిభువని:	గౌతమనంద
జ్యోతిమహల్:	డీజే
భ్రమరాంబ :	పిదా

రాపూరు

శ్రీనివాసమహల్:	గౌతమ్‌నందా
వెంకటేశ్వరమహల్:	ఫిదా